

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 246

సోమవారం 20-5-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




విజేత సాత్విక్-చిరాగ్ జోడీ

థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్ -500 టోర్నీలో జయకేతనం - 12లో



బీమా పాలసీ.. అత్యవసర నిధి!

ప్రతి ఒక్కరికీ బీమా అవసరం.. నిధులు కావాల్సి వస్తే రద్దు కోరొద్దు - 13లో



రాహుల్ నోట మావోయిస్టుల భాష

విపక్ష కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ మావోయిస్టుల భాష మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



రాహుల్ సభలో తొక్కిసలాట!

ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పాల్గొన్న ఎన్నికల ప్రచారసభలో తొక్కిసలాట జరగ్గా పలువురికి గాయాలయ్యాయి.

వివరాలు 6లో ▸



నేడే ఐదో దశ పోలింగ్

6 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 49 లోక్‌సభ స్థానాలకు ఈరోజు ఐదో దశ పోలింగ్ జరగనుంది.

వివరాలు 6లో ▸



బీజేపీ కార్యాలయం ముట్టడి

తమ నాయకులను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆప్ ఆదివారం ఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించింది.

వివరాలు 6లో ▸

కచ్చితంగా 'పచ్చ' కుట్రే!

ఎన్నికల్లో అక్రమాలే లక్ష్యంగా టీడీపీ విధ్వంసకాండ

వీడియో, ఫొటో ఆధారాలతో సహా వెలుగులోకి..

- టీడీపీ గూండాగిరీపై గోడు వెళ్లబోసుకున్న బాధితులు
- కీలక ఆధారాలు సేకరించిన సిట్ అధికారులు
- పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో సిట్ విస్తృత విచారణ
- దాడులు జరిగిన ప్రాంతాల్లో పర్యటన.. రికార్డుల పరిశీలన
- ఈసీకి నేడు ప్రాథమిక నివేదిక సమర్పించనున్న సిట్



టీడీపీ గుండాలు చేసిన విధ్వంసకాండను సిట్ అధికారులకు వివరిస్తూ, వారి బెదిరింపుల నుంచి తమను రక్షించాలంటూ వేడుకుంటున్న తిరుపతి జిల్లాలోని రామిరెడ్డిపల్లి వాసులు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటమే ఏకైక లక్ష్యంగా పోలింగ్ సందర్భంగా టీడీపీ విధ్వంస కాండకు బరి తెగించిందని పూర్తి ఆధారాలతో బట్టబయలైంది. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతోపాటు మహిళలు, వృద్ధులను ఓటింగ్‌కు దూరం చేసేందుకు టీడీపీ పక్కా పన్నాగంలో దాడులకు తెగబడి విధ్వంసం సృష్టించిందని స్పష్టమైంది. అందుకు సంబంధించి వీడియో రికార్డింగులు, ఫొటోలతో సహా కీలక ఆధారాలను సిట్ సేకరించింది. పోలింగ్ సందర్భంగా రాష్ట్రంలో యథేచ్ఛగా సాగిన టీడీపీ గూండాగిరీపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వరుసగా రెండో రోజు ఆదివారం విచారణ నిర్వహించింది. సిట్ ఇన్‌చార్జ్‌గా ఉన్న అదనపు డీజీ వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలోని బృందం అనంతపురం జిల్లా తాడిపత్రితో పర్యటించగా, ఇతర బృందాలు పల్నాడు, తిరుపతి జిల్లాల్లో పర్యటించి విచారణ నిర్వహించాయి. దాడులు, దౌర్జన్యాలతో భీతిల్లిన ప్రాంతాలను పరిశీలించాయి. పోలీసులు నమోదు చేసిన కేసుల వివరాలను పరిశీలించడంతోపాటు బాధితుల అభిప్రాయాలు తెలుసుకున్నాయి. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు టీడీపీ ఎంత పక్కాగా పన్నాగాన్ని అమలు చేసిందన్న దానిపై సిట్ అధికారులు ఓ అంచనాకు వచ్చినట్టు సమాచారం. దాడులను అరికట్టడంలో పోలీసుల వైఫల్యంపై కూడా సిట్ అధికారులు ఓ నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. బాధితులతో మాట్లాడి దాడులు ఎలా జరిగాయన్నది తెలుసుకోవడంతోపాటు

మిగతా 3వ పేజీలో ▶

ఆదివారం 'సాక్షి' ప్రధాన కార్యాలయంలో టి20 వరల్డ్‌కప్ ట్రోఫీ ప్రదర్శన సందర్భంగా మాట్లాడుతున్న పీయూష్ చావ్లా. చిత్రంలో సంస్థ సీఈవో అనురాగ్ అగర్వాల్, సాక్షి సిబ్బంది ▼



'సాక్షి'లో

టి20 ప్రపంచ కప్ ట్రోఫీ

హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ట్రోఫీ ప్రదర్శన

క్రికెటర్ పీయూష్ చావ్లాతో చిట్‌చాట్ నిర్వహించిన స్టార్ స్పోర్ట్స్



సాక్షి, హైదరాబాద్: టి20 ప్రపంచ కప్‌లో స్పిన్నర్లు ప్రభావం చూపే అవకాశం ఉందని భారత క్రికెటర్, లెగ్‌స్పిన్నర్ పీయూష్ చావ్లా అభిప్రాయపడ్డారు. ఆ కోణంలో చూస్తే టైటిల్ ఫేవరెట్లలో భారత్ ఒకటని ఆయన అన్నాడు. టి20 వరల్డ్‌కప్ ట్రోఫీ టూర్‌లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని 'సాక్షి' ప్రధాన కార్యాలయంలో ట్రోఫీని అభిమానుల కోసం ప్రదర్శనకు ఉంచారు. టోర్నీ ప్రసారకర్త స్టార్ స్పోర్ట్స్ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో చావ్లా పాల్గొన్నారు. 2007 టి20 వరల్డ్ కప్ విజేత జట్టులో సభ్యుడైన చావ్లా ఆ తర్వాత 2010, 2012 టి20 ప్రపంచకప్‌లు, 2011 వన్డే వరల్డ్‌కప్ కూడా ఆడారు. ఐపీఎల్–2024 టోర్నీలో ముంబై ఇండియన్స్ తరఫున ఆడారు. ఈ సందర్భంగా రాబోయే మెగా టోర్నీపై తన అభిప్రాయాలు వెల్లడించాడు. 'వెస్టిండీస్‌లో గత కొన్నేళ్లలో పిచ్‌లు చాలా నెమ్మదిగా మారాయి. నాకు ఉన్న సమాచారం ప్రకారం అమెరికాలో

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. సత్యదేవుని కల్యాణం



అన్నవరంలో రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి, శ్రీ అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. రత్నగిరిపై రామాలయం పక్కన వార్షిక కల్యాణ మండపంపై ఈ ఉత్సవం నిర్వహించారు.

వివరాలు 5లో ▸

కిర్గిజ్‌స్థాన్‌లో తెలుగువారు సురక్షితం



కిర్గిజ్‌స్థాన్‌లో తెలుగువారు సురక్షిత ప్రాంతాల్లో ఉన్నారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏపీఎన్ఆర్టీఎస్ ఆదివారం పేర్కొంది. కిర్గిజ్‌స్థాన్‌లో భారతీయ విద్యార్థులపై దాడుల జరుగుతున్న నేపథ్యంలో భారతీయ విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

వివరాలు 14లో ▸

మీ పాస్‌వర్డ్ స్ట్రాంగేనా?




ఏటీఎం, ఆన్‌లైన్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌ల విషయంలో నిర్లక్ష్యం ఏమాత్రం తగదని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొందరు మరిచిపోతామనో.. సులభంగా ఉండాలనో ... 1111, 1212 తరహా అత్యంత సాధారణ పాస్‌వర్డ్‌లు పెట్టుకునే వారంతా సైబర్ నేరగాళ్లకు డబ్బులు కాజేసే అవకాశమిచ్చినవారవుతారని పేర్కొంటున్నారు.

వివరాలు 14లో ▸

అండమాన్‌కు 'నైరుతి'

- రెండ్రోజుల్లో మరిన్ని ప్రాంతాలకు విస్తరణ
- 31న కేరళకు.. ఆ తర్వాత ఏపీలోకి రుతుపవనాలు
- 22న బంగాళాఖాతంలో అల్పపీడనం.. అనంతరం బలపడి వాయుగుండంగా.. ఆ తర్వాత తుపానుగా మారే అవకాశం
- రానున్న మూడ్రోజులూ వానలే



సాక్షి, విశాఖపట్నం/సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగా అంచనా వేసిన విధంగానే నైరుతి రుతుపవనాలు ఆదివారం దక్షిణ అండమాన్ సముద్రంలోకి ప్రవేశించాయి. వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఇవి చురుగ్గా కదులుతూ దక్షిణ బంగాళాఖాతం, నికోబార్ దీవులు, మాల్దీవులు, కొమరిన్‌లోని కొన్ని ప్రాంతాల్లోకి విస్తరించాయి. రానున్న రెండ్రోజుల్లో ఇవి మరిన్ని ప్రాంతాలకు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఐఎండీ వెల్లడించింది. ఇక ఈ రుతు పవనాలు మే 31న కేరళను తాకనున్నట్టు భారత వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. ఇంకా ముందు రావడానికి కూడా అవకాశం ఉంది. ఆ తర్వాత ఏపీలోకి 2–3 తేదీల్లో ప్రవేశిస్తాయి. లా నినా పరిస్థితులు భారత్‌కు అనుకూలంగా ఉండటంతో ఈ ఏడాది సాధారణంగా కంటే ఎక్కువగానే వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నట్లు ఐఎండీ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

బలహీనపడ్డ ద్రోణి.. మూడ్రోజులు వర్షాలు..

మరోవైపు.. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు తెలంగాణ, రాయలసీమల మీదుగా సముద్ర మట్టానికి 3.1 కి.మీల ఎత్తులో ఉన్న ద్రోణి బలహీనపడింది. ప్రస్తుతం రాష్ట్రంపైకి ఆగ్నేయ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రానున్న మూడ్రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి

మిగతా 2వ పేజీలో ▶

అనుమతి లేకుండా అమెరికాకు..

ముందస్తు బెయిల్ లేకుండా విదేశాలకు చంద్రబాబు

- ఫైబర్‌నెట్ కేసులో సుప్రీంలో కొనసాగుతున్న విచారణ
- శంషాబాద్ విమానాశ్రయంలో అడ్డుకున్న ఇమ్మిగ్రేషన్ అధికారులు
- సుదీర్ఘ వివరణ అనంతరం ఎట్టకేలకు అనుమతి
- పర్యటన గురించి ఎవరికీ తెలియకుండా జాగ్రత్తలు
- నాలుగు రోజుల క్రితమే గుట్టుగా వెళ్లిపోయిన లోకేశ్



సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో జరిగిన పలు కుంభకోణాల్లో ప్రధాన నిందితుడుగా ఉన్న మాజీ సీఎం చంద్రబాబు గుట్టుచప్పుడు కాకుండా అమెరికా వెళ్లడం కలకలం రేపుతోంది. ఒకవైపు చంద్రబాబుపై సీఐడీ జారీ చేసిన లుక్ అవుట్ నోటీసు అమలులో ఉండగా మరోవైపు ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లు సుప్రీం కోర్టులో ఇంకా విచారణలోనే ఉన్నాయి. దీంతో హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు చంద్రబాబును శనివారం తెల్లవారుజామున కొద్దిసేపు నిలువరించారు. చంద్రబాబు దేశం విడిచి వెళ్లకూడదని సీఐడీ గతేడాది లుక్ అవుట్ నోటీసు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విదేశీ ప్రయాణానికి కోర్టు అనుమతి ఉందా? అని ప్రశ్నించడంతో చంద్రబాబు కంగుతిన్నారు. తటపటాయిస్తూ సుదీర్ఘ వివరణ ఇచ్చిన తరువాత ఇమిగ్రేషన్ అధికారులు పలు దఫాలు సీఐడీ అధికారులతో చర్చించారు. అనంతరం ఎట్టకేలకు అనుమతించారు.

పార్టీ ఖాతాల్లోకి అవినీతి నిధులు..

టీడీపీ హయాంలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌తోపాటు ఫైబర్ నెట్, అసైన్డ్ భూములు, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణాల్లో చంద్రబాబును ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ సీఐడీ కేసులు నమోదు చేసిన

మిగతా 2వ పేజీలో ▶



పశుపోషకులకు బాసటగా..

దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న 'వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలు'

- పాడి రైతు గడప వద్దకు నాణ్యమైన పశు వైద్య సేవలు
- ఒక్క ఫోన్ కాల్‌తో మూగ జీవాలకు ఉచితంగా వైద్యం, మందులు
- 1962 కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే గంటలోపే అంబులెన్స్‌లు
- రెండేళ్లలో 8.81 లక్షల మూగజీవాలకు రక్షణ
- రూ. 24.48 కోట్ల విలువైన మందుల పంపిణీ
- 7.55 లక్షల మంది పాడి రైతులకు మేలు

2లో

అంతరిక్షంలోకి వెళ్లొచ్చిన తెలుగోడు

మొట్టమొదటి భారత స్పేస్ టూరిస్టుగా ఘనత

అంతరిక్ష ప్రయాణం చేసిన రెండో భారతీయుడిగా రికార్డు



వాషింగ్టన్: తెలుగు బిడ్డ గోపీ తోటకూర చరిత్ర సృష్టించారు. అంతరిక్షంలోకి వెళ్లివచ్చిన తొలి భారత స్పేస్ టూరిస్టుగా ఘనత సాధించారు. అంతే కాదు, అంతరిక్ష ప్రయాణం చేసిన రెండో భారతీయుడిగా రికార్డుకెక్కారు. 1984లో భారత సైన్యానికి చెందిన వింగ్ కమాండర్ రాకేశ్ శర్మ మొట్టమొదటిసారి అంతరిక్ష ప్రయాణం చేసిన సంగతి తెలిసిందే. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ సారథ్యంలోని బ్లూ ఆరిజిన్ ప్రైవేట్ సంస్థ ఔత్సాహికులను అంతరిక్షంలోకి తీసుకెళ్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఏడో హ్యూమన్ ఫ్లైట్ 'ఎన్–25'ఆదివారం ఉదయం అమెరికాలోని వెస్ట్ టెక్సాస్ లాంచ్ సైట్ నుంచి అంతరిక్షంలోకి బయలుదేరింది. 10 నిమిషాలకుపైగా అంతరిక్షంలో విహరించి, క్షేమంగా వెనక్కి తిరిగివచ్చింది. ఈ రాకెట్‌లో ప్రయాణించిన ఆరుగురిలో గోపీ తోటకూర కూడా ఉన్నారు. భూవాతావరణం, ఔటర్ స్పేస్ సరిహద్దు రేఖ అయిన కర్మాన్ లైన్ పైభాగం వరకు వీరి ప్రయాణం సాగింది. అంతరిక్షాన్ని తాకి వచ్చారు. భూమి ఉపరితలం నుంచి 100 కిలోమీటర్లలో కర్మాన్ లైన్ ఉంటుంది. బ్లూ ఆరిజిన్ సంస్థ ద్వారా ఇప్పటిదాకా 31 మంది స్పేస్ టూరిస్టులుగా అంతరిక్ష ప్రయాణం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జన్మించిన గోపీ తోటకూర ఎంబ్రీ–రిడిల్ ఏరోనాటికల్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. పైలట్‌గా శిక్షణ పొందారు. ప్రిజర్వ్ లైఫ్ కార్పొరేషన్ అనే సంస్థకు సహ వ్యవస్థాపకుడు. ఇంటర్నేషనల్ మెడికల్ జెట్ పైలట్‌గా పని చేస్తున్నారు. గోపీకి సాహసాలంటే ఇష్టం. ఇటీవలే టాంజానియాలోని అత్యంత ఎత్తయిన పర్వతం మౌంట్ కిలిమంజారోను అధిరోహించారు.

60 ఏళ్ల తర్వాత.. నెరవేరిన కల

అమెరికాకు చెందిన మొట్టమొదటి నల్ల జాతి వ్యోమగామి, ఎయిర్‌ఫోర్స్ మాజీ కెప్టెన్ ఎడ్ డ్వైట్ కల ఎట్టకేలకు నెరవేరింది. ఆయన వయసు 90 ఏళ్లు. ఈ వయసులో అంతరిక్ష ప్రయాణం విజయవంతంగా పూర్తిచేశారు. ఆదివారం బ్లూ ఆరిజిన్ 'ఎన్–25'మిషన్‌లో అంతరిక్షంలోకి వెళ్లొచ్చారు. 1963లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ 'నాసా'అంతరిక్ష ప్రయాణాల కోసం ఎడ్ డ్వైట్‌ను కూడా ఎంపిక చేశారు. కానీ, ఆయనకు అంతరిక్షంలోకి వెళ్లే అవకాశం అప్పట్లో లభించలేదు. 60 ఏళ్ల తర్వాత కల నెరవేర్చుకున్నారు.

ఖరీఫ్‌లో ఎరువుల సరఫరాకు కార్యాచరణ



- 17.50 లక్షల టన్నులు అందించాలని లక్ష్యం
- ఇందులో ఆర్బీకేల ద్వారా 5.60 లక్షల టన్నుల సరఫరా
- నాలుగేళ్లలో రూ.1,311 కోట్ల విలువైన 11.88 లక్షల టన్నుల సరఫరా
- గ్రామస్థాయిలో ఎరువుల నిల్వలకు ప్రత్యేక ఏర్పాట్లు
- లోడింగ్, అన్‌లోడింగ్, రవాణా చార్జీల భారం ప్రభుత్వానిదే
- బస్తాపై కనీసం రూ.20కు తక్కువ కాకుండా రైతులకు ఆదా

2లో

ఘనంగా మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి జయంతి

నివాళులర్పించిన రాష్ట్రపతి ముర్ము

సాక్షి, న్యూఢిల్లీ: దేశ ఆరో రాష్ట్రపతిగా సేవలందించిన డాక్టర్ నీలం సంజీవరెడ్డి 111వ జయంతిని ఆదివారం రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నీలం సంజీవరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

'సాక్షి'లో టి20 ప్రపంచ కప్ ట్రోఫీ

▶ మొదటి పేజీ తరువాయి

పిచ్‌లు కూడా అలాగే ఉండబోతున్నాయి. కాబట్టి స్పిన్నర్లు ప్రధాన పాత్ర పోషించగలరు. ఒంటిచేత్తో మ్యాచ్‌ను మార్చేయగలరు. నా దృష్టిలో భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, వెస్టిండీస్ సెమీఫైనల్ చేరతాయి' అని చావ్లా అన్నారు. వరల్డ్‌కప్ కోసం కెప్టెన్ రోహిత్ శర్మ, బుమ్రా పూర్తి సన్నద్ధంగా ఉన్నారని వెల్లడించారు. ఆద్యంతం సరదాగా సాగిన ఈ కార్యక్రమంలో సాక్షి మీడియా గ్రూప్ సీఈవో అనురాగ్ అగర్వాల్, సాక్షి సిబ్బంది, అభిమానులు పాల్గొన్నారు. టోర్నీకి సంబంధించిన పలు ప్రశ్నలు అడిగిన స్టార్ స్పోర్ట్స్ బృందం సరైన సమాధానాలు ఇచ్చిన వారికి బహుమతులు అందించింది.

ఖరీఫ్‌లో ఎరువుల సరఫరాకు కార్యాచరణ

- 17.50 లక్షల టన్నులు అందించాలని లక్ష్యం
- ఇందులో ఆర్బీకేల ద్వారా 5.60 లక్షల టన్నుల సరఫరా



సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలో ఎరువుల సరఫరాను మరింత మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను సిద్ధంచేస్తోంది. 2024–25 వ్యవసాయ సీజన్‌లో ఆర్బీకేలలో ఎరువులు లేవన్న మాట వినిపించకూడదన్న లక్ష్యంతో రైతులు కోరుకున్న ఎరువులను అందించేలా ఏర్పాట్లుచేస్తోంది. గడిచిన నాలుగేళ్లలో ఆర్బీకేల ద్వారా 31.54 లక్షల మంది రైతులకు రూ.1,311.80 కోట్ల విలువైన 11.88 లక్షల టన్నుల ఎరువులు సరఫరా చేయగా, రానున్న సీజన్‌లో కనీసం 10 లక్షల టన్నుల ఎరువుల సరఫరాకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

రైతులకు రూ.100 కోట్ల వరకు ఆదా

సాగు ఉత్పాదకాల పంపిణీలో ఆర్బీకేలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. గతంలో ఎరువుల కోసం రైతులు మండల, జిల్లా కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారు. అయినా అరకొరగానే అందేవి. ఒక్కోసారి సమయానికి దొరక్క బ్లాక్‌లో కొనాల్సి వచ్చేది. ఎరువుల వంకతో అవసరంలేని పురుగుల మందులను కొనాల్సి రావడం రైతులకు భారంగా మారేది. ప్రస్తుతం సర్టిఫై చేసిన ఎరువులను ఆర్బీకేల ద్వారా అందుబాటులో ఉంచడంతో ఎరువు కోసం రైతులు ఇబ్బందిపడిన దాఖలాలు కన్పించలేదు. లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీల కింద బస్తాకు రూ.20 నుంచి రూ.50 వరకు రైతులకు ఆదా అవుతోంది. ఇలా నాలుగేళ్లలో రూ.100 కోట్లకు పైగా రైతులకు ఆదా అయ్యింది.

ఆర్బీకేలకు ఎరువుల లైసెన్సులు

కేంద్రం కేటాయించిన ఎరువులను జిల్లాల వారీగా మార్క్‌ఫెడ్ గోడౌన్లలో నిల్వచేసి అక్కడ నుంచి పీఏసీఎస్, ఆర్బీకేలకు సరఫరా చేయడానికి ఏటా రూ.70 కోట్లకు పైగా ఖర్చవుతోంది. ఈ భారాన్ని గత నాలుగేళ్లుగా ప్రభుత్వమే భరిస్తోంది. వచ్చే ఏడాది నిల్వ సామర్థ్యం పెరగనుండడంతో ఇందుకు కనీసం రూ.150 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఈ భారాన్ని తగ్గించుకోవడంతో పాటు పంపిణీలో జాప్యాన్ని నివారించేందుకు ప్రతీ ఆర్బీకేలో కనీసం 20 టన్నులు అందుబాటులో ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో వివిధ శాఖల పరిధిలో 1,864 గోదాములు, సచివాలయ ప్రాంగణాల్లో 3,979 గోదాములు అందుబాటులో ఉన్నాయి. ఆర్బీకేలకు అనుబంధంగా 500 టన్నుల సామర్థ్యంతో రూ.493.15 కోట్లతో 1,167 గోదాములు నిర్మిస్తుండగా, వాటిలో 664 గోదాములు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన చోట్ల అద్దెకు తీసుకోవాలని భావిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆర్బీకేలకు ఎరువుల విక్రయ లైసెన్సులు జారీచేశారు. ఫలితంగా సమయంతో పాటు రవాణా, హ్యాండ్లింగ్ చార్జీలు చాలావరకు తగ్గే అవకాశాలున్నాయి.

ఖరీఫ్-24కు 17.50 లక్షల టన్నులు ఎరువులు..

ఇక ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 81.25 లక్షల ఎకరాలు. ఇందులో ప్రధానంగా 37.79 లక్షల ఎకరాల్లో వరి, 14.48 లక్షల ఎకరాల్లో పత్తి, 13.88 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 5.85 లక్షల ఎకరాల్లో కందులు, 3.10 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేస్తుంటారు. ఖరీఫ్ కోసం 17.50 లక్షల టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేశారు. ఇందులో 6.50 లక్షల టన్నుల యూరియా, 2.30 లక్షల టన్నుల డీఏపీ, ఏడు లక్షల టన్నుల కాంప్లెక్స్, లక్ష టన్నుల ఎస్ఎస్‌పీ, 70 వేల టన్నుల ఎంఓపీ ఎరువులు అందుబాటులో ఉంచేలా కార్యాచరణ సిద్ధంచేశారు. మరోపక్క.. ఇఫ్కో ద్వారా 5 లక్షల నానో యూరియా, 2 లక్షల నానో డీఏపీ బాటిల్స్ సరఫరాకు ఏర్పాట్లుచేస్తున్నారు. రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల్లో కనీసం 5.60 లక్షల టన్నులు ఆర్బీకేల ద్వారా సరఫరాకు ప్రణాళిక సిద్ధంచేసారు.



ప్రాసెస్డ్ ఫుడ్స్.. ఆరోగ్యం మటాష్

- ఇవి తింటే క్యాన్సర్, స్థూలకాయం, గుండె జబ్బులు, మధుమేహం ముప్పు
- జీవనశైలి మార్పులతో పెరిగిన ప్యాకింగ్ ఫుడ్స్ వినియోగం
- గ్రామీణ ప్రాంతాల్లోనూ చొరబడటంపై నిపుణుల ఆందోళన
- ఐస్‌క్రీమ్, కూల్‌డ్రింక్స్, రెడీ మీల్స్, ప్రాసెస్ మాంసం, నూడుల్స్ వద్దంటున్న శాస్త్రవేత్తలు
- 'బ్రిటిష్ మెడికల్ జర్నల్'లో ప్రచురించిన అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: ప్రాసెస్డ్, అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారాల వినియోగం తీవ్ర అనారోగ్య సమస్యలకు దారితీస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడుగురి పెద్దల్లో ఒకరు, ప్రతి 8మంది చిన్నారుల్లో ఒకరిని ప్రాసెస్డ్ ఫుడ్ వ్యసనపరులుగా మారుస్తోంది. ఐస్‌క్రీమ్, కూల్ డ్రింక్స్, రెడీ మీల్స్ (రెడీ టు ఈట్), ప్రాసెస్ చేసిన మాంసపు ఉత్పత్తులతో క్యాన్సర్, బరువు పెరుగుదల, గుండె జబ్బులు, మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా సంభవిస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. 36 దేశాలకు చెందిన 281 అధ్యయనాలను విశ్లేషించడం ద్వారా 'అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ అడిక్షన్' ప్రమాదాలను కనుగొన్నారు. మొత్తం జనాభాలో 14 శాతం మంది పెద్దలు, 12 శాతం మంది చిన్నారులు నిత్యం ప్రాసెస్డ్ ఆహారాన్ని మాత్రమే భుజిస్తున్నట్టు బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనంలో తేలింది.

మద్యంతో సమానం

ప్రాసెస్డ్ ఆహార పదార్థాలు అతిగా తీసుకునే వారిలోనూ, ఆల్కాహాల్ తీసుకున్న వ్యక్తుల లోనూ మెదడు స్ట్రియాటమ్‌లో ఎక్స్‌ట్రా సెల్యులర్ డోపమైన్‌ను ఒకే స్థాయిలో ప్రేరేపిస్తున్నట్టు తేల్చారు. తద్వారా తీవ్రమైన కోరికలు, స్థూలకాయం, తిండిపై నియంత్రణ లేకపోవడం, అతిగా తినే రుగ్మత, శారీరక–మానసిక అనారోగ్యం తదితర ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొంది. యూకే, యూఎస్‌లలో సగటు వ్యక్తి ఆహారంలో సగానికిపైగా ప్రాసెస్డ్ ఫుడ్స్ వినియోగిస్తున్నారు. ఇలా ప్రపంచవ్యాప్తంగా అసమతుల్య ఆహారాన్ని తీసుకోవడంతో వైద్యం, పర్యావరణ కోసం ఏడాదికి 7 ట్రిలియన్ డాలర్లకుపైగా అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా స్థూలకాయం, నాన్–కమ్యూనికేబుల్ వ్యాధులు ఉన్నత, మధ్య ఆదాయ దేశాలలో గణనీయంగా పెరిగాయి. పట్టణీకరణ, జీవనశైలిలో మార్పులతోపాటు స్త్రీ, పురుషుల ఉద్యోగాలు, ప్రయాణ సమయాలు పెరగడంతో కొన్ని దేశాల్లో అధికంగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల వినియోగం ఎక్కువగా ఉంది. ప్రాసెస్ చేసిన జంతు ఆధారిత ఉత్పత్తులు, నూడుల్స్, కృత్రిమ స్వీటెనర్లతో కార్డియో వాస్కులర్, కార్డియో మెటబోలిక్ కోమోర్బిడిటీలు 9శాతం పెరుగుతోంది. అయితే రొట్టెలు, తృణధాన్యాలు, మొక్కల ఆధారిత ఉత్పత్తులు వంటి ఇతర అల్ట్రా ప్రాసెస్ చేసిన ఆహారాలు ఎటువంటి ఆరోగ్య ప్రమాదాలను కలిగి ఉండవని నివేదించింది.

పౌష్టికాహార భద్రత లోపం

ఇప్పటికే ఆసియా, లాటిన్ అమెరికాల్లో అత్యంత ప్రాసెస్‌తోపాటు సహా ప్రాసెస్ చేసిన ఆహారాల వినియోగం పెరుగుతోంది. ఇది ఆఫ్రికాకు కూడా వేగంగా వ్యాపిస్తోంది. అయితే కోవిడ్–19కి ముందు స్థాయిల కంటే చాలా ఎక్కువగా ఉంది. తద్వారా పౌష్టికాహార లోపం భయపెడుతోంది. ప్రపంచ జనాభాలో దాదాపు 29.6 శాతం మంది (240 కోట్ల మంది ప్రజలు) 2022లో తీవ్రంగా ఆహార భద్రతను ఎదుర్కొన్నారు. వీరిలో దాదాపు 90 కోట్ల మంది (11.3 శాతం మంది) ఆహార అభద్రతలో తీవ్రంగా కూరుకుపోయారు. ఇక 2030లో దాదాపు 60 కోట్ల మంది దీర్ఘకాలికంగా పోషకాహార లోపంతో బాధపడతారని ఐక్యరాజ్య సమితి సైతం ఆందోళన చెందుతోంది. తొమ్మిది దక్షిణాసియా దేశాలలో పోషకాహార లోపం (24 కోట్ల మంది)లో ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ తర్వాత భారతదేశం మూడవ స్థానంలో ఉంది. భారత్‌లో పోషకాహార లోపం 2004–06లో 21.4 శాతం నుంచి 2020–22 నాటికి 16.6కి తగ్గింది. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ప్రాసెస్డ్ ఫుడ్స్ ఎక్కడికక్కడ లభిస్తున్నాయి. నగరం/పట్టణం నుంచి 1–2 గంటలు, అంతకంటే ఎక్కువ ప్రయాణ సమయం ఉన్న గ్రామాల్లోనూ ఈ ఆహార విధానం వృద్ధి చెందడం ఆందోళన కలిగిస్తోంది.

పశుపోషకులకు బాసటగా..

దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న 'వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలు'

- పాడి రైతు గడప వద్దకు నాణ్యమైన పశు వైద్య సేవలు
- ఒక్క ఫోన్ కాల్‌తో మూగ జీవాలకు ఉచితంగా వైద్యం, మందులు
- 1962 కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే గంటలోపే రైతు ముంగిట అంబులెన్స్‌లు
- రెండేళ్లలో 8.81 లక్షల మూగజీవాలకు రక్షణ
- రూ. 24.48 కోట్ల విలువైన మందుల పంపిణీ
- 7.55 లక్షల మంది పాడి రైతులకు మేలు

■ బాపట్ల జిల్లా రామకృష్ణ నగర్‌కు చెందిన పి.వెంకటేశ్వర్లుకు ఆరు పాడి గేదెలున్నాయి. ఓ పశువు కొమ్ము విరిగిపోవడంతో తీవ్ర రక్తస్రావంతో కదల్లేని స్థితిలో కూలబడిపోయింది. ఉదయం 9.40 గంటలకు 1962కి కాల్ చేయగా 10.30 నిమిషాలకు అంబులెన్స్ ఇంటికే వచ్చింది. నొప్పి నివారణకు డాక్టర్ ఇంజక్షన్ ఇవ్వడంతో కొద్దిసేపట్లోనే కోలుకుని లేచి నిలబడగలిగింది. ఇప్పటివరకు మనుషుల కోసమే అంబులెన్స్ వస్తుందనుకున్నాం. మూగ జీవాలను సైతం సంరక్షిస్తూ ఉచితంగా మందులు కూడా అందించే సౌకర్యం కల్పించిన సీఎం జగన్‌కు ఆ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.





ఎన్టీఆర్ జిల్లాలో ప్రమాదవశాత్తు గాయపడిన పశువుకు చికిత్స చేస్తున్న దృశ్యం

ఇప్పటి వరకు సేవలు పొందిన జీవాలు	
ఆవులు	3,72,219
గేదెలు	3,59,887
గొర్రెలు	62,048
మేకలు	54,825
కోళ్లు	30,564
ఇతర జీవాలు	1,009

ప్రాణాలను కాపాడగలిగాయి.

సాక్షి, అమరావతి: ఎవరైనా ఊహించారా మూగ జీవాల కోసం అంబులెన్స్‌లు వస్తాయని, పాడి రైతు ఇంటి వద్దే ఆ మూగజీవాలకు వైద్యం అందుతుందని.. అయితే ఈ ఊహాతీతమైన విషయాన్ని నిజం చేసింది వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం. వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలు అందుబాటులోకి తెచ్చి పాడి రైతులకు అండగా నిలిచింది. మూగజీవాలకు అత్యవసర సమయాల్లో ఉచితంగా మెరుగైన వైద్య సేవలందించే లక్ష్యంతో తీసుకొచ్చిన మొబైల్ అంబులేటరీ క్లినిక్స్ పశుపోషకులకు వరంగా మారాయి. 108 తరహాలోనే ఫోన్ చేసిన అరగంటలోనే పాడిరైతుల ఇంటి వద్దకు చేరుకుని వైద్యసేవలు అందిస్తున్నాయి. పాడి రైతుల జీవనాధారాన్ని నిలబెడుతున్నాయి. ఈ వాహనాలు రోడ్డెక్కి రెండేళ్లు కూడా పూర్తి కాకుండానే 8.81 లక్షల మూగజీవాలను ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడగలిగాయి. ఏపీలోని సంచార పశు వైద్య సేవలపై కేరళ, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్ బృందాలు అధ్యయనం చేశాయి. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో వీటిని ప్రవేశపెడుతున్నారు. ఏపీలో సేవలను సమర్థంగా నిర్వహిస్తున్న ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈఎంఆర్ఐ) గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థకే ఆ రెండు రాష్ట్రాలు వాహనాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఏపీ మోడల్‌లోనే పంజాబ్, కేరళ తదితర రాష్ట్రాల్లో మొబైల్ అంబులేటరీ వాహన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సకాలంలో వైద్యసేవలందించడమే లక్ష్యం..

గతంలో పశువులకు అనారోగ్య సమస్య తలెత్తితే సుమారు 5 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉండే పశు వైద్యశాలలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి. పాడి పశువులకు రైతుల ఇంటి ముంగిటే వైద్యసేవలందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 2022 మే 20వ తేదీన మొబైల్ అంబులేటరీ క్లినిక్స్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. నియోజకవర్గానికి 2 చొప్పున రూ. 210 కోట్లతో 340 అంబులెన్స్‌లను, ప్రత్యేకంగా 1962 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అంబులెన్స్‌లో పశువైద్యుడు, వెటర్నరీ డిప్లొమో సహాయకుడు, డ్రైవర్ కమ్ అటెండర్లను అందుబాటులో ఉంచారు. 20 రకాల పేడ సంబంధిత పరీక్షలు, 15 రకాల రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా మైక్రో స్కోప్‌తో సహా 33 రకాల పరికరాలతో కూడిన చిన్న ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. ప్రతీ వాహనంలో 51 రకాల వైద్య పరికరాలను ఉంచారు. ప్రథమ చికిత్సతో పాటు చిన్న తరహా శస్త్రచికిత్సలు, కృత్రిమ గర్భధారణ లాంటి సేవలకు ప్రతీ వాహనంలో రూ. 30 వేల విలువైన 81 రకాల మందులను అందుబాటులో ఉంచుతున్నారు. ఈ వాహనాల ద్వారా 295 పశువైద్యులు, 337 పశువైద్య సహాయకులు సేవలందిస్తున్నారు. పశువులను సమీప ఆస్పత్రులకు తరలించేందుకు వీలుగా వాహనంలో హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యాన్ని కల్పించారు. వైద్య సేవల అనంతరం తిరిగి ఇంటి వద్దకే తీసుకొచ్చి అప్పగించేలా ఏర్పాటు చేయడంతో రైతులకు వ్యయ ప్రయాసలు, రవాణా భారం తొలగిపోయాయి. 1962 కాల్ సెంటర్‌కు నిత్యం సగటున 1778 ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. గడిచిన రెండేళ్లలో ఈ వాహనాలు మండలానికి 5 నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న 11,987 మారుమూల గ్రామాలకు చేరుకుని వైద్య సేవలందించాయి. సుమారు రెండేళ్లలో రూ. 24.48 కోట్ల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఫలితంగా ఇప్పటి వరకు 7,55,326 మంది పశుపోషకులకు జీవనోపాధిని కాపాడగలిగారు.

నిజంగా గొప్ప ఆలోచన..



నాకు ఐదు పాడి ఆవులున్నాయి. పశువులు కొట్లాడుకోవడంతో ఓ ఆవు తీవ్రంగా గాయపడింది. 1962కి ఫోన్ చేయగా గంటలో అంబులెన్స్ ఇంటికే వచ్చింది. గాయాన్ని శుభ్రం చేసి కుట్లు వేసి వైద్యం చేశారు. ఉచితంగా మందులిచ్చారు. గతంలో పశువైద్యశాలకు తరలించేందుకు ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. ఇంటి వద్దే జీవాలకు సేవలందించడం నిజంగా గొప్పఆలోచన. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

–కాటి విద్యాసాగర్, కోతపేట, బాపట్ల జిల్లా

అరగంటలోనే అంబులెన్స్..



మాకు రెండు పాడి గేదెలు, నాలుగు సన్న జీవాలున్నాయి. మేతకు వెళ్లిన ఓ గేదెకు కాలు చీరుకుపోవడంతో నడవలేకపోయింది. 1962కు కాల్‌చేస్తే అరగంటలో అంబులెన్స్ వచ్చింది. పశువు కాలుకు డ్రెస్సింగ్ చేసి బ్యాండేజ్ కట్టారు. నొప్పికి ఇంజక్షన్ ఇచ్చారు. హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా పశువుని తరలించే విధానం చాలా బాగుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఎం.అసిరిరెడ్డి, దళ్లిపేట, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా

మాబోటి రైతులకు ఎంతో మేలు..



నాకు 12 ఆవులున్నాయి. ఓ ఆవు కడుపునొప్పితో చాలా ఇబ్బందిపడింది. 1962కి కాల్ చేశా. వెంటనే అంబులెన్స్ వచ్చింది. డాక్టర్ చికిత్స అందించారు. ఆవు కోలుకొని నిలబడేలా చేశారు. మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌ల ఏర్పాటు ఆలోచన చాలా బాగుంది. మాబోటి పేద రైతులకు ఇవి ఎంతో మేలు చేస్తాయి.

– పర్రి ఉమా మహేశ్వరరావు, పర్రిపుత్రుగ, కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా

తెలంగాణ కేబినెట్ భేటీకి షరతులతో ఈసీ అనుమతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ భేటీ నిర్వహణ కోసం పలు షరతులతో కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి అవినాశ్‌కుమార్ ఆదివారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్‌కు లేఖ రాశారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు.. అత్యవసరమైన, నిర్ణీత గడువులోగా అమలు చేయాల్సిన అంశాలను మాత్రమే కేబినెట్ భేటీలో చర్చించాలని లేఖలో ఈసీ స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెల్లడికానున్న నేపథ్యంలో.. అప్పటివరకు నిరీక్షించడం సాధ్యం కాని, అత్యవసరమైన అంశాలను మాత్రమే మంత్రివర్గ సమావేశం ఎజెండాలో చేర్చాలని పేర్కొంది. మంత్రివర్గ సమావేశం ఎజెండాలో ప్రతిపాదించిన రుణమాఫీ, హైదరాబాద్ ఉమ్మడి రాజధాని వంటి అంశాలను లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు వాయిదా వేసుకోవాలని సూచించింది. ఇక ఎన్నికల నిర్వహణలో పాలుపంచుకున్న రాష్ట్ర ప్రభుత్వ అధికారులెవరినీ సమావేశానికి హాజరుకావాలని కోరరాదని ఆదేశించింది. తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది.

అనుమతి లేకుండా అమెరికాకు..

▶ మొదటి పేజీ తరువాయి

విషయం తెలిసిందే. స్కిల్ స్కామ్ కేసులో సీఐడీ ఆయన్ని అరెస్ట్ చేయగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో 52 రోజుల పాటు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అనంతరం బెయిల్‌పై విడుదల అయ్యారు. కాగా ఫైబర్ నెట్ కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించడంతో చంద్రబాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ సీఐడీ వాదనలు వినిపించింది. కొల్లగొట్టిన నిధులను టీడీపీ బ్యాంకు ఖాతాలకు తరలించిన విషయాన్ని న్యాయస్థానానికి నివేదించింది. దీనిపై బాబును కస్టడీకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. పిటిషన్ సుప్రీం కోర్టులో విచారణలో ఉంది.

షరతులు బేఖాతర్!

స్కిల్ స్కామ్ కేసులో నిందితులైన చంద్రబాబు, ఆయన మాజీ పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, కిలారు రాజేష్‌పై సీఐడీ లుక్ అవుట్ నోటీసులు జారీ చేసింది. సీఐడీ అదనపు డీజీ అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదని అందులో స్పష్టం చేసింది. అయితే సీఐడీ ముందస్తు అనుమతి లేకుండానే చంద్రబాబు అమెరికా వెళ్లేందుకు సిద్ధపడ్డారు. ఫైబర్ నెట్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ న్యాయస్థానంలో విచారణలో ఉంది. దీంతో ఇమ్మిగ్రేషన్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో చంద్రబాబు న్యాయవాదులు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో సీఐడీ అధికారులతో చర్చించారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ నెట్, అసైన్డ్ భూములు, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణాల్లో చంద్రబాబును ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ ఇప్పటికే న్యాయస్థానంలో చార్జ్‌షీట్లు దాఖలు చేసిన విషయాన్ని సీఐడీ అధికారులు ఇమిగ్రేషన్ అధికారులకు తెలియచేశారు. సీఐడీకి సమాచారం ఇచ్చిన తరువాతే విదేశాలకు వెళ్లాలని చెప్పారు. చార్జ్‌షీట్లను పరిగణనలోకి తీసుకున్న తరువాత న్యాయస్థానం విధించే షరతులను పాటించాలన్నారు. ఈ క్రమంలో ప్రస్తుతానికి అమెరికా వెళ్లేందుకు సమ్మతించారు. సీఐడీ అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదని మరోసారి చంద్రబాబుకు నోటీసులు జారీ చేస్తామని సీఐడీ అధికారులు పేర్కొన్నారు. న్యాయస్థానం షరతులు, ఫైబర్ నెట్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీం తీర్పునకు లోబడి ఉండాలన్నారు. ఇమ్మిగ్రేషన్ అధికారులు అనుమతించడంతో బాబు తన సతీమణి భువనేశ్వరితో కలసి దుబాయి మీదుగా అమెరికా వెళ్లారు.

చికిత్స కోసం అంటున్న టీడీపీ వర్గాలు

చంద్రబాబు తన విదేశీ పర్యటన గురించి చివరి వరకు ఎవరికీ తెలియనివ్వలేదు. కొద్ది రోజుల పాటు దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించిన ఆయన అమెరికా పర్యటన విషయంలో మాత్రం గోప్యత పాటించారు. వైద్య పరీక్షల కోసమే ఆయన అమెరికా వెళ్లినట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. గతంలోనూ చంద్రబాబు చికిత్స కోసం అమెరికా వెళ్లారు. వారం తర్వాత ఆయన తిరిగి హైదరాబాద్ చేరుకుంటారని పార్టీ నాయకులు తెలిపారు. మరోవైపు నారా లోకేశ్ కూడా నాలుగు రోజుల క్రితం చడీ చప్పుడు లేకుండా అమెరికా వెళ్లినట్లు సమాచారం.

అండమాన్‌కు 'నైరుతి'

▶ మొదటి పేజీ తరువాయి

మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. అలాగే, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతిలలో సోమవారం.. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతిలలో మంగళవారం.. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి, విశాఖపట్నం, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో బుధవారం వర్షాలకు ఆస్కారం ఉందని వివరించింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులు, పిడుగులు సంభవిస్తాయని, వీటితో పాటు గంటకు 30–40 కి.మీల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు.

పెదకూరపాడులో 55 మిల్లీమీటర్ల వర్షం

ఆదివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. పల్నాడు జిల్లా పెదకూరపాడులో 55.5 మిల్లీమీటర్లు, ఎన్టీఆర్ జిల్లా వత్సవాయిలో 40 మిల్లీ మీటర్లు, జగ్గయ్యపేట 39.5, అల్లూరి జిల్లా అడ్డతీగల 38, చింతపల్లి 36, తూర్పుగోదావరి జిల్లా అనపర్తి 35.2, అనకాపల్లి రావికమతం 35.2, అల్లూరి జిల్లా రాజవొమ్మంగి 35, తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు 31.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దాదాపు 47 ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిశాయి.

తుపానుగా మారనున్న అల్పపీడనం..

మరోవైపు.. ఈనెల 22వ తేదీన నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ తెలిపింది. ఇది మరింతగా బలపడి ఈ నెల 24వ తేదీ నాటికి నాటికి వాయుగుండంగా మారనుందని పేర్కొంది. అనంతరం అది తుపానుగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

కూల్ సమ్మర్స్ ఆఫ్ ఇండియా

సాక్షి, అమరావతి: వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం వివిధ దేశాలకు వెళ్లే పర్యాటకులను ఆకర్షించేందుకు కేంద్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. వేసవి విడిదికి అనుకూలమైన దేశంలోని 50 ప్రదేశాలను గుర్తించి ప్రత్యేక జాబితా రూపొందించింది. ఇన్ క్రెడిబుల్ ఇండియాలో భాగంగా సోషల్ మీడియా వేదికగా 'కూల్ సమ్మర్స్ ఆఫ్ ఇండియా' అంటూ విస్తృత ప్రచారం చేపట్టింది. మండు వేసవిలో శీతల భారతాన్ని ప్రపంచానికి పరిచయం చేసే దిశగా అడుగులు వేస్తోంది. 6న దుబాయ్‌లో అరేబియన్ ట్రావెల్ మార్ట్‌లో కూడా ప్రచార చిత్రాన్ని ప్రదర్శించనుంది.

చల్లని వాతావరణం ఉండే ప్రాంతాలు..

కేంద్ర పర్యాటక శాఖ 50కిపైగా వేసవి విడిది ప్రదేశాలతో జాబితాను రూపొందించింది. జమ్మూ, కశ్మీర్‌లోని గుల్మార్గ్, పట్నిటాప్, గ్రెజ్-మనస్బాల్, పితోర్‌ఘర్, ఔలి-చోప్తా, కిన్నార్, తీర్థన్, కేరళలోని వాయనాడ్-వాగమోన్, మిజోరం లోని ఐజ్వాల్, ఛెన్జాల్, సిక్కింలో లాచుంగ్-యుమ్తాంగ్, అస్సాంలోని హఫ్లాంగ్, పశ్చిమ బెంగాల్‌లోని కుర్సియోంగ్ ఉన్నట్లు సమాచారం. ఈ ప్రదేశాలు వేసవి అనుకూల గమ్యస్థానాలుగా మారుతాయని అభిప్రాయపడుతోంది.

క్లుప్తంగా...

ఓటింగ్ సరళి అంతా వన్‌సైడే: వైవీ సుబ్బారెడ్డి



గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, వృద్ధులు చూపిన కృతజ్ఞతే అధిక శాతం ఓట్లకు నిదర్శనమని, జూన్ నెల 9న విశాఖలోనే వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. విశాఖ విమానాశ్రయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఓటింగ్ జరిగిన తీరు చూసినట్లయితే..వన్‌సైడ్ ఓటింగ్‌కు నిదర్శనమన్నారు. సీఎంగా వైఎస్ జగన్ 9న ఉదయం 9.38 గంటలకు విశాఖలో ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఉత్తర నియోజకవర్గం అభ్యర్థి కేకే రాజు తదితరులు వైవీకి స్వాగతం పలికారు.

ప్రజాబలంతో మళ్లీ సీఎంగా జగన్
ఏపీటీడీసీ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి

సాక్షి, అమరావతి: సీఎం జగన్ రెండోసారి అధికారంలోకి రావాలన్న సంకల్పంతో మహా రుద్ర సహిత రాజశ్యామల సహస్ర చండీ యాగ మహా పూర్ణాహుతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ఏపీటీడీసీ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. 41 మంది వేద పండితులతో 41 రోజులపాటు యాగం చేశామన్నారు. ఆయన ఆదివారం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని మొక్కును సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడుతూ దైవాశీస్సులు, ప్రజా బలంతో ఏపీలో రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు.

విష్ణుకుమార్‌రాజుకు నోటీసులు

సీతమ్మధార (విశాఖ ఉత్తర): విశాఖ ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పి. విష్ణుకుమార్‌రాజుకు ఆదివారం కంచరపాలెం పోలీసులు 41ఏ నోటీసులు జారీచేశారు. అలాగే, ఈటీవీ, ఏబీఎన్‌కు కూడా 91 సీఆర్‌పీసీ ప్రకారం నోటీసులు జారీచేసినట్లు డీసీపీ–2 సత్తిబాబు తెలిపారు. ఈనెల 15న కంచరపాలెం బర్మా క్యాంప్, నూకాలమ్మ ఆలయం సమీపంలో ఉంటున్న సుంకర నూకరత్నం.. ఆమె ఇంటికి దగ్గరలో ఉంటున్న ఆశ కుటుంబాల మధ్య గొడవ జరిగింది. ఈ రెండు కుటుంబాల మధ్య పాత గొడవలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. నూకరత్నం, ఆమె కుటుంబ సభ్యులు ఆశ ఇంటిపై గొడవకు దిగి, వారి ఇంటిపై బీరు సీసాలు విసిరారు. ఆశ బంధువైన లోకేశ్‌కు విషయం తెలిసి నూకరత్నం, ఆమె తల్లి ధనలక్ష్మి, కుమారుడు మణికంఠపై కర్రతో దాడిచేశాడు. దీంతో లోకేశ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ఉత్తర నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు మాత్రం.. టీడీపీకి ఓటు వేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళ్లే దాడులు చేయించారని మీడియా సమావేశంలో ఆరోపించారు. దీనిపై విచారించిన పోలీసులు పాత గొడవల కారణంగా మహిళలపై దాడి జరిగిందని.. ఇందులో రాజకీయ ప్రమేయంలేదని గుర్తించారు. ఎలాంటి ఆధారాల్లేకుండా మీడియా సమక్షంలో ఎందుకు ఆరోపణలు చేశారో వివరణ ఇవ్వాలని పోలీసులు విష్ణుకుమార్‌రాజుకు నోటీసులిచ్చారు. అంతేకాక.. తప్పుడు ప్రచారం చేసిన ఈటీవీ, ఏబీఎన్ చానెళ్లకు కూడా 91 సీఆర్‌పీసీ ప్రకారం నోటీసులిచ్చారు.

'తెలుగు ప్రజలకు అన్యాయం చేసిన ఆ ఇద్దరు'

లక్ష్మీపురం(గుంటూరు పశ్చిమ): 'తెలుగు ప్రజలకు ప్రథమ శత్రువు ప్రధానమంత్రి నరేంద్రమోదీ. అయితే, పాలనలో, న్యాయ వ్యవస్థలో తెలుగు ప్రజలకు అన్యాయం చేసింది మాత్రం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ' అని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ఓడిపోతుందని, అయినా చంద్రబాబునాయుడు బతుకుదెరువు రాజకీయాల కోసమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కలిశారని చెప్పారు.

మార్చిన చోటే మారణకాండ

'సిట్'కు ఆధారాలు అందించిన మంత్రి అంబటి

- చంద్రబాబు, పురందేశ్వరి కుట్రతో చెలరేగిన హింస
- ఓటమి భయంతో బాబు రాక్షసత్వం
- తలలు పగులుతున్నా పోలీసులు స్పందించలేదు
- డబ్బులకు లొంగిపోయిన వారిపై చర్యలు తీసుకోవాలి
- తొండపిలో ప్రాణ భయంతో గ్రామాన్ని వీడిన ముస్లిం మైనార్టీలు



సత్తెనపల్లి: రాష్ట్రంలో పలుచోట్ల పోలింగ్ బూత్‌లను స్వాధీనం చేసుకుని ఈవీఎంలను ధ్వంసం చేయాలనే లక్ష్యంతో టీడీపీ దాడులకు తెగబడిందని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. బూత్ నంబర్లతో సహా ఈ వివరాలను వెల్లడించి రీ పోలింగ్ నిర్వహించాలని కోరితే అవసరం లేదని ఎన్నికల కమిషన్ చెబుతోందన్నారు. ఈ దారుణానికి కారకులెవరో నిగ్గు తేల్చాలని సిట్‌ను, ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో పోలీసు ఉన్నతాధికారులను మార్చిన ప్రాంతాల్లోనే హింస చెలరేగిందన్నారు. చంద్రబాబు ప్రోద్బలంతో రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఫిర్యాదు మేరకు పల్నాడు, అనంతపురం ఎస్పీలను ఎన్నికలకు ముందు ఈసీ బదిలీ చేసిందని గుర్తు చేశారు. పల్నాడుతోపాటు అనంతపురం, తాడిపత్రిలో చెలరేగిన హింసను నియంత్రించలేక పోలీసులు చేతులు ఎత్తేశారన్నారు. మంత్రి అంబటి ఆదివారం నరసరావుపేటలో 'సిట్' అధికారులను కలిసి ఎన్నికల హింస, కొందరు పోలీసు అధికారుల పక్షపాత వైఖరిపై ఫిర్యాదు చేశారు. అనంతరం గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణతో కలిసి సత్తెనపల్లిలో మంత్రి అంబటి మీడియాతో మాట్లాడారు.

చరిత్రలో చూడని విచిత్రం

రాయలసీమ, పల్నాడులో గతంలో ఇంత హింస చెలరేగిన సందర్భాలు లేవు. ఈసీ నియమించిన పోలీసు అధికారులు బాధ్యతలు చేపట్టాక టీడీపీ మూకలు విధ్వంసం సృష్టించాయి. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశాయి. పల్నాడు ప్రాంతంలో వైఎస్సార్ సీపీ చాలా బలంగా ఉంది. గత ఎన్నికల్లో ఏడుకు ఏడు సీట్లు గెలవడం, ప్రస్తుతం కూడా అదే పరిస్థితి ఉన్నందున దాడులకు తెగబడ్డారు. తాము నియమించిన ఐపీఎస్ అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహించారని ఈసీ సస్పెన్షన్ వేటు వేయడం చరిత్రలో ఎప్పుడూ చూడని విచిత్రం.

సత్తెనపల్లి రూరల్ సీఐపై ఫిర్యాదు

నరసరావుపేటలో సిట్ అధికారుల బృందాన్ని కలిసి వాస్తవాలను తెలియచేశా. రుజువులు, ఆధారాలు నివేదిక రూపంలో సమర్పించాం. పోలీసులే కౌంటర్ కేసులు పెట్టిస్తున్నారు. తప్పుడు కేసులతో బాధితులనే బెదిరిస్తున్నారు. సత్తెనపల్లి రూరల్ సీఐ మీసాల రాంబాబుపై ఫిర్యాదు చేశా. కొందరు పోలీసులు టీడీపీ నేతలకు డబ్బులకు అమ్ముడుపోయారు. కన్నా లక్ష్మీనారాయణ, ఆయన కుమారుడు ఇచ్చిన డబ్బులకు లొంగిపోయినట్లు మా దగ్గర స్పష్టమైన సమాచారం ఉంది. విధి నిర్వహణలో అలసత్వం వహించిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరా.

తొండపిలో గ్రామాన్ని వీడిన ముస్లిం మైనార్టీలు

పల్నాడు జిల్లా తొండపి గ్రామంలో శాంతిభద్రతలు పునరుద్ధరించాలని కొత్త ఎస్పీని కోరుతున్నా. ముస్లింల ఇళ్లు, బైకులు తగలబెట్టారు. ముస్లిం మైనార్టీలు ప్రాణ భయంతో ఊరు వదిలి ఇతర ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. వారికి పార్టీ తరపున అండగా ఉంటాం. వైఎస్సార్ సీపీ మరోసారి ప్రభంజనం సృష్టిస్తుంది. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రిగా విశాఖలో ప్రమాణ స్వీకారం చేస్తారు.

యథేచ్ఛగా విధ్వంసం..

పోలింగ్ రోజు తలలు పగిలి పోతున్నా పోలీసులు రాలేదు. అల్లరి మూకలు అలసిపోయే వరకు యథేచ్ఛగా మారణకాండకు తెగబడ్డాయి. నరసరావుపేటలో ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి ఇంటిపై రాళ్లు రువ్వి కార్లు ధ్వంసం చేశారు. నార్నెపాడులో ఎలక్షన్ ఏజెంట్‌గా ఉన్న నా అల్లుడు ఉపేష్ కారును సైతం ధ్వంసం చేశారు. మాచర్ల, గురజాల, నరసరావుపేట, సత్తెనపల్లి, పెదకూరపాడులో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. ఫిర్యాదు తీసుకోవాలని కోరినా స్పందించలేదు. ఓటమి భయంతో చంద్రబాబు రాక్షసంగా వ్యవహరించారు. అధికారం దక్కదని పసిగట్టిన ప్రతి సందర్భంలోనూ ఆయన హింసను నమ్ముకున్నట్లు చరిత్ర చెబుతోంది.

కౌంటింగ్ సమయంలో టీడీపీ అల్లర్లు సృష్టించే అవకాశం

- కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలి
- ఎన్నికల సంఘాన్ని కోరిన వైఎస్సార్‌సీపీ బృందం



ఎన్నికల అధికారికి ఫిర్యాదు అందజేస్తున్న మల్లాది విష్ణు, అంకంరెడ్డి నారాయణమూర్తి

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఎన్నికల సంఘాన్ని వైఎస్సార్‌సీపీ బృందం కోరింది. ఈ మేరకు ఆదివారం వెలగపూడి సచివాలయం అడిషనల్ సీఈవో కోటేశ్వరరావును కలిసి ఫిర్యాదు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు మీడియాతో మాట్లాడుతూ తమకు ఓటు వేయలేదనే ఉక్రోషంతో టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా హింసను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. ఆ పార్టీ అభ్యర్థులే రోడ్లపైకొచ్చి దాడులకు తెగబడుతూ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని చెప్పారు. కౌంటింగ్ సమయంలోనూ టీడీపీ అల్లర్లను సృష్టించే అవకాశముందని, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్టు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సమయంలో పాటించాల్సిన నిబంధనలను 175 నియోజకవర్గాల్లోనూ తూచా తప్పకుండా పాటించేలా చొరవ తీసుకోవాలని కోరామన్నారు. పోలింగ్ రోజు దెందులూరు నియోజకవర్గం కొప్పులవారిపాలెంలో జరిగిన ఓ దాడి ఘటనలో టీడీపీకి చెందిన రాజశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోగా.. టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్ పోలీసులపైన దౌర్జన్యం చేశారని, తక్షణమే ఆయనను అరెస్ట్ చేసి పీడీ యాక్టు కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పోటీ చేస్తున్న టెక్కలి నియోజకవర్గంలోనూ ఆ పార్టీ అరాచకాలకు ఓ నిండు ప్రాణం బలైందన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన తోట మల్లేష్ ఇంటిపై దాడికి తెగబడి.. అతని చావుకు కారణమయ్యారని చెప్పారు. దాడులను ప్రోత్సహించిన అచ్చెన్నాయుడిపైనా కేసు నమోదు చేయాలని కోరినట్టు తెలిపారు. గురజాల, మాచర్ల, నరసరావుపేట, సత్తెనపల్లి, తాడిపత్రి సహా రాష్ట్రంలో జరిగిన అరాచకాలన్నింటికీ మూలకారణం టీడీపీ నాయకులని మల్లాది విష్ణు ఆరోపించారు. కానీ సిట్‌ను తప్పుదోవ పట్టించేలా స్థానిక వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపైనే ఫిర్యాదులు చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని, ఈ నేపథ్యంలో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని సిట్ అధికారులను కోరినట్టు వివరించారు.

ఉయ్యూరు లోకేశ్ వంటి ఉన్మాదులను చంద్రబాబు రెచ్చగొడుతున్నారు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ పర్యటనను ఉన్మాది ఆలోచనలతో అడ్డుకునే కుట్ర చేసినందుకే ఉయ్యూరు లోకేశ్‌ను గన్నవరం విమానాశ్రయంలో పోలీసులు అరెస్ట్ చేశారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. చంద్రబాబు నీచ మనస్తత్వంతో లోకేశ్ వంటి వారిని రెచ్చగొడుతున్నారని ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. అత్యంత భద్రత మధ్య ఉండే ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకోవాలనే లోకేశ్ కుట్ర వెనుక ఎవరి హస్తం ఉందో తేల్చాలని డిమాండ్ చేశారు. టీడీపీ సానుభూతిపరుడైన లోకేశ్ డాక్టర్ అయినప్పటికీ ఉన్మాద మనస్తత్వంతో టీవీ డిబేట్లలో వైఎస్సార్‌సీపీపై విషం చిమ్ముతుంటారని గుర్తు చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటాయపాలేనికి చెందిన ఉయ్యూరు లోకేశ్ 38 ఏళ్లుగా అమెరికాలో వైద్యుడిగా పని చేస్తున్నారని, ఆయనకు అమెరికా పౌరసత్వం కూడా ఉందని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చారని, ఆ తర్వాత నేరుగా గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని సీఎం జగన్ విదేశీ పర్యటనను అడ్డుకునేందుకు టీడీపీ సానుభూతిపరులకు మెసేజ్‌లు పెట్టినట్టు పోలీసులకు ఆధారాలు లభించాయని వెల్లడించారు.

కచ్చితంగా 'పచ్చ' కుట్రే!



చంద్రగిరి మండలంలోని రామిరెడ్డిపల్లిలో దహనమైన సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి ఇంటిని పరిశీలిస్తున్న సిట్ అధికారులు



చంద్రగిరి మండలంలోని రామిరెడ్డిపల్లిలో టీడీపీ రౌడీల దాడిలో కాలిబూడిదైన వాహనాలను పరిశీలిస్తున్న సిట్ బృందం



సిట్ అధికారులను కలిసేందుకు తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఎమ్మెల్యే పెద్దారెడ్డి సతీమణి రమాదేవి

▶ మొదటి పేజీ తరువాయి

కీలకమైన వీడియో, ఫొటో ఆధారాలను సేకరించారు. ప్రధానంగా పల్నాడు, అనంతపురం జిల్లాల్లో పోలీసులు టీడీపీకి కొమ్ము కాసినట్టు.. బాధితులు ఫోన్లు చేసినా సరే స్పందించకుండా ఉదాసీనంగా వ్యవహరించినట్టు నిగ్గు తేలింది. పోలింగ్ రోజున, తరువాత హింసాత్మక ఘటనలపై విచారణ ప్రక్రియను రెండు రోజుల్లో ముగించాలని ఈసీ స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ రెండు రోజుల విచారణ ద్వారా తాము గుర్తించిన అంశాలతో ప్రాథమిక నివేదికను సిట్ ఇన్‌చార్జ్ వినీత్ బ్రిజ్‌లాల్ ఈసీకి సోమవారం సమర్పించనున్నారు. పూర్తిస్థాయి విచారణకు మరింత సమయం కావాలని ఆయన కోరే అవకాశం ఉంది.

అక్రమాలకు పాల్పడటమే లక్ష్యంగా విధ్వంసం

పక్కా పన్నాగంతో దాడులకు తెగబడి ఎన్నికల అక్రమాలకు పాల్పడాలన్నదే టీడీపీ కుట్రన్నది బట్టబయలైంది. అందుకోసమే పల్నాడు నుంచి అనంతపురం జిల్లా వరకు వరుస దాడులతో టీడీపీ శ్రేణులు బీభత్సం సృష్టించాయి. ప్రశాంతమైన తిరుపతి జిల్లాలో టీడీపీ ఏ విధంగా దాడులకు తెగబడిందీ వెలుగులోకి వచ్చింది. చిత్తూరు నుంచి రప్పించిన 2 వేల మంది రౌడీలతో చంద్రగిరి నియోజకవర్గంలోని కూచువారిపల్లెలో టీడీపీ విధ్వంసం.. రామిరెడ్డిపాలెం సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డిని హత్య చేసేందుకు బరితెగించి దాడులకు పాల్పడిన కుతంత్రం.. అనంతరం తిరుపతిలోని ఎస్వీయూ, శ్రీపద్మావతి విశ్వవిద్యాలయాల ప్రాంతాల్లో దాడులు, ప్రతిదాడులకు సంబంధించిన కీలక ఆధారాలను సిట్ సేకరించింది. తిరుపతి రూరల్ మండలం ఎంఆర్‌పల్లి సీఐపై టీడీపీ నేతలు రాళ్లతో దాడి చేస్తే, ఎందుకు కేసు నమోదు చేయలేదని సిట్ అధికారులు ప్రశ్నించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ దాడిపై కూడా కేసు నమోదు చేసి బాధ్యులను అరెస్ట్ చేయాలని ఆదేశించింది. రెండు కేసుల్లో కూడా నిందితులు అందరినీ అరెస్ట్ చేయాలని స్పష్టం చేసింది. తాడిపత్రిలో అయితే టీడీపీ గూండాగిరికి ఏకంగా పోలీసులే దన్నుగా నిలవడం.. పోలీసులే దాడులకు పాల్పడి ఆస్తులు ధ్వంసానికి పాల్పడిన వీడియో, ఫొటో ఆధారాలను సిట్ సేకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

- పల్నాడు జిల్లా పమిడిపాడు గ్రామంలోని వైఎస్సార్‌సీపీ పోలింగ్ బూత్ ఏజెంట్ షేక్ మాబుపై టీడీపీ వర్గీయుల దాడి, ఉప్పలపాడులో ఇరువర్గాల దాడులు, ప్రతిదాడులు, దొండపాడు గ్రామంలో వాహనాలపై దాడి ఘటనల వెనుక టీడీపీ పక్కా పన్నాగం కూడా బట్టబయలైంది. ఈ ఘటనల వీడియోలను పరిశీలించి దాడుల తీవ్రతపై సిట్ అధికారులు ఓ అంచనాకు వచ్చారు. మాచర్ల నియోజకవర్గం కారెంపూడిలో బీసీ వర్గీయులపై టీడీపీ గూండాలు యథేచ్ఛగా సాగించిన దాడులు, దాచేపల్లిలో టీడీపీ వర్గీయులు తెగబడి సృష్టించిన విధ్వంసకాండ వెనుక కుట్ర వెలుగులోకి వచ్చింది. పోతురాజుగుట్టలో బేడ బుడగ జంగాల కాలనీపై జరిగిన దాడిని ఆ తర్వాత 14వ తేదీ ఉదయం నుంచి రాత్రి వరకు కారెంపూడిలో వరుసగా టీడీపీ రౌడీ మూకలు సాగించిన విధ్వంసాలకు సంబంధించిన వీడియో ఆధారాలను సేకరించారు.

ఇవిగో ఆధారాలు..

- పోలింగ్ రోజున పక్కా పన్నాగంతోనే టీడీపీ నేతలు దాడులకు పాల్పడ్డారని బాధితులు సిట్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కేవలం ఫిర్యాదులు చేయడమే కాకుండా అందుకు సంబంధించిన వీడియో రికార్డులు, ఫొటోలను సాక్ష్యంగా సిట్ అధికారులకు సమర్పించారు. చంద్రగిరి నియోజకవర్గంలో విధ్వంసకాండకు నాంది పలికిన కూచువారిపల్లిలో టీడీపీ సృష్టించిన బీభత్సం గురించి బాధితులు సిట్ అధికారులకు వివరించారు.
- రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డిని అంతమొందించే కుట్రలతోనే టీడీపీ వర్గీయులు దాడులకు పాల్పడ్డారని స్థానికులు సిట్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కారును తగలబెట్టిన ఘటన మొదలు సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇల్లు, కారు ధ్వంసం చేసి, నిప్పటించడం వరకు విధ్వంసకాండ కొనసాగిన తీరును విడమరచి చెప్పారు. సర్పంచ్ ఇంట్లోని వృద్ధురాలిని బలవంతంగా బయటకు ఈడ్చుకొచ్చారన్నారు. ఇంట్లోని వస్తువులన్నింటినీ ధ్వంసం చేసి, విలువైన వస్తువులను దోచుకెళ్లడంతో పాటు పెట్రోల్ బాంబులతో ఇంటిని దగ్ధం చేశారని చెప్పారు. సమాచారం తెలుసుకున్న సర్పంచ్, గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారని తెలిపారు. అప్పటికే సిద్ధం చేసుకున్న రాళ్లు, కర్రలతో టీడీపీ వర్గీయులు దాడులకు తెగబడ్డారన్నారు.
- రామిరెడ్డిపల్లి పోలింగ్ బూత్ వద్ద టీడీపీ వర్గీయులు ఎలా దాడులకు తెగబడిందీ బాధితులు వివరించారు. ఇప్పటికీ టీడీపీ నాయకుల బెదిరింపులు ఆగడం లేదని, రామిరెడ్డిపల్లిలో ఎవరినీ వదలమని.. చంపేస్తామంటూ బెదిరించారని.. మీరే రక్షణ కల్పించాలని మొరపెట్టుకున్నారు. టీడీపీ గూండాల బెదిరింపులకు గ్రామంలో పది కుటుంబాలు ఇళ్లు ఖాళీ చేసి వెళ్లి పోయాయని సిట్ అధికారుల దృష్టికి తెచ్చారు.
- అనంతపురం జిల్లా తాడిపత్రిలోని విధ్వంసకాండపై సిట్ ఇన్‌చార్జ్ అదనపు డీజీ వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో అధికారుల బృందానికి బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు సిట్ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. దాడులు అరికట్టడంలో పోలీసుల వైఫల్యం, బాధితులపై తిరిగి పోలీసులు దౌర్జన్యానికి దిగడం, ఆస్తులు ధ్వంసం చేయడంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు సంబంధించిన వీడియోలు, ఫొటో ఆధారాలను సమర్పించారు.
- పల్నాడు జిల్లాలోని నరసారావుపేట, మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో టీడీపీ హింసాకాండపై బాధితులు సిట్ అధికారుల వద్ద తమ ఆవేదన వెళ్లగక్కారు. మంత్రి అంబటి రాంబాబు సిట్ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల రోజున పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై టీడీపీ వర్గీయుల దాడి, రూరల్ సీఐ రాంబాబు వ్యవహరించిన తీరుపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు.
- పల్నాడు జిల్లా కారెంపూడిలో ఈ నెల 14న ఉదయం నుంచి రాత్రి వరకు టీడీపీ గూండాలు సాగించిన దౌర్జన్యకాండను బాధితులు సిట్ అధికారులకు వివరించి కన్నీటి పర్యంతమయ్యారు. జిల్లాలోని దాచేపల్లి నగర పంచాయతీలో ఇరికేపల్లి, కేసానుపల్లి, తంగెడ, మాదినపాడు, దాచేపల్లిలో టీడీపీ రౌడీ మూకలు తెగబడి బీభత్సం సృష్టించిన తీరును బాధితులు వివరించారు.


సీఎం జగన్ సంక్షేమ పథకాల వల్లే ఓటింగ్ పెరిగింది

- 4న ఎన్నికల ఫలితాల తర్వాత టీడీపీ నాయకులు ముఖాలు ఎక్కడ పెట్టుకుంటారో?
- మేం వ్యాపారాలు చేస్తూనే రాజకీయాలు చేస్తున్నాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



తిరుపతి మంగళం(తిరుపతి జిల్లా): రాష్ట్రంలో పేద ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాల వల్లే సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగిందని, అందులోనూ మహిళల ఓటింగ్ పెరిగిందని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. తిరుపతి మారుతీనగర్‌లోని తన నివాసం వద్ద మంత్రి పెద్దిరెడ్డి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల అనంతరం చంద్రబాబు ఓటమి భయంతో ఒత్తిడికి గురై దాడులను ప్రేరేపిస్తున్నారని మండిపడ్డారు. 'మాపై టీడీపీ కుట్రపూరితంగా తప్పుడు ఆరోపణలు చేస్తోంది. దానికితోడు పప్పు లోకేశ్ తప్పుడు ఆరోపణలు చేస్తూ ఎక్స్(ట్విట్టర్)లో పోస్టులు పెడుతున్నాడు. జూన్ 4న ఎన్నికల ఫలితాల తర్వాత టీడీపీ నాయకులు ముఖాలు ఎక్కడ పెట్టుకుంటారో చూస్తాం. గత టీడీపీ పాలనలో ఐదేళ్లపాటు ఇరిగేషన్ మంత్రిగా ఉండి ఈ ఎన్నికల్లో సీటు తెచ్చుకోలేని దేవినేని ఉమా కూడా మాపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటు. మేము వ్యాపారాలు చేస్తూనే రాజకీయం చేస్తున్నాం. 2013 నుంచి ఆఫ్రికాలో వ్యాపారం చేస్తున్నాం. ఫెర్రో మాంగనీస్, సిలికాన్ మైనింగ్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇక్కడ నుంచి వాహనాలు, మెషినరీ అక్కడకు పంపిస్తున్నాం. మొదటి విడత 20 బండ్లు బాంబే పోర్ట్ నుంచి షిప్‌లో పంపించాం. స్వర్ణ మెటల్స్‌కు 100 వెహికల్స్ అవసరం ఉండడంతో ఇక్కడి నుంచి పంపిస్తున్నాం.' అని పెద్దిరెడ్డి చెప్పారు. అదేవిధంగా వైఎస్సార్ సీపీ నాయకులు విదేశాలకు పారిపోతున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. దానికితోడు పచ్చపత్రికలు ఇష్టమొచ్చినట్లు పిచ్చిరాతలు రాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను విద్యార్థి దశ నుంచి స్టూడెంట్ యూనియన్ నాయకుడిగా చంద్రబాబుకు పోటీగా నిలబడిన వ్యక్తినని పెద్దిరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలననే కోరుకుంటున్నారని, దాంతో గతం కంటే కూడా వైఎస్సార్‌సీపీ ఎక్కువ సీట్లు సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

బీజేపీకి 150 సీట్లకు మించి రావు
కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్




సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో బీజేపీకి 150 సీట్లకు మించి రావని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్ జోస్యం చెప్పారు. ఆయన ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఏపీలో ప్రభుత్వ వ్యతిరేక ఓటును అనుకూలంగా మలచుకోలేకపోయామని తెలిపారు. ఎన్నికల కమిషన్ బలహీనపడుతోందని, పోలీసు వ్యవస్థ గురించి పెద్దగా చెప్పాల్సిన పనిలేదని అభిప్రాయపడ్డారు. ఏపీలో ప్రధాని మోదీ వేవ్ ఎక్కడా కనిపించలేదనీ, బీజేపీతో పొత్తు వల్ల టీడీపీకి సీట్లు తగ్గే అవకాశం ఉందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, ఎవరు హోంమంత్రి, ఎవరు ఆర్థిక మంత్రి అనే చర్చలు పార్టీలో అప్పుడే మొదలయ్యాయన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ, కేంద్రంలో బీజేపీ పక్కాగా ఓడిపోతాయని పేర్కొన్నారు. అధికార వైఎస్సార్‌సీపీ ఎన్నికల కోసం వేల కోట్లు ఖర్చు చేసిందని చింతా మోహన్ ఆరోపించారు.

శాటిలైట్ ఫోన్‌తో ఉడాయించబోయి..

ఎయిర్‌పోర్టులో చిక్కిన ఉయ్యూరు లోకేశ్.. అదుపులోకి తీసుకుని ఫోన్ స్వాధీనం



సీఎంను అడ్డుకునేందుకు రావాలని టీడీపీ గ్రూపులో లోకేశ్ పెట్టిన మెసేజ్



డాక్టర్ ఉయ్యూరు లోకేశ్

విమానాశ్రయం (గన్నవరం): ఎన్నారై డాక్టర్ ఉయ్యూరు లోకేశ్‌ను కృష్ణా జిల్లా గన్నవరం పోలీసులు ఆదివారం మరోసారి అదుపులోకి తీసుకున్నారు. నిషేధిత శాటిలైట్ ఫోన్‌తో ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించిన ఆయన్ను భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. సీఎం జగన్ విదేశీ పర్యటనను అడ్డుకునేందుకు కుట్ర పన్నిన లోకేశ్‌పై పోలీసులు శనివారం కేసు నమోదు చేయడం తెలిసిందే. తాజాగా ఢిల్లీ వెళ్లేందుకు లోకేశ్ మరోసారి విమానాశ్రయానికి వచ్చాడు. ఆయన వద్ద శాటిలైట్ ఫోన్ ఉన్నట్లు భద్రతా తనిఖీల్లో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్) సిబ్బంది గుర్తించారు. దేశంలో నిషేధించిన శాటిలైట్ ఫోన్‌ను వినియోగించడంతో అదుపులోకి తీసుకున్నారు. తనవద్ద అనుమతులు ఉన్నట్లు తొలుత బుకాయించిన లోకేశ్... తరువాత తెల్లమొహం వేశాడు. లోకేశ్‌ను అదుపులోకి తీసుకుని సీజ్ చేసిన శాటిలైట్ ఫోన్‌ను గన్నవరం పోలీసులకు అప్పగించారు.

వెలుగులోకి లోకేశ్ కుట్రలు

విదేశాలకు వెళ్లకుండా సీఎం జగన్‌ను అడ్డుకోవాలంటూ ఉయ్యూరు లోకేశ్ పేరుతో టీడీపీకి చెందిన పలు వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలు ప్రత్యక్షమయ్యాయి. దీంతో పోలీసులు అప్రమత్తమై ఎయిర్‌పోర్ట్ ఇంటర్నేషనల్ టెర్మినల్ వద్ద సంచరిస్తున్న ఉయ్యూరు లోకేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎయిర్‌పోర్ట్‌కు రావడానికి గంట ముందు ఈ ఘటన జరిగింది. టీడీపీ నేతలు, ఎల్లో మీడియా ఈ కుట్రను దాచిపెట్టి సీఎం సెక్యూరిటీ వింగ్, పోలీసులపై బురద చల్లేందుకు ప్రయత్నించడం గమనార్హం. ఎన్ఆర్ఐ డాక్టర్ ఉయ్యూరు లోకేశ్ విషయంలో చట్ట ప్రకారమే వ్యవహరించామని కృష్ణా జిల్లా గన్నవరం సీఐ వరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సీఎం కాన్వాయ్‌ను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు ఎయిర్‌పోర్ట్‌లో తనిఖీలు చేపట్టామని తెలిపారు. విచారణ సందర్భంగా ఉయ్యూరు లోకేశ్ ఛాతీలో నొప్పి అని చెప్పడంతో మంచినీరు, అల్పాహారం అందించగా నిరాకరించినట్లు వెల్లడించారు. ఆయన కోరినట్లుగా విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించామన్నారు. ఆయన్ను పోలీసులు కొట్టినట్లు కొన్ని మీడియాల్లో వచ్చిన కథనాల్లో నిజం లేదన్నారు.

కర్నూలులో మృతదేహాల కలకలం

- చెరువులో ఇద్దరు మహిళల మృతదేహాలు
- సమీపంలోని పొలంలో విగతజీవిగా మరో మహిళ
- నగరవనంలో కలకం రేపిన ఘటనలు



చెరువులో మృతదేహం

కర్నూలు: కర్నూలు శివారున ఒకేరోజు ముగ్గురు మహిళల మృతదేహాలు బయట పడటం కలకలం రేపింది. నందికొట్కూరు రోడ్డులోని నగరవనం చెరువులో రెండు, అక్కడికి అర కిలోమీటరు దూరంలో గార్గేయపురం వైపు రోడ్డు పక్కన పొలంలో మరో మహిళ మృతదేహాలు బయటపడ్డాయి. ఆదివారం ఉదయం స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ శ్రీధర్, ఎస్ఐ పీరయ్య తదితరులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నీటిలో తేలియాడుతున్న రెండు మృతదేహాలను వెలికితీసి ఒడ్డుకు చేర్చారు. ముందుగా హిజ్రాలుగా భావించిన పోలీసులు కర్నూలులో ఉన్న కొందరు హిజ్రాలను పిలిపించి ఆరా తీశారు. అయితే వారు హిజ్రాలు కాదనీ, సుమారు 40–45 సంవత్సరాల వయస్సు కలిగిన వివాహితలుగా గుర్తించారు. డీఐజీ విజయారావు, ఎస్పీ కృష్ణకాంత్, కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసు జాగిలాలను రప్పించి ఆధారాలను సేకరించే ప్రయత్నం చేశారు. అయితే కొద్ది దూరం ముందుకు వెళ్లి జాగిలాలు ఆగిపోయాయి. దీంతో మృతదేహాలను ట్రాక్టర్‌లో కర్నూలు ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేవు. ఫలితంగా పోలీసులకు ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు.

మిస్సింగ్ కేసుల పరిశీలన

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గడచిన వారం రోజులుగా ఎక్కడైనా మహిళలు అదృశ్యమయ్యారేమోనన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. శ్రీశైలం వెళ్లే మార్గం అయినందున ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. పోలీసులు బోటులోకి వెళ్లి చెరువు అంతా పరిశీలించినా ఎక్కడా ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. పర్యాటక ప్రాంతమైనందున ఇక్కడ రాత్రివేళల్లో మందు బాబుల సందడి ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతంలో పోలీసుల గస్తీ కూడా అంతంతమాత్రమే కావడంతో ఆ కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఏపీ, తెలంగాణలోని అన్ని పోలీస్ వాట్సాప్ గ్రూపులకు ఫొటోలను షేర్ చేసి సంఘటనపై ఆరా తీస్తున్నారు. ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందిన వారా? లేక వేర్వేరు కుటుంబాల వారా? అన్న కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి ఆధారాలను సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. శాస్త్రీయంగా, సాంకేతిక పరిజ్ఞానంతో కేసును ఛేదిస్తామని డీఐజీ విజయరావు తెలిపారు.



విషయాలు తెలియకపోవడంలో ఏ అవమానమూ లేదు. 'నాకు తెలీదు' అని చెప్పడం సరైనదే. మనకు ప్రతిదీ తెలిసినట్టు నటించడమే సిగ్గుపడాల్సిన విషయం.

– రిచర్డ్ ఫెయిన్‌మాన్

సాక్షి

సోమవారం, 20 మే 2024

మన బంగారం

బంగారం విలువైన లోహం మాత్రమే కాదు, సంపదకు మారుపేరు. బంగారం అంటే భవిష్యత్తుకు భరోసా. ప్రపంచవ్యాప్తంగా మనుషులకు బంగారం మీద ఎంత అనురాగం ఉన్నా, మన భారతీయులకు బంగారం మీద ఉండే మోజు అంతకు మించినది. ఎప్పటికైనా మంచిరోజులు వస్తాయనే ఆలోచనలతో బంగారు కలలు కనడం మనలో చాలామందికి అలవాటే! బంగారు ఆభరణాలు ఒంటికి అలంకరణలైతే, మన నుడికారంలో భాగమైన బంగారు సామెతలు, పదబంధాలు మన భాషకు అలంకరణలు. విపణిలో బంగారు ధగధగలు సరే, సాహితీ వీధుల్లోనూ కనకకాంతులు మిరుమిట్లు గొలుపుతాయి. ఒకానొక కాలంలో మన దేశంలో కవులకు కనకాభిషేకాలు చేసే రోజులు ఉండేవి. వేద పురాణాల నుంచి ప్రాచీన సాహిత్యంలో బంగారాన్ని గురించిన వర్ణనలు, బంగారంతో ముడిపడిన పోలికలు విరివిగా కనిపిస్తాయి. రామాయణ కాలం నాటికే బంగారం వినియోగం బాగా ఉండేది. సముద్రాన్ని లంఘించి లంకకు వెళ్లిన హనుమంతుడు రావణుడి అంతఃపురంలో ధగధగలాడే బంగారు సోపానాలతో నిర్మించిన విశాలమైన వేదికలను చూశాడట! వాటినే వాల్మీకి 'జ్వలనార్క ప్రతీకాశం సుకృతం విశ్వకర్మణా/ హేమ సోపాన సంయుక్తం చారుప్రవర వేదికమ్' అని వర్ణించాడు.

ఆదిశంకర విరచితమైన కనకధారా స్తవం తెలిసిందే! ఆదిశంకరులు భిక్షకు వెళ్లినప్పుడు ఒక నిరుపేదరాలు తన ఇంట ఏమీ లేకపోవడంతో ఒక ఉసిరికాయ దానం చేసింది. ఆమె దుఃస్థితికి చలించిన శంకరాచార్యులు లక్ష్మీదేవిని స్తుతిస్తూ కనకధారా స్తవం ఆశువుగా పలికినప్పుడు ఆ పేదరాలి ఇంట బంగారు ఉసిరికాయలు వర్షించాయట!

తెలుగు కవులలో కనకాభిషేక వైభోగాన్ని పొందిన తొలికవి బహుశా శ్రీనాథుడే కాబోలు. 'దీనార టంకాల తీర్థమాడించితి దక్షిణాధీశు ముత్యాలశాల' అని తానే స్వయంగా చెప్పుకున్నాడు. తర్వాతికాలంలో అంతటి వైభోగాన్ని పొందిన మరో కవి అడిదం సూరకవి. 'రాజు కళంకమూర్తి రతిరాజు శరీర విహీను డంబికా/ రాజు దిగంబరుడు మృగరాజు గృహాంతర సీమవర్తి వి/భ్రాజిత పూసపా డ్విజయ నృపాలుడు రాజు కాక ఈ/ రాజులు రాజులా పెను తరాజులు గాక ధరాతలమునన్' అని ఆశువుగా చెప్పిన పద్యానికి మెచ్చిన విజయరామరాజు అడిదం సూరకవికి కనకాభిషేకం జరిపించాడు. ఇప్పుడు బంగారు నాణేలే చలామణీలో లేవు. ఇక కనకాభిషేకాలెక్కడ? ఒకవైపు కవులకు కనకాభిషేకాలు జరుగుతున్న కాలంలోనే మరోవైపు 'తోటకూరకైన దొగ్గలికైన/ తవుటి కుడుముకైన దవుటికైన/ గావ్యములను జెప్పు గాండ్యాలు ఘనమైరి' అని వేమన నిరసించినట్లుగా నామమాత్ర ప్రతిఫలానికి కక్కుర్తి పడే చిల్లర కవులు కూడా ఎక్కువగానే ఉండేవాళ్లు.

'పట్టిందల్లా బంగారమే' అని అంటారు. ఇది మన పలుకుబడిలో భాగం. అక్షరాలా పట్టిందల్లా బంగారమే అయిపోతే ఆ పరిస్థితి ఎలా ఉంటుందో గ్రీకు పురాణాల్లోని 'మిడాస్ టచ్' కథ చెబుతుంది. మిడాస్ అనే రాజుకు ముట్టుకున్నదల్లా బంగారమైపోతుందని అదృష్టదేవత వరం ఇచ్చింది. అప్పటి నుంచి అతడు తాకినదల్లా బంగారంగా మారిపోయేది. ఒకనాడు తన ముద్దుల కూతురును దగ్గరకు తీసుకుని ఎత్తుకోబోయాడు. ఆమె జీవంలేని బంగారుబొమ్మగా మారిపోయింది. బంగారం మీద అత్యాశ తెచ్చిపెట్టే అనర్థాలకు ఇదొక ఉదాహరణ.

రాచరికాలు సాగిన కాలంలో రాజులు రత్నఖచిత కనకసింహాసనాల మీద కూర్చుని పరిపాలన సాగించేవాళ్లు. యోగ్యత కలిగిన వాళ్లు కనకసింహాసనాల మీద కూర్చుంటే జనాలు ఆమోదిస్తారేమో గాని, బొత్తిగా అప్రయోజకులు కనకసింహాసనాల మీదకెక్కి పెత్తనం చలాయిస్తే జనాలు ఊరుకోరు. 'కనకపు సింహాసనమున/ శునకము గూర్చుండ బెట్టి శుభలగ్నమునన్/ దొనరగ పట్టము గట్టిన/ వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ!' అన్నాడు బద్దెన. కనక సింహాసనాసీనులైన శునకసమానులను ఎవరిని చూశాడో, ఎందరిని చూశాడో మరి! అంత తీవ్రంగా నిరసించాడు. బద్దెన పద్యంలోని కనకపు సింహాసనం ఒక ప్రతీక. అచ్చంగా బంగారంతో చేసినదే కానక్కర్లేదు. అధికార పీఠం ఏదైనా కావచ్చు. అప్రయోజకులు, అసమర్థులు అధిరోహించినప్పుడు ఒకవేళ అవి అచ్చంగా బంగారుపీఠాలే అయినా, వాటికి గౌరవభంగం తప్పదు.

ఎవరెన్ని రకాలుగా పొగిడినా, ఇంకెవరెన్ని రకాలుగా తెగిడినా బంగారం బంగారమే! బంగారం డబ్బుకు పర్యాయపదం. 'బంగారమే డబ్బు. మిగిలినదంతా అప్పు' అన్నాడు అమెరికన్ ఆర్థిక వ్యాపారవేత్త జె.పి.మోర్గాన్. డబ్బుకు లోకం దాసోహం అనేమాట నిరాకరించలేని సత్యం. 'కులము గలుగు వారు/ గోత్రంబు గలవారు/ విద్యచేత విర్రవీగు వారు/ పసిడి గల్గువాని బానిస కొడుకులు' అని వేమన ఈ సత్యాన్నే కొంత నిష్ఠురంగా పలికాడు.

బంగారానికి మెరుపు సహజలక్షణం. అలాగని 'మెరిసేదంతా బంగారం కాదు' అని అనుభవజ్ఞులైన పెద్దలు ఎప్పుడో చెప్పారు. ఈ సంగతినే ఇంగ్లిషువాళ్లు 'ఆల్ దట్ గ్లిట్టర్స్ ఈజ్ నాట్ గోల్డ్' అన్నారు. బంగారానికి కుల మత ప్రాంత భాషా భేదాలేవీ లేవు. ఎవరి దగ్గర ఉంటే వారికి విలువ పెంచుతుంది. బంగారానికి ఎంత విలువైనా ఉండవచ్చు. ఎంత ధర అయినా ఉండవచ్చు. అదేదీ మనిషిలోని సుగుణానికి సాటిరాదు. 'భూమి అట్టడుగున ఉన్న బంగారాన్ని, భూమిపై చలామణీలో ఉన్న బంగారాన్ని తెచ్చిపోసినా అదంతా ఒక్క సుగుణానికి ఖరీదు కట్టలేదు' అన్నాడు ప్లాటో. అయినా మన బంగారం మంచిదైతే ఇంతమంది ఇన్ని సుద్దులు చెప్పాల్సిన పని ఉండేది కాదు.

'బుల్‌డాగ్' తీరు వేరుగా ఉండేది!

ప్రధాని తన ప్రసంగంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని వచ్చిన ఆరోపణలపై ఎన్నికల కమిషన్ ఇంతవరకూ చర్య తీసుకోలేదు. మోదీ స్టార్ క్యాంపెయినర్ అనే బలహీనమైన కారణంతో నేరుగా ఆయనకు కాకుండా బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డాకు లేఖ రాసింది. పేర్కొన్న తేదీ లోగా స్పందించటంలో పార్టీ విఫలం అయినప్పుడు, కమిషన్ మరొక వారం పొడిగింపునకు అంగీకరించింది. ఆ తర్వాత ఇంకొక వారం పొడిగించింది. స్పందన వచ్చిన తర్వాత కూడా నిర్ణయం తీసుకోవడానికి తొందర పడటం లేదు. ప్రస్తుత కమిషనర్లు ఎన్నికల కమిషన్‌కు అప్రతిష్ఠను తెచ్చిపెట్టారు. అదే టి.ఎన్. శేషన్ అయితే ఏం చేసి ఉండేవారు? ప్రధానిని నిష్కర్షగా, నిస్సంకోచంగా పిలిపించి ఉండేవారు.

కామెంట్



కరణ్ థాపర్

''నేను నిక్కచ్చిగా, నిష్కర్షగా ఉంటే ఉండొచ్చు. అయితే నేను ఎల్లప్పుడూ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఉంటాను. మీరు చూసేదే మీకు కనిపిస్తుంది. నాలో మాత్రం ఏ పార్శ్వాలూ లేవు.'' – ఎన్నికల కమిషన్‌ను తన పనితీరుతో ప్రశంసనీయమైన గట్టి వ్యవస్థగా తయారు చేశారని పేరు గాంచిన ఎన్నికల ప్రధాన అధికారి టి.ఎన్.శేషన్ తన గురించి తాను ఇలా చెప్పేవారు. ''నేను ఈ కుర్చీలో కూర్చున్నప్పుడు నేను చేయవలసిన పని ఒకటి ఉంటుంది. ఆ పనిని నేను నా సామర్థ్యం మేరకు అత్యుత్తమంగా చేస్తాను. ఏవీ నన్ను ఆపలేవు'' అనేవారు శేషన్. ఇక ఆయన 'బుల్‌డాగ్' అని ముద్దుగా పేరు పడటంలో ఆశ్చర్యం ఏముంటుంది? పైగా ఇది ఆయనను ఉల్లాసపరిచిన పేరు కూడా!

దురదృష్టం... నేటి ఎన్నికల సంఘం ఎంతో భిన్నమైన జంతువులా ప్రవర్తిస్తోంది. ఈ పోలికను పొడిగించాలనుకుంటే కనుక ఇప్పుడది కాపలా కుక్క కంటే కూడా గారాల పెంపుడు కుక్కగానే ఎక్కువగా నడుచుకుంటోంది. నిష్పాక్షికత, పారదర్శకతల అవసరాన్ని అది మరిచిపోయినట్లుగా కనిపిస్తోంది. ఇకపై తాను – కోరలతో తీవ్రంగా ప్రతిఘటించవలసిన సమయాల్లో సైతం – తన పని తాను చేయవలసిన అవసరం లేదని అది నిర్ణయించుకుంది. బదులుగా, బయట పడేందుకు సులభమైన దారులను వెతుకుతోంది.

ప్రధానమంత్రి బాన్స్‌వాడా(రాజస్థాన్)లో ప్రసంగించి నెల దాటింది. నిజానికి నేటి నుంచి ఇంకో పదమూడు రోజులలో ఓటింగ్ ముగియనుంది కూడా. ప్రధాని తన ప్రసంగంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని బహిరంగంగా ఉల్లంఘించారని వచ్చిన ఆరోపణలపై కమిషన్ ఇంతవరకు చర్య తీసుకోకుండా ఏం చేస్తున్నదో గమనించండి.

కె. చంద్రశేఖరరావు, ఎ. రాజా, సుప్రియా శ్రీనేత్, రణ్‌దీప్ సూర్జేవాలా కేసులలో మాదిరిగా... మోదీకి ప్రత్యక్షంగా నోటీసు జారీ చేయకూడదని కమిషన్ నిర్ణయించుకుంది. బదులుగా, మోదీ స్టార్ క్యాంపెయినర్ అనే ఒక బలహీనమైన కారణంతో ఆయనకు కాకుండా బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డాకు లేఖ రాసింది. నోటీసులో ప్రధానమంత్రి పేరును, హోదాను పేర్కొనలేదు. అనుబంధ పత్రాలలో మాత్రమే అవి ఉన్నాయి. లేఖలో కమిషన్ పేర్కొన్న తేదీ లోగా స్పందించటంలో



భారత మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ టి.ఎన్.శేషన్

పార్టీ విఫలం అయినప్పుడు, కమిషన్ మరొక వారం పొడిగింపునకు వెంటనే అంగీకరించింది. ఆ తర్వాత కూడా గడువును ఇంకొక వారానికి పొడిగించింది. స్పందన వచ్చిన తర్వాత కూడా కమిషన్ ఒక నిర్ణయం తీసుకోవడానికి తొందర పడటం లేదు. ఉద్దేశపూర్వకమైన ఈ వాస్తవ దాటవేత కాలయాపన కోసమేనని అర్థమవుతోంది.

ఇంతకీ, ప్రధాని ఏం చేశారు? ఓబీసీలు, ఎస్టీలు, ఎస్సీలకు ఉద్దేశించిన రిజర్వేషన్లను వారి నుంచి లాక్కుని ముస్లింలకు ఇవ్వటం జరుగుతుందని దాదాపు ప్రతిరోజూ ఆయన పదేపదే ఆరోపిస్తూ హిందువుల దృష్టిలో ముస్లింలను దయ్యాలుగా చిత్రీకరిస్తున్నారు. చివరికి మంగళ సూత్రాలు, స్త్రీధనం – మీకు రెండు గేదెలు ఉంటే వాటిలో ఒకటి – మీనుంచి లాక్కుని ముస్లింలకు ఇస్తారు అని కూడా ప్రధాని అన్నారు.

ప్రధాని జాగ్రత్తగా, ఉద్దేశపూర్వకంగా పదే పదే ఇలా అనడం నియమావళిని తీవ్రంగా ఉల్లంఘించటమే కదా? కమిషన్ అధికారాన్ని లెక్కచేయకపోవటం కమిషన్‌ను పరిగణనలోకి తీసుకోకపోవటమే కదా?

ఈ విషయంలో కమిషన్ చేయగలిగిందల్లా వెనక్కు జారగిలబడి కూర్చోవటం, వినటం, చేతి బొటనవేళ్లు నొక్కుకోవటం అన్నట్లే ఉంది. కమిషన్ ఎందుకు కఠినచర్య తీసుకోలేదు? తనకై తాను సూమోటోగా ఎందుకు ముందుకు రాలేదు? ప్రధాన మంత్రిని, కనీసం బీజేపీని ఈ కొనసాగింపు, నిజానికి ఈ నిరంతరాయమైన ఉల్లంఘనపై ఎందుకు పిలిపించలేదు? రాజ్యాంగంలోని 324వ అధికరణం కమిషన్‌కు అవసరమైన అన్ని అధికారాలనూ ఇస్తోంది. కానీ వాటిని ఉపయోగించటానికే కమిషన్ ఇష్టపడటం లేదు. దానర్థం నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిపించే నిబద్ధత కమిషన్‌లో కొరవడింది. న్యాయంగా, సమానంగా, పారదర్శకంగా వ్యవహరించే నైతిక అత్యవసరత కమిషన్‌లో లోపించింది.

అదే టి.ఎన్. శేషన్ అయితే ఏం చేసి ఉండేవారో ఒక్కక్షణం ఊహించండి. ఆయన ప్రధానిని నిష్కర్షగా, నిస్సంకోచంగా, బాహాటంగా పిలిపించి ఉండేవారు. రెండు లేదా మూడు రోజులు ఎన్నికల ప్రచారం నుంచి ఆయన్ని దూరంగా ఉంచేవారు. ఆ తర్వాత ప్రెస్ కాన్ఫరెన్స్‌లు పెట్టి, ఇంటర్వ్యూలు ఇచ్చి తను తీసుకున్న చర్యను సమర్థిస్తూ, వివరణ ఇచ్చేవారు. ప్రతిస్పందనగా దేశ ప్రజలు హర్షం వ్యక్తం చేసి ఉండేవారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు తక్షణం ఆగిపోయేవి.

మనకున్న అత్యంత ప్రామాణిక చరిత్రకారులు, సూక్ష్మగ్రాహ్యత గల ప్రజా వ్యాఖ్యాతలలో ఒకరైన రామచంద్ర గుహ... ''ప్రస్తుత ముగ్గురు కమిషనర్లు ఎన్నికల కమిషన్‌కు అగౌరవాన్ని, అప్రతిష్ఠను తెచ్చిపెట్టారు'' అని అన్నారంటే అందులో ఆశ్చర్యం లేదు. కమిషన్ చరిత్ర రాసినప్పుడు ఆ ముగ్గురూ చరిత్రహీనులుగా గుర్తుండిపోతారని ఆయన అన్నారు. అది నిజం.

అయితే ఈ చేదు నిజం మరింత లోతైనది. మొదట మన ప్రజాస్వామ్యానికి గాయం అయింది. ప్రపంచంలోనే మనది అది పెద్ద ప్రజాస్వామ్యం అయినందుకు మనం గర్విస్తూ ఉంటాం. కానీ మనకు ఏదైతే గర్వకారణమై ఉన్నదో దానికి ఎన్నికల సంఘం తూట్లు పొడుస్తోంది. ప్రపంచం గమనించలేదని అనుకోకండి! పైనుంచి వేయి కళ్లతో చూస్తూనే ఉంటుంది.

అంతిమంగా, ఎలాగూ మూల్యం చెల్లించవలసింది మనమే... 'భారత ప్రజలమైన మనం'! చర్య తీసుకోవటంలో విఫలం అవటం ద్వారా కమిషన్ మనందరినీ లోకువ చేసేసింది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మాడ్చే ఎండలు



ఢిల్లీ ఇప్పుడు ఒక కొలిమిలా ఉంది. మీకు పని లేకపోతే బయటికి రావొద్దు. ఇంకొంచెం వేడి పెరిగినా మనం అందరం మలమలా మాడిపోతాం. ప్రజా ప్రయోజనార్థం జారీ!

– రోహిణీ సింగ్, జర్నలిస్ట్

మళ్లీ మొదలు...



రాజకీయ నాయకులందరూ మన శరీరాల నుంచి రక్తాన్ని పీలుస్తారు. పదేళ్లుగా మన రక్తాన్ని పీలుస్తున్న బీజేపీ జలగ జూన్ 4న మన శరీరాలను వదలనుందని నాకు సంతోషంగా ఉంది. కానీ 50 ఏళ్లుగా మన రక్తాన్ని పీల్చిన కాంగ్రెస్ తిరిగి పీల్చడం మొదలుపెడుతుంది.

– మార్కండేయ కట్జూ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

వేసి తీరాలి!



ఏదేమైనా నేను సంవత్సరంలో 365 రోజులూ వ్యాయామం చేస్తాను. ఏదేమైనా మే 20 నాడు నేను నా ఓటు హక్కును వినియోగించుకోబోతున్నాను (మహారాష్ట్రలో ఐదో దశ ఎన్నికల్లో). మీరు ఏం చెయ్యాలనుకుంటే అది చేయండి. కానీ పోయి ఓటు మాత్రం వేయండి. భారత మాతను ఇబ్బంది పెట్టొద్దు. భారత్ మాతా కీ జై!

– సల్మాన్ ఖాన్, నటుడు

అద్భుత భారత్!



పీసా టవర్ (ఇటలీ) నాలుగు డిగ్రీలే వంగింది. అదే వారణాసిలోని రత్నేశ్వర్ ఆలయం 9 డిగ్రీలు వంగింది.

– ఎరిక్ సోల్‌హెయిమ్, నార్వే మాజీ దౌత్యవేత్త

పెరిగాయి



ఆరోగ్య బీమా ప్రీమియమ్‌లు వెర్రిగా పెరుగుతున్నాయని ఎవరైనా గమనించారా? అదే కవర్, అదే పాలసీకి రెండేళ్లలో మా ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీ 38.5 శాతం పెరిగింది.

– ఉదిత్ భండారీ, వ్యాఖ్యాత

ఏదీ ప్రతిఫలం?



ట్రేడింగ్‌లో మీరు ఒక కోటి నష్టపోతే మీరు ఒక కోటి నష్టపోతారు; అదే మీకు ఒక కోటి లాభమొస్తే, పన్నుల తర్వాత మీకు వచ్చేది 60 లక్షలు. అయినా రిస్క్ ఉన్న ట్రేడ్స్‌కు మంచి ప్రతిఫలం ఉంటుందని జనాలు మాట్లాడుతుంటారు.

– అబిద్ హసన్, ఆంట్రప్రెన్యూర్

అందరి దేవుడు



మన సమాజం మతం ఆధారంగా చీలిపోతుంటుందిగానీ, మధ్యభారతంలోని ఒక మారుమూల అడవిలో ఇంకా పాత పద్ధతులు కొనసాగుతుండటం చూశాను. ఇక్కడున్న నరసింహ స్వామిని హిందువులు, ఆదివాసీలు, ముస్లింలు ఏకరీతిగా కొలుస్తారు. స్వామికి చుట్టిన ఆకుపచ్చ జెండాలు కనబడతాయి. వేలాది చిన్న త్రిశూలాలు, వాటికి కట్టిన ఆకుపచ్చ గాజుల మధ్యలో ఆకుపచ్చ జెండాలు కలగలిసిపోయాయి.

– రజా కాజ్మీ, వైల్డ్‌లైఫ్ హిస్టారియన్

అవి మన మిత్రులు

తేనెటీగలు ప్రపంచ పర్యావరణం బాగుండడానికీ, మానవ మనుగడకూ అత్యంత అవసరమైనవి. అయితే మోనో క్రాపింగ్, పురుగుమందుల వాడకం, భూమి వినియోగంలో మార్పు, ఇతర కీటకాల సంచారం ఎక్కువ కావడంతో తేనెటీగల కాలనీలకు నష్టం వాటిల్లుతోంది. 90 శాతం అడవి పువ్వులు పెరగడానికీ, 35 శాతం వ్యవసాయ, ఉద్యాన పంటలు పండడానికీ తేనెటీగల పాత్ర ఎంతో ఉంది. ప్రపంచ పర్యావరణ సమతుల్యత తేనెటీగలతో బోలెడు ముడిపడి ఉంది. అలాగే తేనెటీగలు అందించే తేనె మంచి పౌష్టిక, వైద్య విలువలు కలిగిన ఆహారం కూడా!



మొదట తేనెటీగ పువ్వుల నుండి మకరందాన్ని తాగుతుంది. ఆ తర్వాత ఆ మకరందాన్ని తనతో పాటు తేనె సంచీలో మోసుకొని తేనెతుట్టె దగ్గరకు తెస్తుంది. ఈ సంచీ తేనెటీగ కడుపులో జీర్ణాశయానికి బయట వుంటుంది. తేనెటీగ కడుపులో ఉన్నప్పుడే మకరందం తేనెగా మారుతుంది. మకరందంలో వుండే చక్కెర పదార్థానికి రసాయనిక చర్య జరిగిన తర్వాత మధువులో వుండే నీరు పూర్తిగా తీయబడుతుంది. తేనె తుట్టెకు ఉన్న ద్వారాల ద్వారా వేడి లోపలకి ప్రవేశించడంతో ఈ నీరు పూర్తిగా ఆవిరై పోతుంది. దీనివల్ల తేనె చాలాకాలం నిల్వ ఉంటుంది.

ఎంతో ప్రాముఖ్యమున్న తేనెటీగలను పరిరక్షించాల్సిన అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఏడాదీ మే 20వ తేదీన ప్రపంచ తేనెటీగల దినోత్సవాన్ని జరుపుతున్నారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ 2024 సంవత్సరానికి గాను 'యువతరంతో తేనెటీగల చెట్టా పట్టాల్' అనే నినాదాన్ని ప్రకటించింది. అందువల్ల మన యువతరం, యువ రైతులు తేనెటీగల సంరక్షణకు నడుం కట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం గణనీయంగా తగ్గించాలి. తేనెటీగల అభివృద్ధికి ఊతం ఇచ్చే పంటలు, తోటలు, పార్కులు ఏర్పాటు చేయాలి. తేనెటీగల పెంపకం దారులను ప్రోత్సహించాలి. తేనెటీగల పెట్టెలను విరివిగా పెట్టి, బంజరు భూములను కూడా తేనెటీగల ఆవాసాలకు అనువుగా మార్చాలి. సేంద్రియ పంటలను, ఉత్పత్తులను ఆదరించాలి. తేనెటీగలలోని వివిధ జాతులు గురించి అధ్యయనం చేసి వాటిలోని తేడాలను, ఆవాసాలను గుర్తించి వాటి ఉనికిని పెంపొందించాలి.

– కె .ఆంజనేయ కుమార్; ఏపీ వ్యవసాయ అధికారి

(నేడు ప్రపంచ తేనెటీగల దినోత్సవం)

నవ్వండి... మొహమాటపడకండి!

విశ్లేషణ



కె.బి. గోపాలం

ఎవరో జోకు వేశారు. మీరు నవ్వారు లేదా మిన్నకున్నారు. ఈ నవ్వడం, నవ్వకపోవడం వెనుక మెదడులో బోలెడంత సైన్సు ఉందని మీకు తెలుసా?

నవ్వాలంటే కొన్ని లక్షణాలు అవసరం. ముందుగా బోలెడు మెదడుండాలి. ముందు జోకు సంగతి మెదడుకు చేరాలి. అందుకు సంబంధించిన వ్యవహారం అంతా పోస్టీరియర్ టెంపొరల్ కార్టిసెస్ అనే మెదడు భాగంలో జరుగుతుంది. ఆ భాగం తలలో వెనుక వైపున ఉంటుంది. ఆ జోకు నిజంగా నవ్వు పుట్టించిందా అన్న సంగతి మాత్రం మెదడులో మరో వేరే చోట జరుగుతుందంటే నమ్మగలరా? ఈ నిర్ణయం ఇన్సులార్ కార్టెక్స్, అమిగ్డలా అనే భాగాలలో జరుగుతుంది. అంటే హాస్యం, సరదా అన్నది అనుకున్నంత సులభం కాదని అర్థమైంది అంటారు డార్ట్ మౌత్ విశ్వవిద్యాలయం పరిశోధకులు. వారు కొందరు వలంటీర్‌లకు కార్టూన్ వీడియోలు చూపించి, మెదడులో జరుగుతున్న మార్పులను పరిశీలించారు. కేంద్రాలు వేరువేరుగా ఉన్నందుకే జోకు అర్థమైనా నవ్వు పుట్టని సందర్భాలు ఉంటాయి అంటారు వారు.



నవ్వంటే ఒక మందు లాంటిది. ఇది మామూలు మందు కాదు. మత్తు మందు లాంటిది. అందుకే కొంతమందికి కార్టూన్ ఛానల్, కార్టూన్ పుస్తకాలు మరీ మరీ ఇష్టంగా మారిపోతాయి. వయస్సుతో తేడా లేకుండా వాళ్ళు ఆ పుస్తకాలను, ఆ సీరియల్స్‌ను చూస్తూనే ఉంటారు. మెదడు మీద హాస్యం ప్రభావం గురించి స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ వారు తమ పరిశోధన ఫలితాలను 'న్యూరాన్స్' అనే పరిశోధన పత్రికలో అందించారు. కార్టూన్ నిజంగా బాగా నవ్వు పుట్టించేదయితే, మెదడులోని 'న్యూక్లియస్ అకుంబెన్స్' అనే భాగంలో చకచకా లైట్లు వెలుగుతాయని వారు గుర్తించారు. కొకెయిన్ లాంటి మత్తు పదార్థాలు తీసుకున్నప్పుడు కూడా మెదడులో ఇవే మార్పులు జరుగుతాయని, అందుకే మత్తుమందులు, హాస్యం కూడా మనుషులకు అలవాటుగా మారిపోతాయని పరిశోధకులు అంటున్నారు.

ఇక మూడవ అంశం నవ్వులో ఆడా – మగా తేడా! ఒక విషయాన్ని గమనించి... నవ్వాలంటే అబ్బాయిల కన్నా అమ్మాయిల మెదళ్లలో ఎక్కువ తతంగం జరుగుతుందని కూడా పరిశోధకులు గమనించారు. భాష, జ్ఞాపకశక్తి వంటి అంశాల గురించిన మెదడు భాగాలు అమ్మాయిల మెదళ్లలో ఎక్కువగా పని చేస్తాయి. అంటే నవ్వడానికి ముందు ఆడవాళ్లు బాగా ఎక్కువగా ఆలోచిస్తారని అర్థమట. అందుకనేమో అమ్మాయిలు ఎంత మంచి జోకు వేసినా, ఎంతటి హాస్యానికైనా ఒక పట్టాన, సులభంగా పగలబడి నవ్వరు.

నవ్వు గురించి ఎన్నెన్నో సిద్ధాంతాలు ఉన్నాయి అంటే నవ్వులాట కాదు మరి. మొదటి సిద్ధాంతాన్ని సుపీరియారిటీ థియరీ అన్నారు. ఎవరికో ఏదో జరిగితే వాళ్లకన్నా మనం గొప్పగా ఫీల్ అయ్యి నవ్వుతామన్నమాట. ఎవరో జారి పడతారు. రహస్యం ఏమిటంటే మనం పడలేదు. కనుక జాలి కన్నా ముందు మనకు నవ్వు వస్తుంది. ఆ పడిన మనిషికి నడవడం కూడా రాదన్న ఆలోచన మనకు వచ్చిందన్నమాట.

ఇక రెండవ సిద్ధాంతం మనలో ఏదో టెన్షన్ పెరిగి ఉండి దాని నుంచి విముక్తి కలిగితే నవ్వు పుడుతుంది. టెన్షన్ తగ్గిన తర్వాత వచ్చే నవ్వు ఆరోగ్యానికి చాలా మంచిదట. అనుకోకుండా ఏదో జరిగితే వచ్చే నవ్వుకు సంబంధించింది మూడవ సిద్ధాంతం. ఏదో జరుగుతుంది అనుకుంటాము. అక్కడ మనకు తోచనిరకంగా మరేదో జరుగుతుంది. దానివల్ల నష్టం కలిగే అవకాశం ఉన్నా ముందు మనకు నవ్వు వస్తుంది. ఈ రకమైన అనుభవాలు అందరికీ ఎప్పుడూ కలుగుతూనే ఉంటాయి.

నవ్వాలనిపిస్తే నవ్వండి. నవ్వు గురించి ఆలోచన మాత్రం చేయకండి. ముఖం మాడ్చుకోకండి. ఎవరో కింద పడినప్పుడు మీరు నవ్వినా సరే, మిమ్మల్ని చూసి మరొక నలుగురు నవ్వుతారు తప్ప సీరియస్‌గా ఉన్న వారిని చూచి ఎవరూ నవ్వరు. నలుగురు నిలబడ్డచోట కొంతమంది వచ్చి ఏదైనా అడగదలుచుకుంటే నవ్వు ముఖంతో ఉన్న వాళ్ళని మాత్రమే అడుగుతారు. బిగుసుకుపోయిన వారి వద్దకు ఎవరూ రారు!

వ్యాసకర్త సైన్స్ విషయాల రచయిత

ఆదర్శ నాయకుడు

పుట్టు పేద. పట్టుదలతో గుండె దిటవుతో ధైర్యమే ఆయుధంగా న్యాయవాదిగా ఎదిగి అపార సంపదను గడించారు. చివరికి దేశ స్వాతంత్ర్యం కోసం సర్వస్వం త్యాగం చేశారు. ఆయనే ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు. గాంధీజీ పిలుపుతో మద్రాసు నుంచి స్వాతంత్ర్య ఉద్యమంలో మనసా వాచా కర్మణా దూకిన తెలుగు తేజం ప్రకాశం. 'నాది అనేది నాకు ఉండకూడదు' అనే సిద్ధాంతాన్ని స్వీకరించి ఆజన్మాంతమూ నూటికి నూరు పాళ్ళూ ఆచరించిన కర్మయోగి. రాజకీయ రంగంలో హాలాహలం మింగిన శివుడు. తన దీక్షలో విధి నిర్వహణలో పట్టింపు వచ్చెనా... బ్రహ్మంతటి వాడినైనా నిలదీయగల ధీశాలి. 1928 లో 'సైమన్ తిరిగి పో' (సైమన్ గో బ్యాక్) అనే నినాదంతో బ్రహ్మాండమైన ఆందోళనకు తానే మద్రాస్ పట్టణంలో పిలుపునిచ్చి జరిపించారు.



టంగుటూరి ప్రకాశం

బ్రిటిష్ వారు 144 సెక్షన్ విధించి కాల్పులు జరిపారు. 'రండి రా! ఇదే కాల్చుకొండి రా' అని గర్జించి బ్రిటిష్ గుండుకు తన గుండె చూపించి తెల్ల దొరలను హడలెత్తించిన సాహస వీరుడు.

'స్వరాజ్య' పత్రికను స్థాపించి తనే సంపాదకుడుగా ఉండి కాంగ్రెస్ పథకాలనూ, గాంధీ ఆశయాలనూ, జాతీయోద్యమాన్నీ విస్తృత ప్రచారం గావించారు. మొదటి రోజునే 8 వేల పేపర్లు అమ్ముడు పోయాయంటే సామాన్య విషయం కాదు. దూరదృష్టి గల ఆర్థిక శాస్త్రవేత్తగా ఆర్థిక పథకాలనూ, సూత్రాలనూ రచించి, ఆచరించి తరువాతి తరాల పాలకులకు దిశా నిర్దేశకులైనారు. 'భారత ఆర్థిక విధానాలు', 'అంతర్జాతీయ ఆర్థిక విధానాలు' పుస్తకాలను రచించారు. రెవెన్యూ మంత్రిగా జమీందారీ విధానం రద్దుకు, 'దున్నే వాడిదే భూమి' లాంటి ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడాయనే. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, నవ్యాంధ్ర నిర్మాతగా అతి కొద్ది కాలంలో అనేక కార్యక్రమాలు చేసి ప్రజాదరణ పొందారు. హైకోర్టు స్థాపన, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్, వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, కొన్ని పన్నుల రద్దు, రెండు వేల ఖైదీల విముక్తి వంటివి ఇందుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

1872 ఆగస్ట్ 23న ప్రకాశం జిల్లా వినోదరాయుడు పాలెం గ్రామంలో పుట్టి దేశ సంక్షేమానికి సర్వస్వమూ త్యాగం చేసిన ఈ కర్మయోగి 1957 మే 20న అనంత జ్యోతిలో కలిసిపోయారు.

– టంగుటూరి శ్రీరామ్, ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ

(నేడు టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.ద్వాదశి ప.3.05 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** చిత్త తె.5.17 వరకు(తెల్లవారితే మంగళవారం), తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.11.43 నుండి 1.27 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.22 నుండి 1.10 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, **అమృతఘడియలు:** రా.10.05 నుండి 11.34 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.31, **సూర్యాస్తమయం:** 6.21.

నేత్రపర్వం.. సత్యదేవుని కల్యాణం

- రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ, దుర్గగుడి తరపున పట్టు వస్త్రాల సమర్పణ
- భారీగా తరలివచ్చిన భక్తులు



మంగళసూత్రాలు చూపుతున్న అర్చకులు

అన్నవరం/ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): కాకినాడ జిల్లా అన్నవరంలో రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి, శ్రీ అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. రత్నగిరిపై రామాలయం పక్కన సర్వాంగసుందరంగా అలంకరించిన వార్షిక కల్యాణ మండపంపై ఈ ఉత్సవం నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు తిలకిస్తుండగా, వేద పండితుల ఆశీర్వచనాలు, అర్చకస్వాముల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ రాత్రి 10.30 గంటల సుముహూర్తంలో స్వామివారి తరపున అమ్మవారి మెడలో అర్చక స్వామి మంగళసూత్ర ధారణ చేశారు. అనంతరం తలంబ్రాలు, వేదాశీస్సులతో కల్యాణ క్రతువు ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అలాగే స్వామి, అమ్మవార్లకు టీటీడీ తరఫున టీటీడీ ప్రతినిధులు, విజయవాడలోని దుర్గగుడి తరపున అధికారులు పట్టు వస్త్రాలను సమర్పించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, తలంబ్రాలు పంపిణీ చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో కె.రామచంద్ర మోహన్ దంపతులు, అసిస్టెంట్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

దళిత యువకులపై టీడీపీ దాడి

- వైఎస్సార్‌సీపీలో చేరడంతో కక్ష
- కులం పేరుతో దూషణ.. కేసు నమోదు



రవితేజను ఆస్పత్రికి తరలిస్తున్న యువకులు

కామవరపుకోట: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని, టీడీపీకి ఘోర పరాజయం అని గ్రహించిన టీడీపీ నేతలు ఓటమి భయంతో సహనం కోల్పోయి వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు పాల్పడుతున్నారు. ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం గుంటుపల్లి పంచాయతీ కంటమనేనివారిగూడేనికి చెందిన దళిత యువకులపై తాజాగా టీడీపీ నాయకులు దాడి చేశారు. కొందరు దళితులు సీఎం జగన్ పాలనకు ఆకర్షితులై పోలింగ్‌కు ముందు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరుముచ్చు గోపాల్‌యాదవ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. దీనిని సహించలేని టీడీపీ నాయకులు వారిపై కక్ష పెంచుకున్నారు. పోలింగ్ రోజున కూడా వారిపై దాడులకు తెగబడ్డారు. దీంతో ప్రాణహాని ఉందని గ్రహించిన దళిత యువకులు ఇటీవల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులకు తమ గోడు విన్నవించారు. సహనంతో ఉండాలని వారు సర్ది చెప్పి పంపారు. ఈ క్రమంలో దళిత యువకులు గెడ్డం రవితేజ, దొడ్డిగర్ల మంగరాజు శనివారం రాత్రి గ్రామ సమీపంలో బహిర్భూమికి వెళ్లారు. వారిని గమనించిన టీడీపీ నాయకులు జాలపర్తి రాహుల్, కొమ్మిన రత్నాజీ, గద్దె సుభాష్ వీరిని దుర్భాషలాడుతూ వారిపై దాడి చేశారు. విషయం తెలిసి అక్కడకు వచ్చిన దొడ్డిగర్ల మంగరాజు బంధువులు గెడ్డం ఫిలిప్, బోడ శ్రీనును కూడా బూతులు తిడుతూ కులం పేరుతో దూషిస్తూ వారిపైనా దాడి చేశారు. ఈ దాడిలో గెడ్డం రవితేజకు తీవ్ర గాయాలై పరిస్థితి విషమించడంతో చింతలపూడి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై తడికలపూడి ఎస్‌ఐ జయబాబును వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

'మాచ్‌ఖండ్'కు తప్పిన పెనుప్రమాదం

ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి పెను ప్రమాదం తప్పింది. శనివారం అర్ధరాత్రి మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో జల విద్యుత్ కేంద్రంలో ఒక్కసారిగా విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. జనరేటర్లు మొరాయించాయి. వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఆపరేటర్లు పనిచేస్తుండగా 4వ నంబర్ ఎంఐబీకి చెందిన వాల్వ్ నుంచి భారీగా నీరు లీకై ప్రాజెక్టులోకి వస్తుండటాన్ని గమనించారు. దీంతో అప్రమత్తమైన కంట్రోల్ రూం, టర్బైన్ల సిబ్బంది వెంటనే నీటి నియంత్రణకు చర్యలు చేపట్టారు. వాల్వ్ హౌస్ నుంచి 4వ నంబర్ జనరేటరుకు వచ్చే నీటిని నిలిపివేయడంతో ప్రాజెక్టులోకి వచ్చే వరదనీటిని నియంత్రించగలిగారు. మూడు గంటల పాటు ప్రాజెక్టు ఇంజనీర్లు, సిబ్బంది శ్రమించారు. అప్పటికే 4వ జనరేటర్ ఏఐబీ వాల్వ్ ఉన్న చోట నీరు నిండిపోవడంతో దాన్ని కూడా తొలగించారు. లేకుంటే విద్యుత్ కేంద్రం మునిగిపోయేది. ఈ ఘటనతో 4వ నంబర్ జనరేటర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. శనివారం వరకు ప్రతి గంటకు 4 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతూ ఉండేది. ప్రస్తుతం 6వ నంబర్ జనరేటర్ సాయంతో 22 మెగావాట్ల ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. 4వ నంబర్ జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు శ్రమిస్తున్నారు.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమల: తిరుమలలో మూడు రోజులుగా భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం కూడా ఔటర్ రింగ్ రోడ్డులోని ఆక్టోపస్ వద్ద నుంచి క్యూలు ఉన్నాయి. వేసవి సెలవులు, వారాంతపు రద్దీకి తోడు దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో తిరుమల పోటెత్తింది సాధారణంగా మేలో అధిక రద్దీ ఉంటుంది. శుక్ర, శని, ఆదివారాలు కావడంతో ఇది గరిష్ట స్థాయికి చేరింది. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆదేశాల మేరకు జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్, ఆరోగ్యం, అన్నప్రసాదం, విజిలెన్స్, వైద్య శాఖల ఉన్నతాధికారులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్న ప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలతో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ఆహారం, పాలు, తాగు నీరు అందించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది.



శిలాతోరణం రోడ్డు వద్ద నుంచి నారాయణగిరి షెడ్లు వరకు క్యూలో వేచి ఉన్న భక్తులు

ప్రకృతి ఒడిలో పల్లవించే సంగీతం

సంప్రదాయ నృత్యాలే... ఆదివాసీలకు ఆనందం

- పండగలు, శుభకార్యాల్లో లయబద్ధంగా ఆటపాటలు
- శాస్త్రీయం కాకున్నా.. అందరినీ చిందేయించే వాయిద్యాలు
- కల్మషం ఎరుగని సంగీతంతో అందరినీ అలరించే సామర్థ్యం
- పశ్చిమ ఏజెన్సీలో ఇప్పటికీ వినిపించే సంప్రదాయ వాయిద్యాలు



బుట్టాయగూడెం మండలం అలివేరులో డోలు కొయ్యి నృత్యాలు చేస్తున్న కొండరెడ్లు

వారికి సరిగమలు తెలియవు. శృతి లయలు అసలే తెలీదు. కానీ శ్రవణానందంగా పాడగలరు. శ్రోతలను రంజింపజేయగలరు. తకిట తథిమి అనే సప్తపదులు నేర్చుకోలేదు. కానీ లయ బద్ధంగా అడుగులు వేయగలరు. సంప్రదాయ నృత్యరీతుల్లో ఎన్ని మార్పులొచ్చినా... తరతరాలుగా అలవాటైన పద విన్యాసాలనే ఇప్పటికీ అనుసరిస్తున్నారు. ప్రకృతిని పరవశింపజేస్తున్నారు. ఇందుకోసం వినియోగించే వాయిద్య పరికరాలు కూడా వారు సొంతంగా తయారు చేసుకున్నవే. ఇంతగొప్ప నైపుణ్యం గలిగిన వీరు పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని దట్టమైన అటవీ ప్రాంతంలో జీవిస్తున్నారు. పురాతనంగా వస్తున్న సంప్రదాయాలను ఇప్పటికీ కొనసాగిస్తూప్రకృతి ప్రసాదించిన అడవి తల్లి ఒడిలో స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకున్న వారి జీవనం ప్రతి ఒక్కరికీ ఆదర్శం.

సొంతంగా వాయిద్య పరికరాల తయారీ



అడ్డతీగ గిల్లలతో తయారు చేసిన గుత్తులు

కొండరెడ్డి గిరిజనులు వాయిద్య పరికరాలు సొంతంగా తయారు చేసుకుంటారు. అడవిలో లభించే ఉస్కటేకు, వేగెసా చెట్లతో డప్పుల నమూనాలను తయారు చేసి వాటికి మేక చర్మాలను అతికించి వాయిద్య పరికరాలను తయారు చేసుకుంటారు. అలాగే అడ్డతీగ గిల్లలతో గుత్తులు కట్టి డప్పు వాయిద్యాల నడుమ ఆ గిల్లలు ఊపుతూ చక్కటి తాళంతో మహిళలు నృత్యం చేస్తూ ఉంటారు. ప్రతి ఏటా గ్రామాల్లో పండగ సమయాల్లో నృత్యాలు చేస్తారు. బాట పండగ, పప్పు పండగ, మామిడి పండగ నాడు వీరి ఆటపాటలతో కొండలు ప్రతిధ్వనిస్తుంటాయి.

బుట్టాయగూడెం: దట్టమైన అటవీ ప్రాంతంలో బాహ్య ప్రపంచానికి దూరంగా కొండకోనల నడుమ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న కొండరెడ్డి గిరిజనుల జీవనశైలి విచిత్రంగా ఉంటుంది. సంస్కృతీ, సంప్రదాయాలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తుంటారు. వీరికి బయటి ప్రపంచంతో పని లేదు. అటవీ ప్రాంతమే వారికి ఆలవాలం. చుట్టూ కొండకోనలు వాగు వంకలతో అలరారే గిరి పల్లెల్లో ప్రకృతి నేర్పిన సంగీతం, నాట్యంతోనే జీవితాన్ని ఆనందంగా మలచుకుంటున్నారు. గిరిజనుల్లోనే కోయ తెగకు చెందిన వారు 'రేరేలయ్య.. రేల... రేరేలా... రేలా..' అంటూ పాడుకుంటే... కొండరెడ్లు 'జొన్నకూడు.. జొన్న విల్లు.. జొన్నకూలితే.. పోతేనత్త' అంటూ కొత్త పంటలు వచ్చిన సమయంలో పసుపు పచ్చ పండగ, మామిడి పండగ, చింత పండగ, భూదేవి పండగల్లో పాడుకుంటారు. అలాగే పెళ్లిళ్ల సమయంలో కొండరెడ్లు 'కళ్లేడమ్మ.. కళ్లేడమ్మ.. గోగుల పిల్లకు.. కెచ్చెల పిల్లోడు' అంటూ పెళ్లికి సంబంధించిన పాటలు పాడుతూ లయ బద్ధంగా డోలు వాయిద్యాలు వాయిస్తూ నృత్యాలు చేస్తూ ఆనందంగా గడుపుతారు. ఇప్పటికీ గిరిపల్లెల్లో పండుగలు, శుభ కార్యాల్లో ఆదివాసీ గిరిజన సంప్రదాయ డోలు, కొమ్ముల నృత్యాలు కనిపిస్తూనే ఉన్నాయి.

పోడు వ్యవసాయమే జీవనాధారం

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో సుమారు 11వేల మంది కొండరెడ్డి గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకునే వీరు పోడు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప కొండ దిగి బయట ప్రపంచం వైపు రారు. ఆయా గ్రామాల్లో అందరూ కలిసి కట్టుగా ఉంటూ అన్ని శుభకార్యాలను వారి సంప్రదాయంలో ఎంతో వైభవంగా చేసుకుంటారు.

పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయం



మా పూర్వీకుల నుంచి గ్రామాల్లో శుభకార్యాలకు డోలు కొయ్య నృత్యాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆ సంప్రదాయాన్నే మేం కొనసాగిస్తున్నాం. సమాజంలోని మార్పుల వల్ల ఎన్ని కొత్త రకాల వాయిద్యాలు వచ్చినా మా డోలు కొయ్య వాయిద్యమే మాకు వినసొంపుగా ఉంటుంది. అందులోనే మాకు సంతోషం ఉంటుంది. మాకు ప్రకృతి నేర్పిన సంగీతమిది.

– బొల్లి విశ్వనాథరెడ్డి

ఆ నృత్యాల్లో అందరం మైమరచిపోతాం



మా గిరిజన గ్రామాల్లో ఏటా వేసవిలో బాట పండగ, పప్పు పండగ, మామిడి పండగతో పాటు పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల్లో మేం తయారు చేసుకొన్న వాయిద్య పరికరాలు వాయిస్తూ లయబద్ధంగా నృత్యాలు చేస్తాం. ఆ సమయంలో చిన్నాపెద్ద తేడా ఉండదు. అందరూ కలసి సంతోషంగా ఆనందంగా నృత్యాలు చేస్తాం. ఇది మా పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం.

– గోగుల గంగరాజు రెడ్డి

అప్పన్నను దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా సతీ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనం పలుకగా, ఆలయ డిప్యూటీ కమిషనర్ సుజాత న్యాయమూర్తికి శేష వస్త్రాలు, ప్రసాదం, స్వామివారి జ్ఞాపిక అందజేశారు.



కప్పస్తంభానికి మొక్కుతున్న జస్టిస్ సందీప్ మెహతా దంపతులు

శ్రీవారి సేవలో ప్రముఖులు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్ రెడ్డి, మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్



ట్రాయ్ చైర్మన్ అనిల్ కుమార్ లహోటి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, ట్రాయ్ చైర్మన్ అనిల్‌కుమార్ లహోటి, శ్రీలంక మంత్రి నిమల్ సిరిపాల డిసిల్వా ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్, శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, అవంతి శ్రీనివాస్, సినీ డైరెక్టర్ చిన్న జయంతి ఉన్నారు.

ముగిసిన శ్రీపద్మావతి పరిణయోత్సవాలు



తిరుమల: తిరుమలలో శ్రీపద్మావతి శ్రీనివాసుల పరిణయ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. సాయంత్రం శ్రీవారి ఆలయం నుంచి స్వామి వారు గరుడ వాహనంపై, దేవేరులు పల్లకీపై ఊరేగింపుగా బయల్దేరి నారాయణగిరి ఉద్యానవనంలోని పద్మావతీ పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేశారు. ఎదుర్కోలు, పూల చెండ్లాట, నూతన వస్త్ర సమర్పణ తదితర కల్యాణ వేడుకలు జరిపారు. ఆ తర్వాత కొలువు నిర్వహించారు.

టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

- వైఎస్సార్‌సీపీ తరపున ఏజెంట్‌గా ఉన్నందునే మాధవరావు తండ్రి మల్లేష్‌పై దాడి
- 4 రోజులుగా విశాఖ కేజీహెచ్‌లో మృత్యువుతో పోరాటం
- ఇది అచ్చెన్నాయుడు చేసిన హత్యే: ఎమ్మెల్సీ దువ్వాడ

టెక్కలి: శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడ పంచాయతీ చిన్నవెంకటాపురంలో టీడీపీ మూకలు అన్యాయంగా ఓ ప్రాణాన్ని బలి తీసుకున్నాయి. ఈ పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు స్వస్థలం కావడం గమనార్హం. చిన్నవెంకటాపురం పోలింగ్ బూత్‌లో వైఎస్సార్‌సీపీ తరపున తోట మాధవరావు ఏజెంట్‌గా ఉండడంతో టీడీపీ కార్యకర్తలు కక్ష పెంచుకుని అతని తండ్రి మల్లేష్‌పై ఇటీవల దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆయన మృత్యువుతో పోరాడుతూ ఆదివారం ప్రాణాలు విడిచారు. అచ్చెన్నాయుడు, ఆయన సోదరుడు హరివరప్రసాద్ డైరెక్షన్‌లో ఈ నెల 16న గ్రామ



దేవత పండగను ఆసరాగా చేసుకుని మల్లేష్‌పై దాడి చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు పూతి లక్ష్మణరావు, పూతి భానుచందర్, పూతి కర్రెన్న, పూతి రమణ తదితరులు ఈ దాడికి పాల్పడ్డారు. ఇది అచ్చెన్నాయుడు చేసిన హత్యేనని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. సుమారు 40 ఏళ్లుగా నిమ్మాడ పంచాయతీలో శాంతియుతంగా ఎన్నికలు జరగలేదని, ఈ సారీ ఎన్నికల్లో రిగ్గింగ్‌కు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలతో అచ్చెన్నాయుడుకు ఓటమి భయం పట్టుకుందని పేర్కొన్నారు. నిమ్మాడ పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ తరఫున బూత్ ఏజెంట్‌గా వ్యవహరించిన కింజరాపు అప్పన్నను చంపేస్తామని బెదిరించారని దువ్వాడ ఆరోపించారు. మల్లేష్ మృతికి బాధ్యులైన అచ్చెన్నాయుడు, హరివరప్రసాద్‌తో పాటు టీడీపీ వర్గీయులను అరెస్టు చేయాలని దువ్వాడ డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి పార్టీ తరపున అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ హామీ ఇచ్చారు.

ప్రాణాలు తీసిన నిద్రమత్తు

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఇద్దరు మృతి..పలువురికి గాయాలు

కోవూరు/రేణిగుంట: ఆర్టీసీ డ్రైవర్ నిద్రమత్తు ఇద్దరి ప్రాణాలను తీసింది. మరమ్మతులకు గురై రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా దామరమడుగు సమీపంలో ఆదివారం జరిగింది. ప్రయాణికులు, పోలీసుల కథనం మేరకు..ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం కంకణంపాడు, గన్నవరం ప్రాంతాలకు చెందిన పలువురు చెన్నైలో ఉంటూ ఇటీవల సొంతూర్లకు వచ్చారు. శనివారం అర్ధరాత్రి అందరూ తిరిగి చెన్నై వెళ్లేందుకు ప్రకాశం జిల్లా కనిగిరికి చేరుకున్నారు. అక్కడి నుంచి నెల్లూరుకు వెళ్లి..చెన్నైకు వెళ్లాలనుకున్నారు. వీరు కనిగిరి నుంచి నెల్లూరుకు వచ్చే ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. తెల్లవారుజామున కావడంతో ప్రయాణికులందరూ నిద్రమత్తులో ఉన్నారు. బస్సు దామరమడుగు సమీపానికి వచ్చేసరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో బస్సులో ఎడమ వైపు దెబ్బతింది. ఆ పక్క సీట్లలో కూర్చొన్న వేమవరపు మరియమ్మ (46), వేమవరపు డేవిడ్ (48) మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన విశ్రాంతమ్మ నెల్లూరు నారాయణ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. స్వల్పగాయాలపాలైన రమాదేవి, నాగయ్య, కళావతి (వీరంతా ఒకే కుటుంబం), రవికుమార్, సలోమి, అరుణ్, లాజర్ బాబు నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి క్షతగాత్రులను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశం కోవూరు పరిధి కావడంతో కేసును కోవూరు ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్‌కు అప్పగించారు. ఆయన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు





డేవిడ్, మరియమ్మ మృతదేహాలు



రేణిగుంట మండలం వెదుళ్లచెరువు సమీపంలో అగ్నిప్రమాదానికి గురైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధం

20 మందితో బెంగళూరు నుంచి అమలాపురం వెళుతున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రేణిగుంట దాటి వెదుళ్లచెరువు సమీపానికి చేరింది. ప్రమాదవశాత్తూ బస్సు టైరు పేలి మంటలు చెలరేగుతుండటంతో వెనుక వస్తున్న ఓ కారు డ్రైవర్ బస్సు డ్రైవర్‌ను అప్రమత్తం చేశాడు. బస్సులో ఉన్నవారంతా గాఢ నిద్ర నుంచి తేరుకుని వెంటనే బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది ప్రమాదస్థలికి చేరుకుని మంటలను ఆర్పేయగా అప్పటికే బస్సు అంతా కాలిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

హార్సిలీహిల్స్ ఘాట్‌పై తప్పిన ప్రమాదం

బి.కొత్తకోట: అన్నమయ్యజిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై ఆదివారం సాయంత్రం ఓ మినీ బస్సు బ్రేక్ ఫెయిల్ కాగా డ్రైవర్ సమయస్ఫూర్తి వల్ల 25 మంది పర్యాటకులకు ప్రాణాపాయం తప్పింది. రాయచోటి నియోజకవర్గం చిన్నమండేనికి చెందిన పర్యాటకులు స్థానికంగా ఉన్న ట్రావెల్స్‌కు చెందిన మినీ బస్సును అద్దెకు తీసుకుని హార్సిలీహిల్స్ పర్యటనకు వచ్చారు. సాయంత్రం తిరిగి వెళ్తుండగా ప్రొద్దుటూరు మలుపు వద్దకు రాగానే మినీబస్సు వేగం నియంత్రించేందుకు డ్రైవర్ ఖాదర్‌వలీ ప్రయత్నించగా బ్రేక్ ఫెయిలైంది. వాహనాన్ని అలాగే ముందుకు పోనిస్తే మలుపు వద్ద



ప్రమాదం జరిగేది. కానీ అప్రమత్తమైన డ్రైవర్ బస్సును నేరుగా గ్రిల్ పక్కనే ఉన్న బండరాళ్లను ఢీకొట్టించి బస్సు ఆగేలా చేశారు. ఈ సంఘటనలో బస్సు ముందరి భాగం దెబ్బతినగా పర్యాటకులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అనంతరం అందరూ ఆర్టీసీ బస్సుల్లో స్వస్థలానికి వెళ్లారు. చాలా తక్కువ వేగంతో వస్తున్నందునే ప్రమాదాన్ని నివారించగలిగానని డ్రైవర్ ఖాదర్‌వలీ చెప్పారు.

మృత్యువులోనూ వీడని బంధం

నెల్లూరు సిటీ: వారిద్దరూ అక్కాచెల్లెళ్లు. ఒకరంటే ఒకరికి అమితమైన ప్రేమ. అయితే విధి వారి ప్రేమను చూసి ఓర్వలేకపోయింది. ఇద్దరూ ఐదు గంటల వ్యవధిలోనే ప్రాణాలు వదిలిన విషాదకర సంఘటన ఆదివారం జరిగింది. నెల్లూరు నగరం పడారుపల్లిలో ఉదయగిరి మల్లికార్జున, యామిని నివసిస్తున్నారు. మల్లికార్జున ఆర్మీలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేశారు. వీరికి యమున (20), తులసి (19), యశస్విని (11) అనే ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె యమున నీట్‌కు ప్రిపేర్ అవుతోంది. రెండో కుమార్తె తులసి చిన్నప్పటి నుంచి అంగవైకల్యంతో బాధపడుతూ మంచంలో ఉంటోంది. కొంతకాలం క్రితం యమునకు కడుపు నొప్పి రావడంతో సర్జరీ చేయించారు. ఈ క్రమంలో శనివారం యమున ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స నిమిత్తం చెన్నైకు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం ప్రాణాలు వదిలింది. మృతదేహాన్ని నెల్లూరులోని తమ నివాసానికి తీసుకొచ్చారు.

అక్క మరణం తట్టుకోలేక..

అక్క యమున మరణ వార్తను తట్టుకోలేక చెల్లెలు తులసి బోరున విలపించింది. ఉన్నట్టుండి ఫిట్స్ రావడంతో తులసి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది.

కుప్పకూలిన ఇరాన్ అధ్యక్షుడి హెలికాప్టర్

అధ్యక్షుడు రైసీ ఆచూకీ కోసం అన్వేషణ ● ఘటనాస్థలికి చేరుకునేందుకు ప్రయత్నిస్తున్న రెస్క్యూ బృందాలు



ఆదివారం అజర్‌బైజాన్‌లోని అజేరీలో ఆ దేశ అధ్యక్షుడు అలియేవ్‌తో భేటీ అనంతరం బయటకు వస్తున్న ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ

దుబాయ్: ఇరాన్ అధ్యక్షుడు, అతివాద నేత ఇబ్రహీం రైసీ(63) ప్రమాదంలో చిక్కుకున్నారు. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఆదివారం ఉదయం తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్స్ పర్వతమయ అటవీప్రాంతంలో కనిపించకుండా పోయింది. హెలికాప్టర్ కుప్పకూలిందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. కానీ హెలికాప్టర్‌కు ఏమైంది, అధ్యక్షుడి యోగక్షేమాలు వంటి వివరాలను ఇరాన్ ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మార్గదర్శకంలో గత నెలలో ఇజ్రాయెల్‌పై అసాధారణ స్థాయిలో డ్రోన్లు, క్షిపణి దాడులకు తెగబడటం, గతంలో ఎన్నడూలేనంతగా అణ్వస్త్రాల్లో వినియోగించే స్థాయిలో నాణ్యమైన యురేనియంను శుద్ధిచేయడం వంటి చర్యలతో రైసీ దూసుకుపోతున్న వేళ ఆయనకు ప్రమాదం జరగడం గమనార్హం.

ప్రారంభోత్సవానికి వెళ్లి వస్తూ..

ఇరాన్, అజర్‌బైజాన్ సంయుక్తంగా ఇరు దేశాల సరిహద్దు ప్రాంతంలో అరాస్ నదిపై నిర్మించిన ఖిజ్ ఖలాసీ డ్యామ్‌ను ప్రారంభించేందుకు రైసీ ఆదివారం ఉదయం అక్కడికి చేరుకున్నారు. ప్రారంభోత్సవం తర్వాత విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీర బ్దుల్లాహియాన్, ఈస్ట్ అజర్‌బైజాన్ ప్రావిన్స్ గవర్నర్‌తో కలిసి హెలికాప్టర్‌లో బయల్దేరారు. వీరి హెలికాప్టర్‌కు తోడుగా మరో రెండు హెలికాప్టర్లు రక్షణగా వచ్చాయి. హెలికాప్టర్లు జోల్ఫా, వర్జఖాన్ నగరాల మధ్యలోని పర్వతమయ అటవీప్రాంతానికి చేరుకోగానే రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ 'హార్డ్‌ల్యాండింగ్' అయిందని అంతర్జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. అటవీప్రాంతంలోని 'సన్‌గన్' రాగి గని సమీపంలో విమానం కూలిందని కథనాలు వెలువడ్డాయి. దేశాధ్యక్షుడి జాడ గల్లంతైన వార్త తెల్సి దేశ అత్యున్నత సహాయక సిబ్బందిరంగంలోకి దిగారు. కానీ ఘటనాస్థలిలో దట్టంగా కమ్ముకున్న మంచు, అక్కడికి వెళ్లడానికి ఎలాంటి రహదారి లేకపోవడం రెస్క్యూ పనులకు తీవ్ర ఆటంకంగా మారిందని అంతర్గత శాఖ మంత్రి అహ్మద్ వాహిది చెప్పారు. ఒక హెలికాప్టర్‌ను దింపడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. వర్షం, బురద కారణంగా అక్కడికి సహాయక బృందాలు కాలినడకనే వెళ్తున్నట్లు సమాచారం. అధ్యక్షుడు క్షేమంగా తిరిగిరావాలని దేశవ్యాప్తంగా ఇప్పటికే ప్రత్యేక ప్రార్థనలు మొదలయ్యాయి. దేశంపై అంతర్జాతీయ ఆంక్షల నేపథ్యంలో 1979నాటి పాతతరం విమానాలు, హెలికాప్టర్లనే ఇరాన్ వాడుతోంది. రైసీ బెల్ 412 రకం హెలికాప్టర్‌లో ప్రయాణించినట్లు తెలుస్తోంది.



ఎన్నికల వి-చిత్రం

ఈ వ్యక్తి మోసుకెళుతున్న బ్యాగుల్లో సోమవారం జరిగే లోక్‌సభ ఎన్నికల ఐదో విడత పోలింగ్ సామగ్రి ఉంది. పశ్చిమబెంగాల్ రాష్ట్రం హుగ్లీ జిల్లా బేలూర్ పంపిణీ కేంద్రం వద్ద ఆదివారం కనిపించిన దృశ్యమిది.

యూకే పోస్టు–స్టడీ వీసాలు రద్దు!

ప్రధాని రిషి సునాక్ ప్రతిపాదన

లండన్: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లోకి వలసలను అరికట్టడానికి ప్రధానమంత్రి రిషి సునాక్ కొత్తరకం ఆలోచనలు చేస్తున్నారు. యూకేలో గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత రెండేళ్లపాటు ఇక్కడే ఉండి ఉద్యోగాలు చేసుకొనేందుకు వీలు కల్పించే పోస్టు–స్టడీ వీసాను రద్దు చేయాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. అయితే, దీనిపై సొంత మంత్రివర్గం నుంచే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండడం గమనార్హం. యూకే పోస్టు–స్టడీ వీసా పథకం 2021లో ప్రారంభమైంది. దీనితో భారతీయ విద్యార్థులు అధికంగా ప్రయోజనం పొందుతున్నారు. యూకేలో యూనివర్సిటీల్లో గ్రాడ్యుయేషన్ అభ్యసించిన తర్వాత రెండేళ్లదాకా ఇక్కడే ఉంటూ ఉద్యోగాలు చేసుకొనే వెసులుబాటు లభిస్తోంది. ఒకవేళ ఈ వీసాను రద్దుచేస్తే భారతీయ విద్యార్థులే ఎక్కువగా నష్టపోతారని నిపుణులు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో యూకేలోకి వలసలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇవన్నీ చట్టబద్ధంగానే జరుగుతున్నప్పటికీ ప్రభుత్వానికి భారంగా మారుతున్నాయి. వలసలను అరికట్టే చర్యల్లో భాగంగా పోస్టు–స్టడీ వీసాలపై ఆంక్షలు విధించడమా లేక శాశ్వతంగా రద్దు చేయడమా అనే దానిపై ప్రధాని రిషి సునాక్ తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. అయితే, ఈ ప్రతిపాదనను పలువురు యూకే మంత్రులు వ్యతిరేకిస్తున్నారు. విద్యాశాఖ మంత్రి గిలియన్ కీగన్, విదేశాంగ మంత్రి డేవిడ్ కామెరూన్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

నేడే ఐదో దశ పోలింగ్

- 6 రాష్ట్రాలు, రెండు యూటీల్లోని 49 స్థానాలకు జరగనున్న పోలింగ్
- ఏర్పాట్లు పూర్తిచేసిన కేంద్ర ఎన్నికల సంఘం

ముంబై/లక్నో: లోక్‌సభ ఎన్నికల్లో ఐదో దశ పోలింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 49 స్థానాలకు ఈరోజు పోలింగ్ జరగనుంది. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, స్మృతి ఇరానీ, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, తదితర కీలక నేతలు పోటీచేస్తున్న నియోజకవర్గాల్లోనూ ఈరోజే పోలింగ్ చేపడుతున్నారు. ఏడు దశలను చూస్తే ఈ ఐదో దశలోనే అత్యంత తక్కువ(49) స్థానాల్లో పోలింగ్ జరుగుతోంది. ఈ 49 స్థానాల్లో 2019 ఎన్నికల్లో బీజేపీ 40కిపైగా చోట్ల విజయం సాధించడం విశేషం. దీంతో ఈ దశ బీజేపీకి ఎంతో ప్రతిష్టాత్మకంగా మారింది. ఈసారైనా మెరుగైన ఓటింగ్ సాధించేలా ఓటర్లు పోలింగ్ ప్రక్రియలో భారీగా పాలుపంచుకోవాలని ముంబై, థానె, లక్నో నగర ఓటర్లకు ఈసీ ఆదివారం విజ్ఞప్తి చేసింది.

రాష్ట్రం	స్థానాలు
ఉత్తరప్రదేశ్	14
మహారాష్ట్ర	13
బెంగాల్	7
బిహార్	5
ఒడిశా	5
జార్ఖండ్	3
జమ్మూకశ్మీర్	1
లద్దాఖ్	1

బరిలో కీలక నేతలు

కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్(లక్నో), పియూశ్ గోయల్(నార్త్ ముంబై), కౌశల్ కిశోర్(మోహన్‌లాల్‌గంజ్), సాధ్వి నిరంజన్ జ్యోతి(ఫతేపూర్), శంతను ఠాకూర్ (పశ్చిమబెంగాల్‌లోని బంగావ్), ఎల్‌జేపీ(రాం విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్ (బిహార్‌లోని హాజీపూర్), శివసేన శ్రీకాంత్ షిండే(మహారాష్ట్రలోని కళ్యాణ్), బీజేపీ నేత రాజీవ్ ప్రతాప్ రూఢీ, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య(బిహార్‌లోని సరణ్), ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్(ముంబై నార్త్ సెంట్రల్)ల భవితవ్యం సోమవారమే ఈవీఎంలలో నిక్షిప్తం కాబోతోంది. విపక్షాలు అధికారంలోకి వస్తే అయోధ్య బాలరామాలయం పైకి బుల్డోజర్లను పంపిస్తారని మోదీ తీవ్ర విమర్శలు, ఎన్‌డీఏ 400 చోట్ల గెలిస్తే రాజ్యాంగాన్ని ఇష్టమొచ్చినట్లు మారుస్తుందని, రిజర్వేషన్లు తీసేస్తుందని కాంగ్రెస్ విమర్శలతో ఐదో దశ ప్రచారపర్వంలో కాస్తంత వేడి పుట్టించింది. ఒడిశాలో ఐదు లోక్‌సభ స్థానాలతోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో రెండో దశ కింద 35 ఎమ్మెల్యే స్థానాల్లోనూ సోమవారం పోలింగ్ జరగనుంది. బిజూ జనతాదళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ పోటీచేస్తున్న హింజిలీ అసెంబ్లీ స్థానంలో ఈరోజే పోలింగ్ ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో నాలుగోదశ ముగిశాక 543 స్థానాలకుగాను 23 రాష్ట్రాలు,యూటీల్లో ఇప్పటిదాకా 379 స్థానాల్లో పోలింగ్ పూర్తయింది. ఆరో దశ పోలింగ్ మే 25న, ఏడో దశ జూన్ ఒకటిన జరగనుంది.

పోలింగ్ జరిగే స్థానాలు 49

జనరల్	39
ఎస్టీ	07
ఎస్సీ	03
పోలింగ్ కేంద్రాలు	94,732
పోలింగ్ అధికారులు	9.47 లక్షలు
మొత్తం ఓటర్లు	8.95 కోట్లకుపైగా
పురుషులు	4.69 కోట్లు
మహిళలు	4.26 కోట్లు

అసెంబ్లీ ఎన్నికలు — ఒడిశా 35

గాజాపై దాడుల్లో 42 మంది మృతి

డెయిర్ అల్ బలాహ్: గాజాలో ఇజ్రాయెల్, హమాస్ శ్రేణుల మధ్య పోరు భీకరంగా సాగుతోంది. వేర్వేరు ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 35 మంది మృత్యువాతపడ్డారు. నుసైరత్‌లోని శరణార్థి శిబిరంపై ఆదివారం ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 10 మంది మహిళలు, ఏడుగురు చిన్నారులు సహా 27 మంది ప్రాణాలు కోల్పోయారు. నుసైరత్‌లోనే మరో చోట జరిగిన దాడిలో ఐదుగురు చనిపోయారని రెడ్ క్రీసెంట్ తెలిపింది. హమాస్ పోలీసు విభాగం సీనియర్ అధికారి జాహెద్ అల్ హౌలితోపాటు మరొకరు మృతి చెందినట్లు అల్–అక్సా మార్టిర్స్ హాస్పిటల్ వర్గాలు వెల్లడించాయి. బెయిత్ లహియా పట్టణంలోని నివాస ప్రాంతాలపై జరిగిన దాడుల్లో కనీసం 10 మంది చనిపోయారని పౌర రక్షణ విభాగం తెలిపింది. ఇజ్రాయెల్ బలగాలు నెలలపాటు దిగ్బంధించిన ఉత్తర గాజా ప్రాంతంలోని జబాలియా శరణార్థి శిబిరం వద్ద భీకర పోరు సాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ఇబ్బందుల్లో నెతన్యాహు

హమాస్‌పై కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో సొంతంగా ఏర్పాటు చేసిన వార్ కేబినెట్ నుంచి ప్రధానమంత్రి నెతన్యాహు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నారు. యుద్ధం తర్వాత గాజాపై పెత్తనం ఎవరికి ఉండాలనే విషయంలో విభేదాలు తలెత్తాయి. గాజా పాలనకు అంతర్జాతీయ యంత్రాంగం ఏర్పాటు వంటి అంశాలపై జూన్ 8వ తేదీ కల్లా స్పష్టత ఇవ్వాలని, లేకుంటే కేబినెట్ నుంచి వైదొలుగుతామని ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బెన్నీ గాంట్జ్ హెచ్చరించారు.

ఎలక్షన్ బీట్

రాహుల్ నోట మావోయిస్టుల భాష

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్వజం



జంషెడ్‌పూర్/పురులియా/బిష్ణుపూర్: విపక్ష కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ యువరాజు (రాహుల్ గాంధీ) మావోయిస్టుల భాష మాట్లాడుతున్నారని, పారిశ్రామికవేత్తల నుంచి కొత్తకొత్త మార్గాల్లో డబ్బులు వసూలు చేస్తున్నారని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎవరైనా పెట్టుబడులు పెట్టాలంటే 50 సార్లు ఆలోచించే పరిస్థితి రాబోతోందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ వారసత్వ, కుటుంబ రాజకీయాలను ప్రోత్సహిస్తోందని, కొన్ని లోక్‌సభ స్థానాలను పూర్వీకుల ఆస్తులుగా భావిస్తోందని విమర్శించారు. ఆదివారం జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్, పశ్చిమ బెంగాల్‌లోని పురులియా, బిష్ణుపూర్, మేదినీపూర్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. తాము అధికారంలోకి వచ్చాక నక్సలైట్ల వెన్ను విరిచామని అన్నారు. జార్ఖండ్‌లో బలవంతపు వసూళ్ల దందా కొనసాగుతోందని, దీనికి అధికార కాంగ్రెస్, జేఎంఎంలు బాధ్యత వహించాలని తేల్చిచెప్పారు. ''కాంగ్రెస్ రాజకుమారుడు హడావుడిగా రాయ్‌బరేలీని ఎంచుకున్నారు. అది తన తల్లి(సోనియాగాంధీ) స్థానమని చెబుతున్నారు. నిజానికి ఎనిమిదేళ్ల పిల్లాడు కూడా అలా మాట్లాడడు. రాయ్‌బరేలీని తన బిడ్డకు అప్పగించానని ఆ తల్లి అంటున్నారు. కరోనా మహమ్మారి ఉధృత సమయంలో అందరూ కష్టాల్లో ఉన్నప్పుడు ఆ తల్లి కుమారులు ఎక్కడున్నారో రాయ్‌బరేలీ ప్రజలు నిలదీయాలి. కొన్ని నియోజకవర్గాలు వారి పూర్వీకుల ఆస్తులుగా కాంగ్రెస్ వీలునామా రాసుకుంది''. అని మోదీ ధ్వజమెత్తారు. ''ఇండియా' కూటమి ముమ్మాటికీ అవినీతి కూటమే. అవినీతిపరులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఇది నా గ్యారంటీ'' అని ప్రధాని మోదీ హెచ్చరించారు.

70 ఏళ్లు భద్రంగా కాపాడారు

ఆర్టికల్ 370 అంటే కాంగ్రెస్‌కు అమితమైన ప్రేమ: అమిత్ షా



జౌన్‌పూర్/ప్రయాగ్‌రాజ్/బేతియా: దేశంలో ఉగ్రవాదం పెచ్చరిల్లడానికి ప్రధాన కారణమైన ఆర్టికల్ 370ని రద్దుచేయకుండా కాంగ్రెస్ 70 ఏళ్లు భద్రంగా కాపాడిందని బీజేపీ అగ్రనేత అమిత్ షా పదునైన విమర్శనాస్త్రాలు సంధించారు. ఆదివారం అమిత్‌షా ఉత్తరప్రదేశ్, బిహార్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. జౌన్‌పూర్, ప్రయాగ్‌రాజ్, బేతియా పట్టణాల్లో ఆయన ఎన్నికల ప్రచార ర్యాలీల్లో ఓటర్లనుద్దేశించి ప్రసంగించారు. '' కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఆర్టికల్ 370ని ఏకంగా 70 సంవత్సరాలు కంటికి రెప్పలా కాపాడుకున్నాయి. మీరు(ఓటర్లు) మోదీజీకి పూర్తి మెజారిటీ ఇచ్చి ప్రధానిని చేయడం వల్లే ఆ ఆర్టికల్ రద్దయింది. దీంతో శ్రీనగర్ లాల్‌చౌక్‌లో త్రివర్ణపతాకం తొలిసారిగా రెపరెపలాడింది. మూడోసారి మోదీ ప్రధాని అయితే రిజర్వేషన్లు పోతాయని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. పదేళ్లుగా పూర్తి మెజారిటీ ప్రభుత్వాన్ని నడుపుతున్నాసరే మోదీ ఆ మెజారిటీని రిజర్వేషన్ల రద్దుకు దుర్వినియోగం చేయలేదు'' అని చెప్పారు.

ఆప్‌కు బుద్ధి చెప్పండి: నడ్డా

చండీగఢ్: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)పై బీజేపీ చీఫ్ జేపీ నడ్డా విరుచుకుపడ్డారు. మురికి పనులు చేస్తున్న ఆప్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కుటుంబపార్టీగా మారిపోయిందని, కాంగ్రెస్, ప్రతిపక్ష ఇండియా కూటమి అవినీతి కూటములుగా తయారయ్యాయని నడ్డా ఆరోపించారు. ఈ పార్టీల నేతలు ఉంటే జైల్లో, లేదా బెయిల్‌పై ఉన్నారని వ్యాఖ్యానించారు. తమకు సవాల్‌గా మారిన ఆప్‌ను అణగదొక్కేందుకు 'ఆపరేషన్ ఝాడు'ను బీజేపీ మొదలుపెట్టిందంటూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై నడ్డా ఈ మేరకు స్పందించారు. 'గతంలో కాంగ్రెస్‌తో చేతులు కలిపేది లేదన్న కేజ్రీవాల్ నేడు ఆ పార్టీతో కలిసిపోయారు. అవినీతికి పాల్పడమని చెప్పిన ఆ పార్టీ నేతలు ముగ్గురు ఇప్పుడు జైలులో ఉన్నారు. మహిళల గౌరవం గురించి చెప్పిన ఆ నేత ఇంట్లో మహిళపై దాడి జరుగుతున్నా మౌనంగా ఉన్నారు'అని కేజ్రీవాల్‌పై మండిపడ్డారు.

ప్రజ్వల్ రేవణ్ణపై అరెస్ట్ వారెంట్

బెంగళూరు: లైంగిక వేధింపుల ఆరోపణలను ఎదుర్కొంటున్న జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ప్రజ్వల్‌తోపాటు, ఆయన తండ్రి ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణపై శనివారం నమోదైన లైంగిక దాడి కేసులో ఈ వారెంట్ పంపింది. మహిళ కిడ్నాప్ ఆరోపణలను ఎదుర్కొంటున్న మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ కుమారుడు రేవణ్ణ వారం పాటు జైలులో గడిపి ప్రస్తుతం బెయిల్‌పై బయటకు వచ్చారు. హస్సన్ లోక్‌సభ నియోజకవర్గం ఎన్‌డీఏ అభ్యర్థి అయిన ప్రజ్వల్ విదేశాల్లో ఉన్నారు. ఆయనపై ఇంటర్‌పోల్ బ్లూ కార్నర్ నోటీసిచ్చింది. ప్రజ్వల్‌పై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు కోసం కర్ణాటక ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది.

ఎయిరిండియా విమానం ఇంజిన్‌లో మంటలు

దొడ్డబళ్లాపురం: ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ తీసుకున్న ఇంజిన్‌లో మంటలు చెలరేగడంతో వెంటనే అత్యవసరంగా ల్యాండయింది. ఈ ఘటన బెంగళూరు కెంపెగౌడ ఎయిర్‌పోర్టులో చోటుచేసుకుంది. శనివారం రాత్రి 11.12 గంటలకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ 1132 విమానం కొచ్చిన్‌కి బయలుదేరింది. టేకాఫ్ తీసుకున్న కొన్ని నిమిషాల్లోనే విమానం కుడి వైపు ఇంజిన్‌లో మంటలు రావడం పైలట్ గమనించారు. వెంటనే అధికారులకు సమాచారమివ్వడం, వారి సూచనల మేరకు అదే ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రత్యేక మార్గాల ద్వారా 179 మంది ప్రయాణికులతో పాటు ఆరుగురు సిబ్బందిని బయటకు తీసుకొచ్చారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నేటి నుంచి పార్లమెంట్‌కు సీఐఎస్‌ఎఫ్ భద్రత

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంట్ భవనానికి నేటి నుంచి కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్‌ఎఫ్) భద్రత కల్పించనుంది. 3,317 మంది సీఐఎస్‌ఎఫ్ జవాన్లు విధుల్లో చేరనున్నారు. సీఐఎస్‌ఎఫ్ కౌంటర్ టెర్రరిజం సెక్యూరిటీ యూనిట్ సోమవారం ఉదయం 6 గంటలకు బాధ్యతలు చేపట్టనుంది. ఇప్పటిదాకా ఇక్కడ విధులు నిర్వర్తించిన 1,400 మందికిపైగా సీఆర్‌పీఎఫ్ జవాన్ల ఉపసంహరణ ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది.

రాహుల్ సభలో తొక్కిసలాట

- పలువురు కార్యకర్తలకు గాయాలు
- ప్రసంగించకుండా వెళ్లిపోయిన రాహుల్, అఖిలేశ్
- ఉత్తరప్రదేశ్‌లోని పడిలా ప్రాంతంలో ఘటన

ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పాల్గొన్న ఎన్నికల ప్రచారసభలో అపశృతి చోటుచేసుకుంది. కాంగ్రెస్, ఎస్పీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావడంతో సభావేదిక వద్ద తొక్కిస లాట జరిగింది. ఈ ఘటనలో పలువురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. ఆదివారం పూల్‌పూర్ నియోజకవర్గం పరిధిలోని పడిలా ప్రాంతంలో నిర్వహించిన ప్రచారసభ ఈ ఘటనకు వేదికైంది. ప్రచారసభకు రాహుల్, అఖిలేశ్ వస్తున్నారని తెల్సి ఇరుపార్టీల కార్యకర్తలు, మద్దతుదారులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కిక్కిరిసిన జనంతో సభా ప్రాంగణం మొత్తం నిండిపోయింది. ప్రసంగించేందుకు అఖిలేశ్ సభావేదిక మీదకు రాగానే జనం వేదికపైపు హఠాత్తుగా ముందుకొచ్చారు. బారికేడ్లు, అడ్డుగా ఏర్పాటుచేసిన కర్రలను తొలగించి మరీ దూసుకొచ్చారు. దీంతో ఒక్కసారి తొక్కిసలాట జరిగింది. దీంతో ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి. వెనక్కి వెళ్లండి అని వేదికపై నుంచి అగ్రనేతలు హెచ్చరించినా కార్యకర్తలు ఎవ్వరూ వినిపించుకోలేదు. ఓటర్ల శాంతించాలని విన్నవించినా పట్టించుకోలేదు. చాలా మంది రాహుల్, అఖిలేశ్ దాకా వచ్చి వారితో షేక్‌హ్యాండ్ కోసం స్టేజీ వద్ద ఎగబడ్డారు. ఈ హఠాత్ పరిణామంతో, భారీగా పోగైన కార్యకర్తలను నిలువరించలేక పోలీసులు చేతులెత్తేశారు. దాంతో అక్కడ మొత్తం గందరగోళ పరిస్థితి ఏర్పడింది. మీ భద్రతకు ముప్పుందని అక్కడి భద్రతా, పోలీసు సిబ్బంది అగ్రనేతలు రాహుల్, అఖిలేశ్‌లను అప్రమత్తంచేశారు. ఈ పరిస్థితుల్లో ప్రసంగించాలా వద్దా అని రాహుల్, అఖిలేశ్ కొద్దిసేపు మాట్లాడుకున్నారు. తర్వాత ప్రసంగించకుండానే ఇద్దరు నేతలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో సభ అర్ధంతరంగా ముగిసిపోయింది. తర్వాత అక్కడి సమీపంలోని ముంగారీ ర్యాలీలో ప్రసంగించారు. అక్కడ కూడా దాదాపు ఇదే మాదిరిగా కార్యకర్తలు బారికేడ్లను దాటుకొని ముందుకు రాబోయారు.



పూల్పూర్ ర్యాలీ వేదికపై మల్లగుల్లాలు పడుతున్న రాహుల్, అఖిలేశ్

యూపీలో బీజేపీకి దక్కేది ఒక్కటే సీటు: రాహుల్

ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో మాత్రమే బీజేపీ గెలుస్తుందని రాహుల్ గాంధీ జోస్యం చెప్పారు. ఆదివారం ఆయన 'ఇండియా' అభ్యర్థి ఉజ్వల్ రమణ్ సింగ్ తరఫున రాష్ట్రంలోని ప్రయాగరాజ్‌లో ఎస్పీ చీఫ్ అఖిలేశ్‌తో కలిసి ప్రచారం చేశారు. జపాన్‌లోని సుందరనగరం క్యోటోలాగా వారణాసిని తీర్చిదిద్దుతానని మోదీ గతంలో ఇచ్చిన హామీని రాహుల్ ఈ ర్యాలీలో ప్రస్తావించారు. '' ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ క్యోటో సీటును మాత్రమే మోదీ గెలవబోతున్నారు. రాష్ట్రంలో బీజేపీ గెలిచే సీటు అదొక్కటే. కోవిడ్‌కాలంలో బీజేపీ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టింది. ఇప్పుడు ఏకంగా రాజ్యాంగాన్ని ఇష్టారీతిన మార్చేందుకు తెగబడింది'' అని అన్నారు.

నాడు న్యాయం కావాలన్న వారే నేడు నిందితుల కొమ్ము కాస్తున్నారు..!

ఆప్ నేతలపై స్వాతి మలివాల్ ధ్వజం

న్యూఢిల్లీ: ఒకప్పుడు నిర్భయకు న్యాయం దక్కాలంటూ డిమాండ్ చేసిన తమ పార్టీ నేతలే ఇప్పుడు తనపై దాడికి పాల్పడిన వ్యక్తికి మద్దతుగా మాట్లాడుతున్నారని ఆప్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ మండిపడ్డారు. 'గతంలో నిర్భయకు న్యాయం జరగాలంటూ ఆప్ నేతలమంతా కలిసి వీధుల్లోకి వచ్చాం. 12 ఏళ్ల తర్వాత ఇప్పుడు, ఆ నేతలే సీసీటీవీ ఫుటేజీని ధ్వంసం చేసి, సెల్‌ఫోన్‌లో ఆధారాల్లేకుండా చేసిన బిభవ్ కుమార్ కోసం బజారుకెక్కారు. మద్యం పాలసీ కేసులో జైలుపాలైన ఆప్ నేత, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా బయట ఉండి ఉంటే ఈ ఆందోళనలు ఇంకా తీవ్రంగా ఉండేవి. నా పరిస్థితి మరింత దారుణమయ్యేది'అని ఆమె వ్యాఖ్యానించారు. ఈ నెల 13న సీఎం కేజ్రీవాల్ నివాసానికి వెళ్లిన తనపై కేజ్రీవాల్ సహాయకుడు బిభవ్ కుమార్ దాడికి పాల్పడ్డారని స్వాతి ఆరోపించడం..కేజ్రీవాల్‌ను ఇరికించేందుకే బీజేపీతో కలిసి ఆమె నాటకం ఆడుతున్నారని ఆప్ ప్రత్యారోపణలు చేయడం తెలిసిందే.

బీజేపీ ఆఫీసు ముట్టడి

కార్యకర్తలతో కలిసి బైఠాయించిన అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ: తమ నాయకులను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఆదివారం ఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యాలయ ముట్టడి కార్యక్రమం నిర్వహించింది. ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు పార్టీ ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత ఆప్ ప్రధాన కార్యాలయం వద్ద నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి కేజ్రీవాల్ మాట్లాడారు. అనంతరం బీజేపీ కార్యాలయ ముట్టడికి బయలుదేరారు. మధ్యలోనే పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేజ్రీవాల్‌తోపాటు మరికొంతమంది బీజేపీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ ఆఫీసు చుట్టూ పోలీసులు మోహరించారు. బారీకేడ్లు ఏర్పాటు చేశారు. కేజ్రీవాల్ అక్కడే కార్యకర్తలతో కలిసి దాదాపు అరగంటపాటు బైఠాయించారు. అనంతరం ఆప్ కార్యాలయానికి తిరిగివచ్చారు. తమను పోలీసులు అరెస్టు చేస్తారని ఎదురుచూశామని, అయినా అరెస్టు చేయలేదని 'ఆప్' నేతలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'ఆప్' అంతానికే మోదీ 'ఆపరేషన్ ఝాడూ'

ఆమ్ ఆద్మీ పార్టీని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక సవాలుగా చూస్తున్నారని, అందుకే పార్టీని అంతం చేయడానికి 'ఆపరేషన్ ఝాడూ' ప్రారంభించారని కేజ్రీవాల్ ఆరోపించారు. మోదీని కలిసివచ్చినవారు తనతో ఈ విషయం చెప్పారని అన్నారు. ఆప్ పట్ల ప్రజల్లో ఆదరణ వేగంగా పెరుగుతోందని, ఇదంతా మోదీకి నచ్చడం లేదన్నారు. అందుకే తమ పార్టీని నాశనం చేయాలని ప్రధానమంత్రి కంకణం కట్టుకున్నారని మండిపడ్డారు. తమ పార్టీకి చెందిన ముఖ్య నాయకులను అరెస్టు చేస్తున్నారని, త్వరలో పార్టీ బ్యాంకు ఖాతాలను సైతం స్తంభింపజేస్తారని చెప్పారు. బీజేపీ మనపై పగబట్టిందని, ముున్ముందు మనకు మరిన్ని సవాళ్లు ఎదురవుతాయని పార్టీ కార్యకర్తలతో చెప్పారు. అన్ని రకాల సవాళ్లకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 'ఆప్' అంటే కొందరు వ్యక్తుల పార్టీ కాదని, 140 కోట్ల మంది స్వప్నం అని స్పష్టం చేశారు. 'ఆప్' అంటే ఒక సిద్ధాంతం అని పేర్కొన్నారు. నాయకులను అరెస్టు చేయొచ్చు గానీ సిద్ధాంతాన్ని ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. ఒక నాయకుడిని అరెస్టు చేస్తే, వంద మంది నాయకలకు భరతమాత జన్మనిస్తుందని వ్యాఖ్యానించారు. ఒక కేజ్రీవాల్ అరెస్టయితే వంద మంది కేజ్రీవాల్‌లు పుట్టుకొస్తారని, ఈ సంగతి ప్రధాని మోదీ తెలుసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా, బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించడానికి బయలుదేరిన ఆప్ నేతలను, కార్యకర్తలను పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు.



కేజ్రీవాల్ సారథ్యంలో బీజేపీ కార్యాలయం వైపు వెళ్తున్న ఆప్ శ్రేణులు

5 రోజుల పోలీస్ కస్టడీకి బిభవ్

న్యూఢిల్లీ: ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్‌పై దాడి కేసులో నిందితుడు, సీఎం కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి బిభవ్ కుమార్‌ను ఐదు రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీ కోర్టు ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. '' సాక్ష్యాధారాల సేకరణ కోసం నిందితుడిని ముంబైసహా ఢిల్లీలోని పలు ప్రాంతాలకు పోలీసులు తీసుకెళ్లాల్సి ఉందని అర్థమైంది. కేసు తీవ్రత దృష్ట్యా బిభవ్‌ను పోలీస్ కస్టడీకి అప్పగిస్తున్నాం' అని ఢిల్లీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ గౌరవ్ గోయల్ ఉత్తర్వులో పేర్కొన్నారు. శనివారం రాత్రి మొదలైన వాదనలు చాలాసేపు సాగాయి. ఏడు రోజులపాటు పోలీసు కస్టడీకి ఇవ్వాలని పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ శ్రీవాస్తవ వాదించారు. ఘటన జరిగిన రెండు, మూడు రోజుల తర్వాత ఉద్దేశపూర్వకంగా ఆలస్యంగా ఆమె ఫిర్యాదు ఇచ్చారని బిభవ్ తరఫున రాజీవ్‌మోహన్ తదితర న్యాయవాదులు వాదించారు. అయితే '' బాధితురాలు మేజిస్ట్రేట్ వద్ద ఇచ్చిన వాంగ్మూలం, ఎఫ్ఐఆర్‌లోని అంశాలు, ఎయిమ్స్ మెడికో లీగల్ కేసులోని అంశాలు సరిపోలుతున్నాయి. ముందస్తు నోటీస్ లేకున్నా అరెస్టును మేం సమర్థిస్తున్నాం. కేసు తీవ్రత దృష్ట్యా ఐదురోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తున్నాం' అని జడ్జి స్పష్టంచేశారు.

ఫోన్‌ను ఫార్మాట్ చేసిన బిభవ్!

ఘటన సంబంధ సాక్ష్యాధారాలను బిభవ్ ఇప్పటికే ధ్వంసం చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అరెస్ట్‌కు ఒక రోజు ముందే బిభవ్ తన ఫోన్‌ను ఫార్మాట్ చేశారు. ఫోన్ సరిగా పనిచేయట్లేదని, అందుకే ఐఫోన్‌ను ముంబైలో ఫార్మాట్ చేయించానని బిభవ్ చెప్పడంతో ఆయనను ముంబైకి తీసుకెళ్లి ఫోన్ సంబంధ ఫోన్‌కాల్, ఇతర డేటాను ఫోరెన్సిక్ నిపుణుల సాయంతో రికవరీ చేయాలని పోలీసులు భావిస్తున్నారు. ఐదు రోజుల కస్టడీకాలంలో బిభవ్‌ను పోలీసులు ముంబైకి తీసుకెళ్లే అవకాశముంది. అడిగిన ప్రశ్నలకు బిభవ్ పొంతలేని సమాధానాలు చెబుతున్నారని, దర్యాప్తునకు సహకరించట్లేదని రిమాండ్ దరఖాస్తులో నార్త్ ఢిల్లీ అదనపు డెప్యూటీ కమిషనర్ అంజిత చేప్యాల పేర్కొన్నారు. ''పోలీసులు ఆదివారం కేజ్రీవాల్ ఇంటికెళ్లి అక్కడి సీసీటీవీ డిజిటల్ వీడియో రికార్డర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే అక్కడి అధికారులు ఘటన జరిగిన డ్రాయింగ్ రూమ్ సీసీటీవీ ఫుటేజీ ఇవ్వకుండా డైనింగ్ హాల్ ఫుటేజీ ఇచ్చారు. ఆ ఫుటేజీ ఖాళీగా ఉంది. సీఎం ఇంట్లో తొమ్మిదేళ్లకుపైగా భద్రతా అధికారిగా కొనసాగుతున్న బిభవ్ సాక్ష్యాలను ప్రభావితంచేసి ఉండొచ్చు'' అని పోలీసులు చెప్పారు. బిభవ్‌పై మరో కేసు నమోదైంది. విధి నిర్వహణలో ఉన్న ఒక ప్రభుత్వ ఉద్యోగిని కొట్టాడన్న ఆరోపణలపై నోయిడాలో కేసు నమోదైంది.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
సోమవారం। 20। మే। 2024

నగరంలో జూన్ 2 నుంచి గ్రేట్ మ్యాంగో ఫెస్టివల్

కొరుక్కుపేట: వేసవికాలం వచ్చిందటే చాలు మామిడి పండ్లు సందడి నెలకొంటుంది. రకరకాల మామిడి పండ్లను రుచి చూడందే ఉండలేం. ఈ క్రమంలో చెన్నైనగర శివారులోని ఒత్తివాక్కంలో హనురెడ్డి మ్యాంగో టూరిజం ఆధ్వర్యంలో జూన్ 2 నుంచి గ్రేట్ మ్యాంగో ఫెస్టివల్ ప్రారంభం అవుతాయని ఆ సంస్థ నిర్వాహకులు హనురెడ్డి తెలిపారు. ఈ ఉత్సవాలను జూన్ 2, 9, 16, 23 తేదీల్లో ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 156 అడుగుల హనూస్ టేబుల్స్‌పై మామిడి, మామిడి పండ్లతో తయారైన పదార్థాలను పంపిణీ చేస్తామన్నారు. హనురెడ్డి రాఘవ ఫామ్స్‌లో జరిగే ఈ వేడుకలను మామిడి పండ్ల కీర్తిని పెంచేలా భావితరాలకు పండ్ల రుచులు తెలిసేలా జరుపుతామని వివరించారు.

న్యూస్‌రీల్

మద్యం మత్తులో సీఎం స్టాలిన్ నివాసానికి..

- యువకుడి అరెస్టు

కొరుక్కుపేట: చెన్నైలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఇంటికి మద్యం మత్తులో వచ్చిన ఓ యువకుడు రావడం సంచలనం కలిగించింది. వివరాలు.. చెన్నైలోని ఆళ్వార్‌పేటలోని చిత్తరంజన్ రోడ్డులో ఉన్న సీఎం ఎం.కె.స్టాలిన్ ఇంటికి ద్విచక్రవాహనంపై వచ్చిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఆ వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. ద్విచక్ర వాహనం ముందు భాగంలో పోలీసు స్టిక్కర్ అతికించి ఉండడం గమనార్హం. విచారణలో నిందితుడి పేరు సంతోష్ అని, రామనాథపురం జిల్లా అని తేలింది. తాను డ్రగ్స్‌కు అలవాటు పడ్డానని, తనలా మరెవరూ డ్రగ్స్‌కు బానిస కాకుండా చూడాలని ముఖ్యమంత్రికి సూచించేందుకే వచ్చానని నిందితుడు పేర్కొనడం గమనార్హం. ఇక సంతోష్ వచ్చిన ద్విచక్ర వాహనం కొలత్తూరు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పాండియరాజన్ డ్రైవర్ అరుణ్ ది అని తెలిసింది. దీంతో తేనాంపేట పోలీసులు సంతోష్‌పై కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. ఈ ఘటన చెన్నైలో సంచలనం సృష్టించింది.

రాందాస్‌పై అనుచిత వ్యాఖ్యలు

- నామ్ తమిళర్ పార్టీ నేత అరెస్టు

తిరువొత్తియూరు: ఎడప్పాడిలో పీఎంకే పార్టీ వ్యవస్థాపకుడు రాందాస్‌ను కించపరుస్తూ సామాజిక మాధ్యమాలలో అనుచిత వ్యాఖ్యలు చేసిన నామ్ తమిళ్ పార్టీ నాయకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. సేలం జిల్లా ఎడప్పాడి సమీపంలోని వెల్లండివలసై నాచియార్ కేటికాడై ప్రాంతానికి చెందిన కందస్వామి కుమారుడు కార్తీ (28). అతను నామ్ తమిళ్ పార్టీ నాయకుడు. ఆ ప్రాంతంలో తన తండ్రితో కలిసి హోటల్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్‌పై కార్తీ సామాజిక మాధ్యమాల్లో తీవ్రంగా విరుచుకు పడ్డాడు. ఈ కథనాలపై కొందరు పీఎంకే నాయకులు కార్తీని అరెస్టు చేయాలని శనివారం ఎడప్పాడి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు కేసు నమోదు చసి కార్తీని అరెస్టు చేశారు.

బాబోయ్ డెంగీ

- 8 జిల్లాల్లో కేసుల నమోదు
- మదురైలో అత్యధికం



సాక్షి, చెన్నై: రాష్ట్రంలో డెంగీ కేసులు బయట పడ్డాయి. 8 జిల్లాలో ఈ కేసులు నమోదైనట్లు గుర్తించారు. ఇందులో మదురైలో అధికంగా బాధితులున్నట్లు తేలింది. వివరాలు.. నైరుతి రుతు పవనాల సీజన్‌లో సాధారణంగా రాష్ట్రంలో డెంగీ కేసులు వెలుగు చూస్తుంటాయి. అయితే ఈసారి ముందుగానే డెంగీ కేసులు బయటపడడం కలవరం రేపుతోంది. గత వారం రోజులుగా మారిన వాతావరణం నేపథ్యంలో జ్వరాలతో బాధ పడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. జ్వరాలు అధికం అవుతున్నాయనే సమాచారంతో ఆరోగ్య శాఖ అన్ని ఆస్పత్రుల్లోని వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసింది. ఈ పరిస్థితులలో ఆస్పత్రులకు వచ్చిన రోగులకు జరిపిన పరీక్షలలో డెంగీ కేసులు బయట పడ్డాయి. గత మూడు రోజులలో 8 జిల్లాలో 40 డెంగీ కేసులు వెలుగు చూశాయి. ఇందులో 15 కేసులు మదురైలోనే ఉండటంతో ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా జ్వరాలతో వచ్చే వారికి ప్రత్యేక చికిత్సపై దృష్టి పెట్టారు. ఫీవర్ క్యాంపుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. వర్షపు నీటి కాలువలను శుభ్రం చేయడం, దోమల వ్యాప్తి కట్టడి దిశగా చర్యలు విస్తృతం చేయాలని ఆయా జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

రాష్ట్రవ్యాప్తంగా 100 చోట్ల నిరాహార దీక్ష

- ప్రభుత్వ రవాణా శాఖ ఉద్యోగుల తీర్మానం

కొరుక్కుపేట: అలవెన్సుల పెంపు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రయోజనాలను పూర్తిస్థాయిలో అందించడం వంటి కీలక నిర్ణయాలను సమావేశంలో తీర్మానించారు. దీనికోసం తమిళనాడు ప్రభుత్వ రవాణా ఉద్యోగుల సంఘం తరపున రాష్ట్రవ్యాప్తంగా 100 చోట్ల నిరాహార దీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. వివరాలు.. సౌందరరాజన్ అధ్యక్షతన విల్లుపురంలో తమిళనాడు ప్రభుత్వ రవాణా ఉద్యోగుల సంఘం రాష్ట్ర నిర్వాహకుల సంప్రదింపుల సమావేశం ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పెద్దసంఖ్యలో రవాణా ఉద్యోగులు పాల్గొన్నారు . పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పదవీ కాల ప్రయోజనాలను, అలవెన్సుల పెంపు, పాత పెన్షన్ విధానం అమలు, వారసులకు పని కల్పించడం వంటి పలు అంశాలపై చర్చించారు. జూన్ 10 నుంచి 15 వరకు ప్రవేశ సభలు నిర్వహించడం, జూన్ 24న రాష్ట్రవ్యాప్తంగా 100 చోట్ల నిరాహార దీక్షలు చేపట్టడం వంటి పలు ముఖ్యమైన తీర్మానాలను ఆమోదించారు.

జలమయమైన కోవై బస్టాండ్



కోవై మెయిన్ రోడ్డుపై వరద నీరు



కూలిన బస్ షెల్టర్



కారుపై కూలిన వృక్షం



వదలని వాన

ఉపరితల ఆవర్తనం క్రమంగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తోంది. దీని ప్రభావంతో పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఈనెల 22వ తేదీన అల్పపీడన ద్రోణి ఏర్పడే అవకాశం ఉండదంతో సోమవారం నుంచి పశ్చిమ కనుమల్లోని కన్యాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి, తేని జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ జిల్లాలో సహాయ చర్యల కోసం ముందు జాగ్రత్తగా విపత్తు నిర్వహణ బృందాలను ప్రభుత్వం తరలించింది.

- నాలుగు జిల్లాల్లో విపత్తు నిర్వహణ బృందాలు
- జలాశయాల్లోకి పెరిగిన ఇన్ ఫ్లో
- క్రమంగా విస్తరిస్తున్న ఉపరితల ఆవర్తనం
- పలు జిల్లాలో కొనసాగుతున్న వానలు
- 22న బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణికి అవకాశం



మదురై: సబ్‌వేలో చిక్కుకున్న వాహనం నుంచి ప్రయాణికులను రోప్ ద్వారా తరలిస్తున్న రక్షణ బృందాలు

సాక్షి, చెన్నై : ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో ఎండలు మండినా, మే నెలలో భానుడి ప్రభావం తగ్గింది. అగ్ని నక్షత్రం సమయంలో ఎండలు సాధారణంగా జనానికి చుక్కలు చూపుతాయి. అయితే ఈ ఏడాది భానుడు కనుమరుగై అకాల వర్షం రూపంలో రాష్ట్రంలో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ప్రధానంగా పశ్చిమ కనుమల వెంబడి ఉన్న జిల్లాలో గత వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇక్కడ వాగులు, వంకలు, జలపాతాలు పొంగి పొర్లుతున్నాయి. రిజర్వాయర్‌లలోకి నీటి రాక పెరిగింది.

యంత్రాంగం అప్రమత్తం..

ఈనెల 22వ తేదీన నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడనుంది. ఈ ప్రభావం కారణంగా రాష్ట్రంలోని కన్యాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి, తేని జిల్లాలకు అతి భారీ వర్షాల హెచ్చరికలను వాతావరణ కేంద్రం జారీ చేసింది. ఈద్రోణి 24వ తేదీన ఈశాన్య దిశగా పయనించి సెంట్రల్ బంగాళాఖాతంలో వాయుగుండంగా మారనుంది. ఇది ప్రయాణించే మార్గం మేరకు ఉత్తర తమిళనాడులోనూ భారీ వర్షాలకు అవకాశాలు ఉన్నాయి. ఈ పరిస్థితులలో ఆదివారం నుంచి కన్యాకుమారి, తేని, తెన్‌కాశి, తిరునల్వేలి జిల్లాలకు విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. సోమవారం నుంచి ఈ ప్రభావం మరింతగా పెరగనుంది. అలాగే విరుదునగర్, దిండుగల్, తిరుప్పూర్, కోయంబత్తూరు, నీలగిరి, తూత్తుకుడి, రామనాథపురం, మదురై, శివగంగై, పుదుకోట్టై జిల్లాలో మోస్తారుగా అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. నీలగిరులలో కురుస్తున్న వర్షాలకు కొండ చరియలు విరిగి పడడంతో ఊటీకి రైలు సేవలను రద్దు చేశారు. డెల్టా జిల్లాలైనా తంజావూరు, తిరువారూర్, నాగపట్నం, మైలాడుతురై కడలూరు, అరియలూరు, పెరంబలూరు, తిరుచ్చి జిల్లాలోనూ వర్షాలు పడుతున్నాయి. రానున్న రోజులలో ఈ జిల్లాలో 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. దీంతో ముందు జాగ్రత్తలపై ఆయా జిల్లా కలెక్టర్లు దృష్టి పెట్టారు. అతి భారీ వర్షాలకు అవకాశం ఉన్న కన్యాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి, తేని జిల్లాలకు విపత్తు నిర్వహణ బృందాలు తరలించారు. తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి సమీపంలో పిడుగు పడడంతో ఆ ప్రాంతానికి చెందిన షణ్ముగసుందరం భార్య అచ్చియమ్మాల్(63) మరణించారు. కోయంబత్తూరు జిల్లా పరిధిలో కురిసిన వర్షాలకు పొల్లాచ్చి పరిసరాలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. విరుదునగర్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు అయ్యనార్, రాక్కచ్చి, పేయనారు నదులలో నీటి పరవళ్లు పెరిగాయి. షణ్ముగా తోప్పు వాగులో వరద ఉధృతిలో చిక్కుకున్న వారిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. ఇక చెన్నై నగరం, శివారు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతంగా మారింది. వాతావరణం చల్లబడడమే కాకుండా అక్కడక్కడా చిరు జల్లులు పలకరించడంతో నగరవాసులు ఉపశమనం పొందారు.



వాల్పారైలో రోడ్డుపై పడిన కొండ రాళ్లు



వరద నీటిలో మదురై రైల్వే స్టేషన్ రోడ్డు



మదురై: మెయిన్ రోడ్డులో వరద నీరు



కూలిన బైక్ షెడ్







మదురై: బస్టాండ్ సమీపంలో వరద నీటి ప్రవాహం, కోవిల్‌పట్టి హైరోడ్డులో వరద నీరు, కోవిల్‌పట్టి బస్టాండ్ వద్ద ప్రయాణికుల ఇక్కట్లు

ఇంజినీరింగ్‌కు 1.69 లక్షల దరఖాస్తులు

సాక్షి, చెన్నై: ఇంజినీరింగ్ ప్రవేశం నిమిత్తం 1.69 లక్షల మంది విద్యార్థులు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఈ ఏడాది అయినా సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అవుతాయా..? లేదా? అనే చర్చ సాంకేతిక విద్యా డైరెక్టరేట్ వర్గాలలో ప్రారంభమైంది. వివరాలు.. రాష్ట్రంలోని 400లకు పైగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలోని సుమారు లక్షా 75 వేల ప్రభుత్వ కోటా ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించిన సీట్లను సాంకేతిక విద్యా డైరెక్టరేట్ భర్తీ చేస్తున్న విషయం తెలిసిందే. అన్నా వర్సిటీ ద్వారా ఈ ప్రక్రియ జరుగుతోంది. ప్లస్–2 ఫలితాల విడుదలతో ఈనెల 6వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు లక్షా 69 వేల 486 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ వివరాలను సాంకేతిక విద్యా డైరెక్టరేట్ ఆదివారం ప్రకటించింది. వచ్చిన దరఖాస్తులలో లక్షా 17 వేల 596 మంది విద్యార్థులు దరఖాస్తు ఫీజును చెల్లించారని వివరించారు. ఇందులో 88,467 మంది విద్యార్థులు సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేశారు. దరఖాస్తుల సమర్పణకు జూన్ 6వ తేదీ వరకు సమయం ఉంది. అయితే దరఖాస్తు ప్రక్రియ మందకొడిగా ఉండడంతో గత ఏడాది తరహాలోనే ఈసారి కూడా అనేక కళాశాలలో సీట్లు భర్తీ అయ్యే అంశంపై సందిగ్ధం నెలకొంది. గత ఏడాది లక్ష సీట్ల వరకే భర్తీ కాగా, మిగిలిన సీట్లన్నీ ఖాళీగానే ఉండడం గమనార్హం.



అన్నా యూనివర్సిటీ

కావేరి ఎక్స్‌ప్రెస్‌లో కుళ్లిపోయిన యువకుడి మృతదేహం

అన్నానగర్: బేసిన్ బ్రిడ్జ్ రైల్వే యార్డులో శనివారం రాత్రి గంగా కావేరి ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపి ఉంచారు. ఆ సమయంలో అప్పుడు బుక్ చేయని బోగీలో నుంచి దుర్వాసన రావడంలో సిబ్బంది వెళ్లి పరిశీలించారు. అక్కడ కుళ్లిపోయిన స్థితిలో ఓ యువకుడి మృతదేహం కనిపించింది. దీంతో రైల్వే ఉద్యోగులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. మృతుడి దగ్గర సెల్‌ఫోన్, బ్యాగ్ లేదు. వారణాసి నుంచి చెన్నైకి బుకింగ్ చేసుకున్న టికెట్ మాత్రమే ఉంది. 15వ తేదీన వారణాసి నుంచి చెన్నైకి రైలులో ప్రయాణిస్తుండగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఈనేపథ్యంలో పోలీసులు మృతుడి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

టీచర్ల రేషనలైజేషన్‌కు 30న కౌన్సెలింగ్

తిరువొత్తియూరు: ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న అదనపు ఉపాధ్యాయులను రేషనలైజేషన్ చేసేందుకు ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లా ముఖ్య విద్య అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అందులోని వివరాలు.. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో ఎక్సెస్‌గా ఉన్న ఉపాధ్యాయులను అదే చోట పని చేయించడం వల్ల ప్రభుత్వానికి ఆర్థిక నష్టం ఏర్పడుతోంది. దీన్ని నివారించడానికి ఈ వ్యవహారంలో చెన్నై హైకోర్టు ఇచ్చిన సూచనలను దృష్టిలో ఉంచుకొని గత 2023- 2024వ సంవత్సరం ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయులను అవసరమున్న చోటకు బదిలీ చేయాలని నిర్ణయించాం. ఈ క్రమంలో జిల్లా ముఖ్య విద్యాధికారులు అవసరం ఉన్న ఖాళీలను గుర్తించి ఉపాధ్యాయులను ఆ స్థానంలో నియమించాల్సి ఉంది. కాగా ఈ ఏడాది ఫిబ్రవరి 14వ తేదీలోపు ఈ వివరాలను అందజేయాలని జిల్లా ముఖ్య విద్య కార్యాలయాలకు సర్కులర్ జారీ చేశారు. ఈ క్రమంలో 2023 – 24 విద్యా సంవత్సరం పూర్తయిన క్రమంలో మే 31వ తేదీతో విశ్రాంతి పొందే ఉపాధ్యాయులను దృష్టిలో ఉంచుకొని 31-5-24వ తేదీ తర్వాత ఏర్పడే జాబితా ప్రకారం ఖాళీలను గుర్తించి అదనపు ఉపాధ్యాయులను నిర్ణయించేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో అదనపు ఉపాధ్యాయులను అవసరమున్న చోట నియమించేందుకు 30వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహించాలి అని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి..

మూడు షిఫ్ట్‌ల్లో విధులు

- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

కొరుక్కుపేట: ప్రభుత్వ వైద్య కాలేజీలు, ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే నర్సులు, సిబ్బందికి మూడు షిఫ్టుల పద్ధతిలో పని గంటలను కేటాయిస్తూ తమిళనాడు ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. వైద్య, ప్రజా సంక్షేమ శాఖ పరిధిలో మొదటి షిఫ్టు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రెండో షిఫ్టు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 వరకు, మూడో షిఫ్టు రాత్రి 8 నుంచి ఉదయం 6 వరకు ఉంటుందని పేర్కొంది. హైకోర్టు మదురై బెంచ్ ఆదేశాల మేరకు షిఫ్ట్ పని గంటలు ప్రాథమిక ప్రాతిపదికన కేటాయించనున్నట్లు వెల్లడించారు. దీని ప్రకారం, పబ్లిక్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న నర్సింగ్ అసిస్టెంట్ గ్రేడ్- 2 హాస్పిటల్ సిబ్బంది, క్లీనర్లు ఉద్యోగులు షిఫ్ట్ పద్ధతిలో పని చేస్తారు. ఈ ఉత్తర్వుల ప్రకారం మొదటి షిఫ్టులో 50 శాతం, మిగతా రెండు షిఫ్టుల్లో 25 శాతం చొప్పున సిబ్బంది రొటేషన్ పద్ధతిలో విధులు నిర్వహిస్తారని పేర్కొంది.

మరో పరీక్షకు సిద్ధంగా లేం!

- పన్నీరు మళ్లీ నో ఛాన్స్
- ఆర్‌బీ ఉదయకుమార్ స్పష్టీకరణ

సాక్షి, చెన్నై: మరో విషమ పరీక్షకు అన్నాడీఎంకే సిద్ధంగా లేదని ఆ పార్టీ శాసన సభాపక్ష ఉపనేత ఆర్‌బీ ఉదయకుమార్ పేర్కొన్నారు. పన్నీరు సెల్వంకు మళ్లీ అన్నాడీఎంకేలో చోటు లేదని స్పష్టం చేశారు. వివరాలు.. అన్నాడీఎంకేలో పరిణామాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పళనిస్వామి చేతిలో ఉన్న ఆ పార్టీని కైవసం చేసుకునేందుకు మాజీ సీఎం పన్నీరు సెల్వం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. మూడు సార్లు సీఎంగా పనిచేసిన ఆయనకు లోక్‌సభ ఎన్నికల సమయంలో తీవ్ర భంగపాటు తప్పలేదు. బీజేపీ కూటమికి జై కొట్టినా, ఆ పార్టీ వర్గాల నుంచి ఆశించిన మేరకు పన్నీరు సెల్వానికి ప్రోత్సాహం లేకుండా పోయింది. చిన్న పార్టీలకు సైతం రెండు మూడు సీట్లను కేటాయించిన బీజేపీ, పన్నీరుకు రామనాథపురం సీటును మాత్రమే అప్పగించింది. ఇక్కడ స్వయంగా పన్నీరు సెల్వమే స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో పన్నీరు శిబిరంలోని నేతలందరూ ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా రెండు మూడు రోజులుగా సామాజిక మాధ్యమాలలో సమాచారం చక్కర్లు కొడుతోంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అన్నాడీఎంకే కూటమికే కాకుండా బీజేపీ కూటమికి సైతం రాష్ట్రంలో నిరాశను మిగల్చబోతున్నట్టు, ఈ సమయాన్ని అస్త్రంగా చేసుకుని మళ్లీ గతంలో లాగే పళనితో కలిసి పోయేందుకు వ్యూహ రచన చేస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. ఈ సమాచారంపై ఆర్‌బీ ఉదయకుమార్ ఆదివారం స్పందించారు. మదురైలో మీడియాతో ఆయన మాట్లాడుతూ పన్నీరుకు మళ్లీ ఛాన్సేలేదని స్పష్టం చేశారు.

పార్టీలో చీలికకు..

దివంగత అమ్మ జయలలిత మరణంతో పార్టీ చీలికకు పన్నీరు సెల్వం ప్రధాన కారుకుడు అని గుర్తు చేశారు. అమ్మ ప్రభుత్వాన్ని కూల్చేందుకు అసెంబ్లీలో డీఎంకేతో కలిసి తీవ్ర కుట్రల చేశాడని మండిపడ్డారు. అయినా, పళని స్వామి అన్నింటినీ క్షమించి ఆయన్ని మళ్లీ పార్టీలోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. పార్టీలో ప్రధాన కార్యదర్శి హోదా కలిగిన కన్వీనర్ పదవిని, ప్రభుత్వంలో సీఎంతో సమానంగా డిప్యూటీ సీఎం పదవీ కట్టబెట్టారని వివరించారు. అయినా, పన్నీరు సెల్వంలో చాప కింద నీరులా పార్టీకి వ్యతిరేకంగానే వ్యవహరిస్తూ వచ్చారని ఆరోపించారు. పార్టీ నిర్ణయాలను వ్యతిరేకించడం లేదా మౌనం వహించడం వంటి చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. 2019 లోక్ సభ ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల ఓటమి, 2021లో అధికారం దూరం కావడానికి పన్నీరు కుట్రలు ఉన్నాయని ఆరోపించారు. ఆయన సొంత జిల్లాలోనే ఎన్ని సీట్లు వచ్చాయో ఓ సారి గుర్తు చేసుకోవాలని సూచించారు. మూడు సార్లు సీఎంగా పనిచేసిన పన్నీరు సెల్వం అమ్మలాంటి అన్నాడీఎంకే పార్టీ సిద్ధాంతాలను వ్యతిరేకించారని, పార్టీ నిర్వీర్యానికి కుట్రలు చేశారని ధ్వజమెత్తారు. ఇలాంటి వ్యక్తి మళ్లీ అన్నాడీఎంకేలో చోటు లేదని స్పష్టంచేశారు. ఆయన్ని పార్టీలోకి చేర్చుకుని మరో మారు విషమ పరీక్షకు అన్నాడీఎంకే సిద్ధంగా లేదన్నారు. ఆయన్ని పార్టీలోకి తీసుకునేందుకు ఏ ఒక్క నేత అంగీకరించరని స్పష్టం చేశారు.



ఆర్‌బీ ఉదయకుమార్

కల్పక్కం అణు విద్యుత్ కేంద్రంలో సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య

కొరుక్కుపేట: కల్పక్కంలోని అణువిద్యుత్ కేంద్రంలో పని ముగించుకుని బస్సులో ఇంటికి తిరిగి వస్తుండగా సెంట్రల్ ఇండస్ట్రియల్ డిఫెన్స్ ఫోర్స్‌కు చెందిన ఓ సైనికుడు తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు.. రవికిరణ్ (37) రాయచూరులోని మన్విల్ ప్రాంతానికి చెందినవాడు. కల్పక్కం న్యూక్లియర్ పవర్ ప్లాంట్ ఉద్యోగి ఆశ్రయంలో ఉంటూ అక్కడి ఇందిరాగాంధీ న్యూక్లియర్ రీసెర్చ్ సెంటర్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే డ్యూటీకి వెళ్లారు. పనులు ముగించుకుని ఆదివారం ఉదయం రవికిరణ్ తన సహోద్యోగులతో కలిసి కాంట్రాక్ట్ బస్సులో తన నివాసానికి బయలుదేరాడు. కాగా, రవికిరణ్ అనే డిఫెన్స్ ఫోర్స్ జవాను తన ఇన్‌సాట్జ్ 68 రైఫిల్‌తో సీటుపై కూర్చుని కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రక్తపు మడుగులో పడి ఉన్న సెక్యూరిటీ గార్డు రవికిరణ్‌ను సహచరులు గుర్తించి అదే బస్సులో అణువిద్యుత్ కేంద్రం ఆసుపత్రికి తరలించారు. అక్కడ తనను పరీక్షించిన వైద్యులు రవికిరణ్ అప్పటికే మృతి చెందినట్లు స్పష్టం చేశాడు. చతురంగపట్నం పోలీసులు రవికిరణ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం చెంగల్‌పట్టు ప్రభుత్వ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

తాళం వేసి ఉన్న ఇంట్లో మృతదేహం

తిరువొత్తియూరు: సింగపెరుమాళ్ ఆలయ ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో వ్యక్తి మృతదేహం ఉండడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వివరాలు.. చెంగల్పట్టు జిల్లాకు చెందిన కన్నన్ (45) సింగపెరుమాళ్ ఆలయ ప్రాంతంలోని శ్రీవారి నగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ మహేంద్ర సిటీ ప్రాంతంలోని ఓ దుకాణంలో పని చేస్తున్నాడు. ఇతను రోజూ మద్యం మత్తులో ఇంటికి వస్తున్నట్లు తెలిసింది. ఈనెల 15వ తేదీ రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చాడు. అయితే అప్పటి నుంచి రెండు రోజులుగా కన్నన్ ఎవరికీ కనిపించలేదు. అనుమానం వచ్చిన ఇంటి యజమాని కన్నన్ ఉన్న ఇంటి వద్దకు వెళ్లి చూడగా లోపల గడియ పెట్టి ఉంది. ఎంత తట్టినా తలుపులు తెరుచుకోకపోవడంతో అనుమానంతో కిటికీలోంచి లోపలికి చూడగా రక్తపు మడుగులో మృతదేహం కనిపించింది. మరైమలైనగర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి కన్నన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డోర్ లోపలి నుంచి గడియ వేసి ఉండడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారి హత్య

అన్నానగర్: మదురైలోని సమ్మతిపురానికి చెందిన గోపాల్ (60) పరవై కూరగాయల మార్కెట్‌లోని టీ బ్లాక్‌లో నాలుగవ స్టాల్‌లో క్యాబేజీ విక్రయిస్తుండేవాడు. సాయంత్రం ఇంటి నుంచి దుకాణానికి వెళ్లి వ్యాపారం ముగించుకుని మరుసటిరోజు ఉదయం ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున పరవై మార్కెట్‌కు వచ్చిన ఓ ముఠా దుకాణంలో ఉన్న గోపాల్‌పై కత్తితో దాడి చేశాయి. గోపాల్ తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ముఠా సభ్యులు పారిపోయింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. తొలి దశలోనే వీసా డబ్బులు చెల్లించే విషయంలో తలెత్తిన వివాదంలో హత్య జరిగి వుండవచ్చునని తేలింది. ఆ ప్రాంతంలోని సీసీటీవీ కెమెరాలో నమోదైన దృశ్యాల ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోలాహలం..
అంకాళపరమేశ్వరి మహాకుంభాభిషేకం


గోపుర కలశానికి పుణ్యతీర్థాలతో మహాకుంభాభిషేకం చేస్తున్న వేదపండితులు


హాజరైన భక్తజనం

పళ్లిపట్టు: అంకాళపరమేశ్వరి ఆలయ మహాకుంభాభిషేకం ఆదివారం కోలాహలంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పళ్లిపట్టు సమీపం రామచంద్రాపురంలోని పురాతన అంకాళపరమేశ్వరి ఆలయం మహాకుంభాభిషేకం నిర్వహించి 12 సంవత్సరాలు పూర్తికావడంతో ఆలయ నిర్వాహకులు, గ్రామీణులు విరాళాలు సేకరించి ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేశారు. గోపురం ఆలయ సన్నిధిని రంగులతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. దీంతో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు మహాకుంభాభిషేకం సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో యాగశాలలు ఏర్పాటు చేసి నిత్య హోమపూజలు చేశారు. ఆదివారం ఉదయం మహాపూర్ణాహుతి హోమపూజలు అనంతరం మంగళవాయిద్యాలతో పుణ్యతీర్థాల కలశాలు బయల్దేరి గోపుర కలశానికి మహాకుంభాభిషేకం నిర్వహించారు.

తిరువళ్లూరు- పూండి జంక్షన్‌లో ఆటోమెటిక్ సిగ్నల్


పూండి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన రిఫ్లెక్ట్ బోర్డులు

తిరువళ్లూరు: తిరువళ్లూరు- పూండి జంక్షన్‌లోని ఇంటర్ చేంజ్ వద్ద ప్రమాదాలను నివారించడానికి ఫ్లాషింగ్, ఆటోమేటిక్ సిగ్నల్ బోర్డులను పోలీసులు ఏర్పాటు చేశారు. వివరాలు.. తిరువళ్లూరు-ఊత్తుకోట రహదారిపై పుల్లరంబాక్కం, పూండి, మోవూరు, సదురంగపేట, సీతంజేరితో పాటు 20 గ్రామాలు ఉన్నాయి. ఈ మార్గంలో పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ప్రైవేటు బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వారంతపు, ప్రభుత్వ సెలవు దినాల్లో చాలా మంది కుటుంబ సమేతంగా పూండి రిజర్వాయర్ సందర్శనకు వస్తుంటారు. కాగా పూండి రిజర్వాయర్‌ను చేరుకోవడానికి తిరువళ్లూరు నుంచి సుమారు ఆరు కిలోమీటర్‌ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. రోడ్డుకు ఎడమవైపున పూండి, కుడివైపున నైవేలీ గ్రామానికి వెళ్లేదారులు ఉన్నాయి. ఇదే నాలుగు రోడ్ల కూడలి. ఇక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పూండి జంక్షన్ వద్ద ప్రమాదాలు జరగకుండా పోలీసులు రాత్రి సమయంలో వాహనదారులను అలర్ట్ చేసే ఇల్యూమినేట్, ఆటోమెటిక్ సిగ్నల్, రిఫ్లెక్ట్ బోర్డులను ఏర్పాటు చేశారు. తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

లంచం తీసుకున్న కేసులో ఎస్ఐ సస్పెన్షన్

కొరుక్కుపేట: లంచం తీసుకుంటూ పట్టుబడిన స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐని సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఆదేశించారు. వివరాలు.. రామనాథపురం మండలం తొండి సమీపంలోని పెరుమానేండాల్‌కు చెందిన వేల్ మురుగన్ (42)కు మినీ వ్యాన్ ఉంది. బంధువులతో విభేదాలపై దొండి పోలీసు స్టేషన్‌లో వేల్ మురుగన్‌పై కేసు నమోదైంది. ఈ కేసులో బెయిల్ పై విడుదల చేసేందుకు ఎస్ఐ రామకృష్ణన్ (55) రూ. 3000 లంచం అడిగారు. చివరికి రూ.2000 ఇస్తానని వేల్ మురుగన్ ఒప్పుకున్నాడు. ఈక్రమంలో వేల్ మురుగన్ రామనాథపురం అవినీతి నిరోధక పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. అవినీతి నిరోధక అధికారులు సలహా మేరకు కెమికల్ పూసిన నోట్లు ఇవ్వాలని సూచించారు. దీంతో రూ.2 వేలు కరెన్సీ నోట్లను సేకరించి పాత బస్టాండ్ సమీపంలోని బేకరీలో ఉంచి ఎస్ఐ శ్రీరామకృష్ణన్‌కు ఇచ్చాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న అవినీతి నిరోదక శాఖ పోలీసులు రామకృష్ణను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. దీంతో ఎస్ఐ రామకృష్ణను ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మల్టీపుల్ స్కెలరోసిస్‌పై విస్తృత అవగాహన అవశ్యం


సదస్సులో వైద్యులు

సాక్షి, చెన్నై: మెదడు, వెన్నుపూస, ఆప్టిక్ నరాల మీద ప్రభావం చూపించే మల్టీపుల్ స్కెలరోసిస్ వ్యాధిపై ప్రజలలో అవగాహన విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని వైద్యనిపుణులు వ్యాఖ్యానించారు. మల్టీపుల్ స్కెలరోసిస్ సొసైటీ ఆఫ్ ఇండియా నేతృత్వంలో 15వ ఎంఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'మె ఎంఎస్ డయాగ్నోసిస్' పేరిట ఆదివారం స్థానికంగా సదస్సు జరిగింది. ఇందులో మురుగప్ప గ్రూఫ్ ఎండీ మురుగప్పన్, ఐఐటీ బ్రెయిన్ సెంటర్ హెడ్ డాక్టర్ మోహన శంకర్ శివప్రకాశం, అప్తాల్మాలజిస్టు డాక్టర్ రష్మీన్ గాంధీ, ఎంఎస్ఎస్ఐ కార్యదర్శి అన్ గోన్సల్వేజ్‌లతో పాటు వైద్యనిపుణులు పాల్గొన్నారు. ఇది అరుదైన వ్యాధి అని న్యూరో డీజెనరేటివ్ డిజార్డర్, మెదడు, వెన్నుపూస, ఆప్టిక్ నరాల మీద తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నట్టు సదస్సులో వైద్య నిపుణులు వ్యాఖ్యానించారు. 14 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన వారిపై ఈ వ్యాధి ప్రభావం ఉందని పేర్కొన్నారు. ఎంఎస్ఐ - చెన్నై అధ్యయనం మేరకు ఈ వ్యాధితో బాధ పడుతున్న వారికి సాయం అందించడం , జీవన నాణ్యతను మెరుగు పరచడం అవశ్యం అని వివరించారు. ఈ వ్యాధిపై గ్రామీణ ప్రజలలో అవగాహనను విస్తృతం చేయాల్సిన అవశ్యం ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

నకిలీ పత్రాలు సృష్టించి భూ విక్రయం


విజయకుమార్

తిరువళ్లూరు: నకిలీ పత్రాలు సృష్టించి ప్రైవేట్ వ్యక్తికి చెందిన భూమిని మరో వ్యక్తికి విక్రయించిన వ్యవహారంలో బ్రోకర్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చెంగల్‌పట్టు జిల్లా విలంబూరు గ్రామానికి చెందిన ఖలీల్ కుమారుడు ఇబ్రహీమ్(76). ఇతను తిరువళ్లూరు జిల్లా కొరట్టూరు శ్రీబాలజీ నగర్‌లో రూ.90 లక్షలు విలువ చేసే 2,420 చదరపు అడుగుల భూమిని 1981వ సంవత్సరంలో అదే ప్రాంతానికి చెందిన రాఘవనాయక్కర్ నుంచి కొనుగోలు చేశాడు. ప్రస్తుతం సంబంధిత భూమి ఇబ్రహీమ్ ఆతడి భార్య సలీమా పేరిట వుంది. ఈ క్రమంలో సంబందిత భూ యజమాని ఇబ్రహీమ్, సలీమా మృతిచెందినట్టు నకిలీ డెత్ సర్టిఫికెట్‌తో పాటు ఇతర డాక్యుమెంట్‌లను సృష్టించిన ప్రకాష్, విజయకుమార్ నుంచి నలుగురు వ్యక్తులు విక్రయించారు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న బాధితులు ఆవడి పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని ఇన్‌స్పెక్టర్ జయశంకర్‌ను కమిషనర్ ఆదేశించారు. విచారణలో నకిలీ పత్రాలు సృష్టించి భూమిని విక్రయించిన ప్రకాష్, విజయకుమార్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి గాలిస్తున్నారు. ఇందులో భాగంగానే మధ్యవర్తి విజయకుమార్‌ను అరెస్టు చేశారు.

తిరుత్తణిలో భక్తుల సందడి


తిరుత్తణి కొండ ఆలయంలో భక్తజనం


అలంకరణలో ఉత్సవమూర్తి

తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శుభముహూర్తం సందర్భంగా కొండ ఆలయంలో 50కు పైగా వివాహాలు జరిగాయి. ఇందులో పాల్గొనేందుకు వచ్చిన వారితో పాటు భక్తులు సైతం స్వామి దర్శనానికి పెద్ద ఎత్తున కొండ ఆలయంలో పోటెత్తారు. దీంతో మాడ వీధులు భక్తజనంతో నిండిపోయాయి. మూడు గంటల పాటు క్యూలో భక్తులు వేచివుండి స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 50 వేలకు పైగా భక్తులు స్వామి దర్శనం చేసుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఉన్నతాశయాలతో ముందుకుసాగండి



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

కొరుక్కుపేట: ఉన్నతమైన ఆశయాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు భారత ప్రభుత్వ ఎర్త్ సైన్స్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎం రవిచంద్రన్ సూచించారు. చెన్నైలోని సెయింట్ జోసెఫ్స్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ 25వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. చెన్నైలోని సెయింట్ జోసెప్స్ ఆడిటోరియం వేదికగా జరిగిన కార్యక్రమానికి ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ బాబు మనోహరన్ అధ్యక్షతన వహించగా అతిథిగా డాక్టర్ ఎం రవిచంద్రన్ చేతులమీదుగా 1,299 విద్యార్థులకు డిగ్రీపట్టాలను ప్రదానం చేశారు. యూనివర్సిటీ ర్యాంకులు సాధించిన 29 మందికి సర్టిఫికెట్లు, షీల్డ్‌లతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శేషగిరిరావు, డైరెక్టర్ బి.శశి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జెస్సీ ప్రియ పాల్గొన్నారు.

స్టార్ తరువాత మాస్క్

తమిళసినిమా: యువ నటుడు కవిన్ వరుసగా చిత్రాలు చేసుకుంటూ పోతున్నారు. ఈయన కథానాయకుడిగా నటించిన స్టార్ చిత్రం ఇటీవల విడుదలై సక్సెస్‌ఫుల్‌గా ప్రదర్శింపబడుతోంది. తాజాగా మరో చిత్రానికి సిద్ధమైపోయారు. కవిన్ కథానాయకుడుగా నటిస్తున్న నూతన చిత్రానికి మాస్క్ అనే టైటిల్ నిర్ణయించారు. దర్శకుడు వెట్రిమారన్‌కు చెందిన గ్రాస్ రూట్ ఫిలిం కంపెనీ, బ్లాక్ మెడ్రాస్ ఫిలిమ్స్ సంస్థలు కలిసి నిర్మిస్తున్నాయి. దర్శకుడు వెట్రిమారన్ ఇంతకుముందు తన గ్రాస్ రూట్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై కాక్క ముట్టై, విచారణ్, కోడి, వడచెన్నై వంటి పలు సక్సెస్‌ఫుల్ చిత్రాలను నిర్మించారన్నది గమనార్హం. నటి ఆండ్రియా నాయకిగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా విక్రమన్ అశోక్ దర్శకుడుగా పరిచయం అవుతున్నారు. వెట్రిమారన్ శిష్యుడైన ఈయన ఇంతకుముందు తరుమి అనే షార్ట్ ఫిలింను తెరకెక్కించి బిహైండ్‌వుడ్ ఉత్తమ దర్శకుడు అవార్డును గెలుచుకున్నారు అన్నది గమనార్హం. కాగా చార్లీ, రుహాని శర్మ, బాలశరవణన్, వీజే అర్చన ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతాన్ని ఆర్డి రాజశేఖర్ చాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్రం ఇటీవల పూజాకార్యక్రమాలతో ప్రారంభమైంది. అయితే చిత్ర షూటింగును ఈ నెలాఖరు నుంచి చెన్నైలో నిర్వహించనున్నట్లు యూనిట్ వర్గాలు పేర్కొన్నారు.


మాస్క్ చిత్ర యూనిట్

కోలీవుడ్ టాక్స్

ఆయన నుంచి చాలా నేర్చుకున్నా!


వెపన్ చిత్ర ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణలో చిత్ర యూనిట్

తమిళసినిమా: మిలియన్ స్టూడియో ప్రొడక్షన్స్ పతాకంపై ఎంఎస్ మన్సూర్ నిర్మించిన చిత్రం వెపన్. గుహన్ చెన్నియప్పల్ దర్శకత్వం వహించిన ఇందులో సత్యరాజ్, వసంత రవి ప్రధాన పాత్రలు పోషించారు. నటి తాన్యా హోప్ నాయకిగా నటించిన ఇందులో మైమ్ గోపి ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెలలోనే తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా అన్నానగర్‌లోని పీవీఆర్ థియేటర్లో చిత్ర ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్ వి.ఉదయకుమార్, ఎళిల్, అశ్విన్, కార్తీక్ యోగి, నిర్మాత ధనుంజయన్ పాల్గొని ఆడియోను ఆవిష్కరించారు. నటుడు వసంత రవి మాట్లాడుతూ తమిలంలో సూపర్ హ్యూమన్ కథా చిత్రాలను తెరకెక్కించడం సాధారణ విషయం కాదన్నారు. దీన్ని దర్శకుడు మోహన్ ఎంతో ఇష్టపడి చేశారన్నారు. రాఖీ చిత్రంలో దర్శకుడు భారతీరాజాతో కలిసి నటించి చాలా నేర్చుకున్నానని, ఆ తర్వాత జైలర్ చిత్రంలో రజనీతో కలిసి నటించి ఆయన నుంచి చాలా నేర్చుకున్నానని చెప్పారు. ఇప్పుడు సత్యరాజ్‌తో కలిసి నటించడం మరిచిపోలేని అనుభవమని పేర్కొన్నారు. సత్యరాజ్ మాట్లాడుతూ తెరపై కంటే రియల్‌గా వీరత్వాన్ని చూపే వారే సూపర్ హీరో అని అన్నారు. ఈ చిత్రానికి నిర్మాత మన్సూర్, దర్శకుడు మోహన్‌లే హీరోలని పేర్కొన్నారు. కట్టప్ప పాత్రలా ఈ చిత్రంలో తన పాత్ర పది కాలాలపాటు గుర్తుండిపోతుందనే అభిప్రాయాన్ని సత్యరాజ్ వ్యక్తం చేశారు.

శివకార్తికేయన్‌తో
రష్మిక రొమాన్స్?


రష్మిక మందన్న

తమిళసినిమా: ఎవరైనా పరిగెత్తే గుర్రాలపై పందెం కడతారు. అలా చిత్ర పరిశ్రమంలో సక్సెస్‌పై స్వారీ చేస్తున్న నటి రష్మిక మందన్న కన్నడంలో కిరాక్ పార్టీ అని చిన్న చిత్రంతో తన నట జీవితాన్ని ప్రారంభించిన ఈ శాండిల్ బ్యూటీ ఇప్పుడు నేషనల్ క్రష్‌గా మారిన విషయం తెలిసిందే. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ప్రముఖ నటుల సరసన నటిస్తూ క్రేజీ కథానాయకిగా రాణిస్తున్నారు. చేతినిండా చిత్రాలు ఉన్నా మరిన్ని అవకాశాలు ఈమె వైపే చూస్తుండడం విశేషం. తెలుగులో అల్లుఅర్జున్ సరసన నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం త్వరలో తెరపై రావడానికి ముస్తాబవుతోంది. ప్రస్తుతం గర్ల్ ఫ్రెండ్, రెయిన్‌బో, కుబేర చిత్రాల్లో నటిస్తున్నారు. హిందీలో సల్మాన్‌ఖాన్ నటించడానికి సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే విధంగా తెలుగులోనూ విజయ్‌దేవరకొండతో మరోసారి కొత్త చిత్రంలో రొమాన్స్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు తాజాసమాచారం. లేకపోతే తమిళంలో ఈమె నటించిన రెండు చిత్రాలు ఆశించిన విజయాలను సాధించలేదు. దీంతో ఇక్కడ ఎలాగైనా హిట్ కొట్టాలన్న కసితో ఉన్న రష్మిక మందన్నకు అవకాశాలు తలుపు తడుతున్నాయి. అలా త్వరలో సూర్యకు జంటగా నటించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా తాజాగా మరో అవకాశం ఎదురుచూస్తున్నట్లు తెలిసింది. శివకార్తికేయన్ కథానాయకుడిగా నటించనున్న నూతన చిత్రంలో రష్మికను నాయికగా ఎంపిక చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తాజా సమాచారం. శివకార్తికేయన్ ప్రస్తుతం కమలహాసన్ నిర్మిస్తున్న అమరన్ చిత్రాలు పూర్తి చేసి ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో నటిస్తున్నారు. ఈయన ఇంతకు ముందు నటించిన సూపర్ హిట్ చిత్రం డాన్. ఆ చిత్రం ద్వారా సిబి చక్రవర్తి దర్శకుడుగా పరిచయం అయ్యారు. ఆ తర్వాత ఆయన రజనీకాంత్‌కు కథను సిద్ధం చేశారు. ఆ చిత్రంలో రజనీకాంత్ నటిస్తారని ప్రచారం జరిగినా, అది తెర రూపం దాల్చలేదు. ఆ తర్వాత టాలీవుడ్ నానీకి కథను చెప్పారు అది వర్కౌట్ కాలేదు. దీంతో సిబి చక్రవర్తి తన తొలి చిత్ర కథానాయకుడు శివకార్తికేయన్ తోనే మరో చిత్రం చేయడానికి సిద్ధమైనట్లు సమాచారం.

ఆ లక్కీచాన్స్
ఎవరిదో?


విజయ్


అపర్ణ బాలమురళి

తమిళసినిమా: విజయ్ పేరు వింటేనే బాక్సాఫీస్ మారు మోగుతుంది. బయ్యర్ల గల్లాపెట్టెలు కళకళలాడతాయి. అందుకే ఈయన చిత్రాలు జయాపజయాలకు అతీతం అంటారు ట్రేడ్ వర్గాలు. ఆయన నటించిన లియో చిత్రం మిశ్రమ స్పందనను తెచ్చుకున్నా బయ్యర్లను మాత్రం ఖుషీ చేసింది. ప్రస్తుతం విజయ్ గోట్ చిత్రంలో నటిస్తున్నారు. వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏజీఎస్ ఎంటర్‌టెయిన్‌మెంట్ సంస్థ నిర్మిస్తోంది. ఇది విజయ్ నటిస్తున్న 68వ చిత్రం. నటి మీనాక్షి చౌదరి నాయకిగా నటిస్తున్న ఇందులో స్నేహ, లైలా, ప్రశాంత్, ప్రభుదేవా, వైభవ్ ,ప్రేమ్‌జీ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. అదే విధంగా విజయకాంత్‌ను ఇందులో కీలక పాత్రలో గ్రాఫిక్స్‌లో చూపించబోతున్నట్లు సమాచారం. నటి త్రిష, శివకార్తికేయన్ కూడా అతిథిపాత్రలో మెరవబోతున్నట్లు టాక్ వైరల్ అవుతుంది. లేకపోతే విజయ్ తండ్రి కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్న గోట్ చిత్రం షూటింగును పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి విజయ్ డబ్బింగ్ కూడా 50 శాతం పూర్తి చేసినట్లు తాజా సమాచారం. లేకుంటే ఈ చిత్రం తర్వాత విజయ్ హెచ్ వినోద్ దర్శకత్వంలో నటించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇది విజయ్ నటించిన 69వ చిత్రం మాత్రమే కాకుండా ఇదే చివరి చిత్రం అనే ప్రచారం హోరెత్తుతోంది. కాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ లో కథానాయకిగా నటించేది ఎవరన్న విషయమే ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఇందులో కీర్తి సురేష్, సమంత నటిస్తారని ప్రచారం సామాజిక మాధ్యమాల్లో జోరుగా సాగుతోంది. పూజా హెగ్డే నటించే అవకాశం ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. తాజాగా మరో హీరోయిన్ పేరు కూడా తెరపైకి వచ్చింది ఆమెనే అపర్ణ బాలమురళి. అయితే వీరిలో ఎవరికి విజయ్ సరసన నటించే అదృష్టం లభిస్తుందన్నది త్వరలోనే తేలిపోతుంది. ఈ చిత్రాన్ని హెచ్ వినోద్ మాస్ ఎలిమెంట్స్ జోడించి పొలిటికల్ నేపథ్యంలో రూపొందిస్తున్నట్లు సమాచారం.

ఆ చిత్రం హిట్ కాకపోయినా పర్వాలేదు!


చిత్ర ఆడియో వేదికపై చిత్ర యూనిట్

తమిళసినిమా: నవ నిర్మాత శివ కిలారి షార్క్9 పిక్చర్స్ పతాకంపై నిర్మించిన చిత్రం పోగుమిడం వెగు దూరమిల్లై. మైఖేల్ కే రాజా దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో విమల్, మేరి రిక్కెస్ హీరో హీరోయిన్‌లుగా నటించారు. నటుడు కరుణాస్ ప్రధాన పాత్రను పోషించిన ఇందులో ఆరుగలం నరేన్, పవన్ దాస్, దీప శంకర్ వీరరామ్మూర్తి ముఖ్యపాత్రలు పోషించారు. రఘునందన్ సంగీతాన్ని, డెమిల్ సేవియర్ ఎడ్వర్డ్ చాయాగ్రహణం అందించిన ఈచిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం చిత్ర ఆడియో, ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. చిత్త షూటింగ్‌ను ప్రారంభించిన వారంలోనే కరోనా కారణంగా లాక్‌డౌన్ వచ్చిందని, అలా రెండేళ్లు గడించి పోయిందని చెప్పారు. ఈ చిత్ర నిర్మాత న్యూజిలాండ్‌లో నివశించే తెలుగు వారని చెప్పారు. అక్కడ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేశారన్నారు. ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే వైవిధ్య భరిత కథా చిత్రం అని చెప్పారు. నిర్మాత శివ కిలారి మాట్లాడుతూ తాను ఆ పది పదిహేను కథలు విని మంచి కథను ఎంపిక చేసి చిత్రాన్ని నిర్మిద్దాం అని భావించానన్నారు. అయితే మైఖెల్ కే.రాజా చెప్పిన కథ వినగానే నచ్చడంతో వెంటనే చేయాలని అనిపించిందన్నారు. తనకు ఈ చిత్రం విజయం సాధించక పోయినా మరో నాలుగైదు చిత్రాలు చేసి వాటిలో ఏ ఒక్కటి విజయవంతం అయిన డబ్బులు రాబట్టు కుంటానని, అయితే దర్శకుడు, ఇతర సాంకేతిక వర్గం కోసమైనా ఈ చిత్రం బాగా ఆడాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

సమ్మర్ ఫెస్ట్‌కు స్పందన

కొరుక్కుపేట: మ్యాజిక్ షో, టాటూ ఆర్ట్, ఫేస్ పెయింటింగ్‌లతో పాటు ఆహార ప్రియులను ఉర్రూతలూగించేందుకు రుచికరమైన వంటకాల శ్రేణిని కలిగిన సమ్మర్ ఫెస్ట్‌కు అనూహ్య స్పందన లభిస్తుందని సవేరా నిర్వాహకురాలు నీనారెడ్డి తెలిపారు. ఈమేరకు జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వేసవి కాలాన్ని ఎంజాయ్ చేసేలా 53 రకాల ఐటమ్స్‌తో సవేరాలోని పియానో రెస్టారెంట్‌లో సమ్మర్ ఫెస్ట్ నిర్వహించాలని అన్నారు. ఈనెల 31 వరకు కొనసాగుతున్న ఈ ఫెస్ట్‌లో లంచ్ అండ్ డిన్నర్‌గా రుచికరమైన ఆహార వంటకాలను సిద్ధం చేసి అందిస్తున్నామని వివరించారు. ఐదుగురు వస్తే ముగ్గురు మాత్రమే బిల్లు చెల్లించేలా, అలాగే ముగ్గురు వస్తే ఇద్దరికి బిల్లు చెల్లించేలా ఆఫర్ కల్పించినట్టు ఆమె వివరించారు.

ఇంజినీర్ ఆత్మహత్య

అన్నానగర్: తూత్తుకుడి సౌత్ ఎంబరర్ స్ట్రీట్‌కు చెందిన లూయిస్ మైఖేల్ జగదీశన్ (55). ఇతని కుమారుడు ఆంథోని అశ్విన్ (26) మెరైన్ ఇంజినీర్. గత 16వ తేదీన విధుల్లో భాగంగా ఇరాక్ వెళ్లాల్సి వచ్చింది. కానీ వాతావరణం అనుకూలించకపోవడంతో ఆ దేశానికి వెళ్లేందుకు తీసుకున్న ఫ్లైట్ టికెట్ క్యాన్సిల్ అయ్యింది. దీంతో మనస్తాపం చెంది ఆంథోని అశ్విన్ ఆదివారం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ తిని యువకుడి మృతి

తిరువళ్లూరు: వెయిట్ లిఫ్టింగ్‌పై ఆసక్తితో తరచూ చికెన్ తిన్న యువకుడు మృతిచెందాడు. తిరువళ్లూరు జిల్లా తొయుదావూర్ గ్రామానికి చెందిన తులక్కానం కుమారుడు విఘ్నేష్(28). ఇతను వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. శరీర ఆకృతిని పెంచడానికి కోడి గుడ్లు, కోడిమాంసం మాత్రమే గత ఆరు నెలల నుంచి తీసుకుంటున్నట్టు తెలిసింది. దీంతో గత 16న అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే బంధువులు తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అక్కడ వైద్యం అందించారు. ఆరోగ్యం కొంత కుదుటపడడంతో శనివారం ఇంటికి వెళ్లాడు. అనంతరం సమీపంలోని చర్చికి వెళ్లి ప్రార్థన నిర్వహిస్తుండగా కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు అరక్కోణంలోని సీఎంసీ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి..

తిరువళ్లూరు: అతిగా మద్యం తాగి మత్తులో ఇంట్లో నిద్రించిన వ్యక్తి రాత్రి పడకలోనే మృతి చెందాడు. తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు అగరం కండ్రిగ గ్రామానికి చెందిన జోసెఫ్ కుమారుడు రాజీ(50). ఇతడికి 2002వ సంవత్సరం మొదటి వివాహం జరిగింది. అయితే పిల్లలు లేకపోవడంతో అప్పటి నుంచే మద్యానికి బానిసయ్యాడు. భర్త మద్యానికి బానిస కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మొదటి భార్య అనారోగ్యానికి గురై మృతిచెందింది. అనంతరం అదే గ్రామానికి చెందిన షాలినీ అనే మహిళను ఆరేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. రెండవ భార్యకు కూడా సంతానం లేకపోవడంతో ఇరువురి మధ్య తరచూ గొడవలు జరగడంతో షాలిని పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెంది రాజీ శనివారం రాత్రి అతిగా మద్యం తాగి ఇంటికొచ్చి నిద్రించాడు. తెల్లారైనా నిద్రలేకపోవడంతో బంధువులు అనుమానం చెంది రాజీని నిద్ర లేపడానికి యత్నించారు. అయినా ఫలితం లేకపోవడంతో తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రాజీని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు.

ఆటోను బస్సు ఢీకొని ఇద్దరు..

వేలూరు: ఆటోను, ప్రభుత్వ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. తిరువణ్ణామలై జిల్లా పోలూరు సమీపంలోని కడలాడి గ్రామానికి చెందిన ఆజాన్ బాషా(27), ఇతని స్నేహితుడు అదే గ్రామానికి చెందిన వెట్రిసెల్వన్(26) ఇద్దరూ కలిసి తెల్లగడ్డల వ్యాపారం చేసేవారు. ఈక్రమంలో శనివారం రాత్రి 9 గంటల సమయంలో ఇద్దరూ కలిసి ఆటోలో తెల్లగడ్డల బస్తాలను ఎక్కించుకొని వేలూరు వైపునకు బయలుదేరారు. ఆటో పోలూరు బైపాస్ రోడ్డు వద్ద వెళుతుండగా వేలూరు నుంచి పోలూరు వైపునకు వెళుతున్న ప్రభుత్వ బస్సు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆజాత్ బాషా, వెట్రి సెల్వన్ మృతిచెందారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరువణ్ణామలై ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని ఐదు జింకలు మృతి



వేలూరు: రైలు ఢీకొని ఐదు జింకలు మృతిచెందిన సంఘటన రాణిపేట జిల్లా వాలాజ సమీపంలో చోటుచేసుకుంది. వాలాజ సమీపంలోని కొండ ప్రాంతం నుంచి జింకలు రైలు పట్టాలపైకి రావడంతో రైలు ఢీకొని ఐదు జింకలు పట్టాల పక్కన మృతి చెంది ఉండడంతో ప్రయాణికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందజేశారు. రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని జింకల కళేబరాలను అటవీశాఖ అధికారులకు అప్పగించి ఖననం చేయించారు.

రైల్వే స్టేషన్‌లో యువతుల సందడి

కొరుక్కుపేట: సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో రీల్స్ ద్వారా వీడియోలను విడుదల చేయడం ఈ రోజుల్లో ఫ్యాషన్‌గా మారింది. రీల్స్‌లో పోస్ట్ చేసిన వీక్షణల సంఖ్య, వీడియోల సంఖ్య ఫేస్‌బుక్‌లో, ఇన్‌స్టాగామ్‌లో పెరుగుతూనే ఉంది. తిరుచ్చిరైల్వే స్టేషన్‌లో ముగ్గురు యువతులు కురచ దుస్తులతో నృత్యం చేస్తూ సోషల్ మీడియాలో షేర్ చేశారు. యువతులు చేసినఈ నృత్యం ఇన్‌స్టాగామ్‌లో వైరల్ అవుతోంది. దీంతో తిరుచ్చి రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిఘా నేత్రం

- రైల్వేస్టేషన్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటు పనులు ముమ్మరం
- ప్రతి ప్రయాణికుడిపై నిఘా
- సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి పర్యవేక్షణ

తిరువళ్లూరు: రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలు, హత్యలు, చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచడమే ధ్యేయంగా అన్ని రైల్వేస్టేసన్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగానే తిరువళ్లూరు, సెవ్వాపేట, పుట్లూరు, హిందూ కళాశాల, ఆవడి తదితర రైల్వేస్టేషన్‌లో ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నారు. వివరాలు.. తిరువళ్లూరు, అరక్కోణం, తిరుత్తణి, తిరువేళాంగాడు, ఆవడి తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రయాణికులు నిత్యం రైళ్ల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. విద్యార్థులు, కార్మికులు ప్రభుత్వ ప్రైవేటు సంస్థలకు చెందిన ఉద్యోగులు, వ్యాపారులతో నిత్యం రైళ్లు రద్దీగా ఉంటాయి. తిరువళ్లూరు నుంచి చెన్నైకు, చెన్నై నుంచి తిరువళ్లూరు మీదుగా తిరుత్తణి, అరక్కోణం, కాట్పాడి, వేలూరు, తిరుపతితో పాటు ఇతర ప్రాంతాలకు రోజుకు సరాసరిన 250 పైగా రైలు సర్వీసులు తిరుగుతుంటాయి.

ప్రయాణికుల్లో అభద్రతాభావం

రైలులో ప్రయాణించే ప్రయాణికులు ముఖ్యంగా రాత్రి సమయాల్లో అభద్రత భావానికి లోనవుతున్నారు. రూట్ తల పేరిట కళాశాల విద్యార్థులు హంగామా చేస్తుండడం, కొందరు హిజ్రాల మితిమీరిన చేష్టలు, ప్రయాణికుల నుంచి చైన్, మొబైల్ ఫోన్, నగదు అపహరణ తదితర ఘటనలు రోజూ నిత్యకృత్యంగా మారుతున్నాయి. వీటితో పాటు రైల్వేస్టేషన్‌లో గంజాయి తదితర మత్తు పదార్థాల విక్రయం, ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేలా రైల్వేస్టేషన్‌లో మద్యం సేవించడం, ఇటీవల పుట్లూరు రైల్వేస్టేషన్‌లో వ్యక్తి దారుణ హత్య జరగడం కలకలం రేపింది. రైలు పట్టాలపై రాళ్లు, ఇనుపరాడ్‌లు పెట్టడం లాంటి కుట్రలు జరుగుతున్నాయి. గతంలో సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో రైలును హైజాక్ చేసి ప్రమాదానికి గురి చేయడం, తాంబరం వద్ద రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన స్వాతిహత్య చోటు చేసుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో సబర్బన్ రైల్వేస్టేషన్‌లలో సీసీ కెమెరాలను అమర్చాలని రైల్వేశాఖ ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది.



పుట్లూరు రైల్వేస్టేషన్

శరవేగంగా పనులు

ప్రభుత్వ అనుమతి రావడంతో సబర్బన్ రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సెవ్వాపేట, పుట్లూరు, తిరువళ్లూరు, హిందూ కళాశాల, ఆవడి, తిరునింద్రవూర్, నెమిలిచ్చేరి లాంటి స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌పై గుంతలు తీసి కేబుల్ అమరిక పనులను శరవేగంగా చేస్తున్నారు. కేబుల్ అమరిక పనులు పూర్తయిన తరువాత స్టేషన్ స్థాయిని బట్టి 8 నుంచి 16 సీసీ కెమెరాలను అమర్చే అవకాశం ఉందని రైలు ప్రయాణికుల సంఘం తిరువళ్లూరు జిల్లా కార్యదర్శి భాస్కర్ వివరించారు. ప్రస్తుతం తాంబరం, తిరువళ్లూరు మార్గంలో పనులు సాగుతున్నట్లు తెలిపారు. ఇవి పూర్తయిన తరువాత గుమ్మిడిపూండి మార్గంలో పనులు జరిగే అవకాశం ఉంది. కెమెరాలు అమర్చిన తరువాత సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు అనుసంధానం చేసి అక్కడి నుంచి పర్యవేక్షణ ఉంటుందన్నారు. తద్వారా రైల్వేస్టేషన్‌లో జరిగే నేరాలు, అసాంఘిక కార్యక్రమాలను సులభంగా కట్టడి చేయవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు పనులు పూర్తయితే ప్రయాణికుల్లో అభద్రతా భావం తొలగిపోయే అవకాశం ఉందని పుట్లూరు రైలు ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు రాఘవేంద్రభట్ అభిప్రాయపడ్డారు.

కారు ఢీకొని దంపతుల దుర్మరణం



వైద్యులతో మృతుల బంధువుల వాగ్వాదం

తిరుత్తణి: వివాహానికి వెళుతున్న దంపతులను మృత్యువు కారు రూపంలో కబలించింది. ఈ ఘటన తిరుత్తణిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు సంఘటన వివరాలు... ఆవడి గోవర్ధన్‌గిరి ప్రాంతానికి చెందిన మెయ్యయగన్(54) ప్రైవేట్ ఫ్యాక్టరీలకు కార్మికులను సరపరా చేసే ఏజెన్సీ నడుపుతున్నాడు. ఇతను, భార్య లక్ష్మి(45)తో కలిసి బైకులో తిరుత్తణి సమీపం పొదటూరుపేటలో బంధువుల ఇంట్లో వివాహానికి హాజరయ్యేందుకు ఆదివారం ఉదయం వెళ్లారు. తిరుత్తణి సమీపం కొత్త బైపాస్‌వద్ద కేజీ. కండ్రిగ నుంచి తిరువళ్లూరు వైపు వెళుతున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బైకును ఢీకొంది. ప్రమాదంలో బైకులో వెళుతున్న దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిద్దరిని తిరుత్తణి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మెయ్యయగన్ ప్రాణాలు కోల్పోగా, మూడు గంటల పాటు పోరాడి లక్ష్మి ప్రాణాలు విడిచింది. తీవ్ర గాయాలైన లక్ష్మికి వైద్యులు సకాలంలో వైద్య సేవలు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో ఆమె మృతిచెందిందని మృతుల బంధువులు వైద్యులతో వాగ్వాదానికి దిగారు. దీంతో సీఐ మదియరసన్, పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసకొచ్చారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కేజీ కండ్రిగ లైబ్రరీ వీధికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు ఇళంగో(28)ను పోలీసులు అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన దంపతులకు కార్తికేయన్ అనే కుమారుడు ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, మరో కుమారుడు గౌతమ్ ప్లస్–2 ఉత్తీర్ణత సాధించడం గమనార్హం.



మెయ్యయగన్, లక్ష్మి(ఫైల్)

ఆరగించిన ఆకులపై అంగప్రదక్షిణ



ఆకులపై అంగప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సేలం: ఆలయంలో అన్నప్రసాదాలు ఆరగించిన ఆకులపై భక్తులు అంగ ప్రదక్షిణ వేడుక కరూర్‌లో శనివారం నిర్వహించారు. కరూర్ సమీపంలోని నెరూర్‌లో ప్రసిద్ధి చెందిన ఆలయం ఉంది. ఇక్కడ అగ్రహారంలో ఉన్న సభలో ప్రతి ఏడాది వైకాశి శుద్ధ దశమి రోజు సదాశివ బ్రహ్మేంద్రాల్ ఆరాధనోత్సవం నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఈ ఏడాది 110వ వార్షికోత్సవాలు గత 12వ తేదీ ప్రారంభమయ్యాయి. ఇందులు ముఖ్యఘట్టమైన ఎంగిలి ఆకులపై అంగ ప్రదక్షిణ వేడుక శనివారం నిర్వహించారు. మధ్యాహ్నం అగ్రహారంలో భక్తులు అన్నప్రసాదాలు పెట్టారు. వారితో పాటు బ్రహ్మేంద్ర స్వామి వచ్చి ఆరగిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. భోజనాల అనంతరం మొక్కులు తీర్చుకునే భక్తులు స్నానం చేసి తడి దుస్తులతో ఆ ఆకులపై అంగప్రదక్షిణ చేశారు. తర్వాత వారికి ఆలయ పూజారి దీపహారతి చూపించి, పుణ్య తీర్థాన్ని వారిపై చల్లారు. ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా ఈ వేడుకకు గత 2015లో నిషేధం విధించారు. అయితే మదురై హైకోర్టు ఈ ఏడాది అనుమతి ఇచ్చింది. దీంతో ఎనిమిదేళ్ల తర్వాత శనివారం ఎంగిలి ఆకులపై అంగప్రదక్షిణ వేడుక నిర్వహించారు.

కనులపండువగా రథోత్సవం

తిరువొత్తియూరు: తిరునల్లారు దర్బారన్యేశ్వరర్ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం రథోత్సవం కనులపండువగా సాగింది. కారైకాల్ సమీపం తిరునల్లార్‌లో దర్బారణ్యేశ్వర ఆలయం ఉంది. ప్రాణాంబికై సమేత దర్బారణ్యేశ్వరస్వామి భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఈ ఆలయ శని దేవుడు ప్రత్యేక మందిరంతో పూజలందుకుంటున్నాడు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఆదివారం ఉదయం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి తెల్లవారుజామున వినాయకుడు, సుబ్రమణ్య స్వామి, షణ్బగ త్యాగరాజర్, నీలోత్పలాంబాళ్ సమేతంగా చండికేశ్వరర్ స్వామిని అలంకరించిన రథాలపై కొలువుదీర్చారు. పుదుచ్చేరి మంత్రి సాయి.జె.ఎమ్మెల్యే శివ రథాన్ని ముందుకు లాగి ప్రారంభించారు. ఈ ఉత్సవంలో భక్తులు పాల్గొని రథం లాగారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తేదీ రాత్రి శని భగవానుని బంగారు కాకి వాహనంపై ఊరేగింపు, మంగళవారం తెప్ప ఉత్సవం నిర్వహిస్తారు.

తిరుత్తణిలో జోరువాన



తిరుత్తణిలో కురుస్తున్న వర్షం



హాస్పిటల్ రోడ్డులో వర్షపు నీరు

తిరుత్తణి: తిరుత్తణిలో ఆదివారం అర్ధగంట పాటు కుమ్మరించిన వానకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ముఖ్యంగా పట్టణంలోని హాస్పిటల్ రోడ్డు, గాంధీ రోడ్డు, ఆర్ముగస్వామి ఆలయ వీధుల్లో వర్షపు నీటితో పాటు మురుగునీరు చేరడంతో హాస్పిటల్‌కు వెళ్లే రోగులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

ఉత్తర కావేరిలోకి చేరిన వర్షపు నీరు

వేలూరు: వేలూరు జిల్లా ఒడుగత్తూరు తాలుకాలో శనివారం రాత్రి భారీ వర్షాలు కురవడంతో ఉత్తర కావేరి నదిలో భారీగా వర్షపు నీరు చేరడంతో రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒడుగత్తూరు సమీపంలోని తీర్థం గ్రామం అనే ప్రాంతం నుంచి ఉత్తర కావేరి నది ప్రారంభమవుతుంది. ఈ నది ఒడుగత్తూరు, అగరంజేరి మార్గంలో 35 కిలోమీటర్లదూరం ప్రయాణం చేసి పల్లిగొండ వద్ద ఉన్న పాలారు నదిలో కలుస్తుంది. జవ్వాది కొండతో పాటు ఒడుగత్తూరు మేల్ అరసంబట్టు వంటి కొండ ప్రాంతాల్లో రాత్రి పూర్తిగా వర్షాలు కురవడంతో 50 మిమీల వర్షపాతం నమోదైంది. దీంతో కొండ ప్రాంతాల నుంచి వచ్చే చిన్న చిన్న కాలువల నుంచి ఉత్తర కావేరి నీరు అధిక సంఖ్యలో చేరడంతో వాగులు వంకలన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. ఒడుగత్తూరు చుట్టూ ఉన్న ప్రాంతాల్లోని వెయ్యి ఎకరాల వ్యవసాయ భూములకు ఉత్తర కావేరి నది నుంచి నీరు పారుదల ఉండడంతో ఈ ప్రాంతంలోని వ్యవసాయ బావులు, బోర్లు, కుంటల్లోనూ వర్షపు నీరు వస్తుందని రైతులు ఆశిస్తున్నారు.



ఉత్తర కావేరి నదిలో వర్షపు నీరు

కోలాహలం.. కపాలీశ్వర ఆలయ రథోత్సవం



పురవీధుల్లో రథం ఊరేగింపు

సేలం: ఈరోడ్‌లో కపాలీశ్వర ఆలయ రథోత్సవం ఆదివారం కనుల పండువగా సాగింది. ఈరోడ్ కోట ప్రాంతంలో కొలువున్న ఆరుద్ర కపాలీశ్వర ఆలయంలో వైకాసి విశాఖ ఉత్సవాలు 11వ తేదీన గణపతి హోమంతో ప్రారంభమయ్యాయి. అనంతరం ఆలయ ధ్వజారోహణం నిర్వహించారు. నాటి నుంచి రోజూ ఉదయం 8.30, సాయంత్రం 6.30 గంటలకు యాగశాలి పూజ జరిపారు. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఆదివారం ఉదయం జరిగింది. ఇందులో వరుణాంబిగై అమ్మవారిని, సోమస్కందర్ స్వామిని విశేషంగా అలంకరించి రథంపై అధిరోహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని తాడుతో లాగి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు ఈశ్వరన్ కోవిల్ వీధి, మణికూండు, పన్నీర్ సెల్వం పార్క్, కామరాజ్ వీధుల మీదుగా సాగి సాయంత్రం 4 గంటలకు రథం ఆలయ వేదికపైకి చేరుకుంది. ఈ రథంలో వరుణాంబికై అంబాల్, వినాయగర్, వల్లి, దేవసేన సమేత మురుగన్, చండికేశ్వరర్ సామి విహరించారు. ఇందులో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బిషప్ పదవికి నలుగురు ఎంపిక

కొరుక్కుపేట: సీఎస్ఐ చెన్నై ఆర్చ్ డియోసెస్ ఎన్నిక కీల్పాక్కంలోని లైట్స్ ఎరీనాలో జరిగింది. చెన్నై ఈచార్జ్ ఆర్చ్ బిషప్ శర్మ నిత్యానందం పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో ఆర్చ్ బిషప్ ఎంపిక జాబితా కోసం 20 మంది బిషప్‌లు పోటీపడ్డారు. ఆర్చ్ డియోసెసన్ కోశాధికారి, రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ శామ్యూల్ కార్నెలియస్ ఈ ఎన్నికను నిర్వహించారు. మొత్తం 650 మందికి పైగా బిషప్స్ ఆర్చ్ డియోసెస్ సభ్యులు ఓటు వేశారు. 3 రౌండ్‌లు జరిగిన ఈ ఎన్నికల్లో మొదటి రౌండ్‌లో బిషప్ పాల్ ఫ్రాన్సిస్ 403 ఓట్లతో ఆర్చ్ బిషప్ షార్ట్‌లిస్ట్‌కు ఎంపికయ్యారు. రెండవ రౌండ్లో యేసుదాస్, డేవిడ్సన్, మోహన్‌రాజ్‌లను బిషప్‌లుగా ఎన్నుకున్నారు. ఆర్చ్ బిషప్ షార్ట్ లిస్ట్‌కు నలుగురు బిషప్‌లను ఎంపిక చేసినట్లు ప్రకటించారు. అనంతరం ఆర్చ్ బిషప్ ఎంపిక జాబితాలో అగ్రస్థానంలో నిలిచిన బిషప్ పాల్ ఫ్రాన్సిస్‌ను బిషప్‌లు, సభ్యులు అందరూ అభినందించారు. కాగా చెన్నై ఆర్చ్ డియోసెస్‌కు గత ఏడు నెలలుగా ఆర్చ్ బిషప్ లేరు. దీంతో చెన్నై ఆర్చ్ డియోసెస్ పనులకు ఆటంకం ఏర్పడిన నేపథ్యంలో కొత్త ఆర్చ్‌బిషప్ ఎంపిక పనులు వేగంగా జరుగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

బైక్‌పై బస్సును వెంబడించిన యువకుడి మృతి

కొరుక్కుపేట: బస్సులో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను తిరిగి పొందేందుకు అతివేగంతో బైక్‌పై బస్సును వెంబడించిన యువకుడు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు.. కరూర్ జిల్లాలోని అరవ కురిచ్చి సమీపంలోని సుకంబట్టి గ్రామానికి చెందిన యువరాజ్ (30)ప్రస్తుతం తిరునేల్వేలి సమీపంలో ఉంటున్నాడు. బంధువుల ఇంట్లో ఉంటూ ఇంటి సామాన్లు విక్రయిస్తున్నాడు. అతనితో పాటు స్నేహితులు రాజగురు, రామరాజు, మారిముత్తు పనిచేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం యువరాజ్ ఆలయ ఉత్సవాలకు సుక్కం పట్టి వెళ్లిన తర్వాత శనివారం రాత్రి తిరునేల్వేలి వచ్చాడు. అక్కడ నుంచి తెల్లవారుజామున 2 గంటలకు తిరుచెందూరుకు బస్సులో వస్తుండగా బస్సులో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే తన మిత్రుడు రాజగురువు నుంచి బైక్ ను తీసుకుని తిరుచెందూరుకు బయలుదేరాడు. తిరుచెందూర్ బస్ స్టేషన్‌లో విచారించగా, మళ్లీ బస్సు ఆరుముగనేరి మీదుగా తిరునేల్వేలి వైపు వెళ్తోంది. ఎలాగైనా బస్సును పట్టుకునేందుకు చాలా వేగంగా వెళ్లాడు. ఈక్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడిన యువరాజ్‌ను స్థానికులు కాయల్‌పట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యువరాజ్ మృతి చెందాడు.

భక్తి చైతన్య సంబరం



గంగమ్మకు హారతి

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా ఆదివారం సాయంత్రం తిరునగరిలో చేపట్టిన గంగమ్మ భక్తి చైతన్య శోభాయాత్ర సంబరం అంబరాన్నంటింది. సంప్రదాయబద్ధంగా గంగ జాతరలో భక్తులు వేసే వేషాలను ఆవిష్కరిస్తూ ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన గంగమ్మ జాతరకు పూర్వవైభవం కల్పించాలనే సంకల్పంతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సారథ్యంలో భక్తి చైతన్య యాత్ర అంరంగవైభవంగా చేపట్టారు. అనంతవీధికి ఉన్న ప్రాశస్త్యాన్ని దృష్టిలో ఉంచుకొని అక్కడి నుంచి ఈ గంగమ్మ భక్తి చైతన్య యాత్రను చేపట్టారు. తిరుమలకు ముఖద్వారమైన అనంతవీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష యాత్రను ఆరంభించారు. యాత్రలో పాల్గొన్న వారందరికీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష గంధం, పసుపు, కుంకుమ పూస్తూ సందడి చేశారు. భక్తులు సైతం స్వయంగా గంధం బొట్టు పెట్టుకొని, వేపాకు కొమ్మలు చేతపట్టి జై గంగమతల్లి అంటూ నినాదాలు చేస్తూ భక్తి చైతన్య యాత్రలో కదం తొక్కుతూ అమ్మవారిపై తమ భక్తి విశ్వాసాలను చాటుకున్నారు. అనంత వీధి నుంచి ఆరంభమైన ఈ గంగమ్మ భక్తి చైతన్య యాత్ర రామచంద్ర పుష్కరిణి, మహతి కళాక్షేత్రం, టౌన్ క్లబ్, ప్రకాశం రోడ్డు, గాంధీరోడ్డు, బండ్ల వీధి,హెడ్ పోస్టాఫీస్ మీదుగా అమ్మవారి ఆలయం వరకు సాగింది. వారం రోజుల క్రితం నగరమంతటా ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలు సైతం భక్తి చైతన్య యాత్రలో ఊరేగింపుగా సాగాయి. యాత్ర ఆద్యంతం జానపద కళారూపాల ప్రదర్శనలు, జానపద, పౌరాణిక, చారిత్రక వేషాలు, కోలాటాలు, సన్నాయి మేళాలు, డప్పుల మోతల నడుమ కోలాహలంగా భక్తి చైతన్య యాత్ర సాగింది. యాత్రకు దారి పొడవునా భక్తులు హారతులు సమర్పిస్తూ, కొబ్బరి కాయలు కొడుతూ తమ భక్తిని చాటుకున్నారు. శోభాయాత్రలో సాగుతున్న అతిథులకు పూలమాలలు వేస్తూ పుష్పవర్షం కురిపించారు. గంగమ్మ భక్తి చైతన్య యాత్రలో పాల్గొన్న భక్తులకు, కళాబృందాలకు దారిపొడవునా మజ్జిగ, వాటర్ బాటిళ్లు అందించారు. ఆలయానికి చేరుకున్న భక్తి చైతన్య యాత్రకు అర్చకులు స్వాగతం పలికి ఆహ్వానించారు. అతిథులు అమ్మవారిని దర్శించుకోవడంతో గంగమ్మ భక్తి చైతన్య యాత్ర ముగిసింది.



భక్తి చైతన్య శోభాయాత్రలో భక్తజనం



శోభాయాత్రలో భూమన కరుణాకరరెడ్డి



కళాకారులతో ఎమ్మెల్యే భూమన



శోభాయాత్రలో అమ్మవారి విగ్రహాలు



శోభాయాత్రలో కళా ప్రదర్శనలు

ఎన్నికల అధికారి ఓటింగ్ 'రాగం'!

- పాట ద్వారా ఓటర్లకు పిలుపు
- భివండిలో వినూత్న ప్రయత్నం

సార్వత్రిక సమరంలో ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం, స్వచ్ఛంద సంస్థలు గట్టిగానే కృషి చేస్తున్నాయి. మరో పక్క కంపెనీలు సైతం వినూత్న చర్యలతో ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చే పనిలో ఉన్నాయి. ఈ క్రమంలో మహారాష్ట్రలోని భివండి లోక్‌సభ నియోజకవర్గంలో కేంద్ర ఎన్నికల పరిశీలకునిగా నియమితుడైన ఓ అధికారి తనలోని కళాకారుడిని నిద్రలేపారు. ఓటు విలువను చెప్పడంతో పాటు ఓటేసి



తమ బాధ్యతలను నెరవేర్చాలంటూ పిలుపు నిచ్చేందుకు స్వయంగా గాయకుని అవతారం ఎత్తారు. ఆయనే 2010 ఐఆర్‌ఎస్ ఆఫీసర్ చిత్తరంజన్ ధంగద మారీఖ. మరింత మంది ఓటర్లను పోలింగ్ బూత్‌లకు రప్పించేందుకు మారీఖ ఇటీవల ఒక సంగీత విభావరిని నిర్వహించారు. అందులో 'అప్నే యే ఓట్ హై.. అప్నీ యే పెహ్‌చాన్ హై..' (ఇది మన ఓటు.. ఇది మన గుర్తింపు) అంటూ మాంచి ఎన్నికల రాగంతో ఆకట్టుకున్నారు. థానే జిల్లా యంత్రాంగం ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అశోక్ శింగారేతో సహా పలువురు అధికారులు కూడా హాజరై ఓటర్లను ఉత్సాహపరచడం విశేషం. చైనా–మహేశ్ కంపోజ్ చేసిన ఈ పాట ద్వారా పోలింగ్ రోజున పౌరులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సంగీతప్రియుడైన మారీఖ ఇటీవలే యూట్యూబ్‌లో 'వందే భారత్' పేరుతో ఓ పాట కూడా రిలీజ్ చేశారట! మహారాష్ట్రలో భివండితో సహా 13 లోక్‌సభ స్థానాల్లో సోమవారం పోలింగ్ జరగనుంది. దీంతో రాష్ట్రంలో మొత్తం 48 నియోజవర్గాల్లోనూ ఎన్నికల క్రతువు ముగుస్తుంది. - థానే



● రాజీవ్ ప్రతాప్ రూడీ




● రోహిణి ఆచార్య



బిహార్‌లో పురాతన నలందా విశ్వవిద్యాలయం తాలుకు ఆనవాళ్లు



● చిరాగ్ పాశ్వాన్



● శివ చంద్ర రామ్

పాంచ్ పటాకా!

బిహార్‌లో 5 సీట్లకు నేడే పోలింగ్ ● అన్నీ ఎన్డీఏ సిట్టింగ్ స్థానాలే దాంతో బీజేపీకి ప్రతిష్టాత్మకం ● ఇండియా కూటమి గట్టి పోటీ

బిహార్ 7 విడతల సుదీర్ఘ పోలింగ్ షెడ్యూల్‌లో 4 దశలు పూర్తయ్యాయి. మొత్తం 40 లోక్‌సభ స్థానాలకు గాను 19 చోట్ల అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలోకి చేరిపోయింది. ఐదో విడతలో 5 సీట్లలో పోటీకి రంగం సిద్ధమైంది. ఇవన్నీ ఎన్డీఏ సిట్టింగ్ స్థానాలే కావడం విశేషం. మూడు బీజేపీ, ఒకటి ఎల్జేపీ, మరొకటి జేడీయూ ఖాతాలో ఉన్నాయి. నేడు పోలింగ్ జరగనున్న ఈ కీలక లోక్‌సభ నియోజకవర్గాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్



● అశోక్ కుమార్ యాదవ్



● మహ్మద్ అలీ అష్రాఫ్



● అర్జున్ రాయ్



● దేవేశ్ చంద్ర ఠాకూర్



● రాజ్ భూషణ్ చౌదరి



● అజయ్ నిషాద్

సరన్.. లాలు పాసవుతారా?

లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ జన్మస్థలమైన ఈ నియోజకవర్గం ఈసారి బిహార్‌లో అత్యంత హాట్ సీట్‌గా మారింది. 2008లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన సీటిది. అంతక్రితం చాప్రా పేరుతో ఉండేది. చాప్రా నుంచి లాలు ప్రసాద్ యాదవ్ జనతాదళ్ తరఫున తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు. సరన్‌గా మారాక సొంత పార్టీ ఆర్జేడీ తరఫున బోణీ కొట్టారు. తర్వాత ఈ స్థానం కమలనాథుల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. 1996, 1999లో చాప్రా నుంచి గెలిచిన బీజేపీ నేత రాజీవ్ ప్రతాప్ రూడీ 2014లో లాలు భార్య రబ్రీదేవిపైనా విజయం సాధించడం విశేషం. రూడీ గత ఎన్నికల్లో ఆర్జేడీ నేత చంద్రికా రాయ్‌పై 1.4 లక్షల ఓట్ల మెజారిటీతో నెగ్గారు. ఈసారి ఆర్జేడీ నుంచి లాలు రెండో కుమార్తె రోహిణి ఆచార్య ఎన్నికల అరంగేట్రం చేస్తుండటంతో సరన్ దేశవ్యాప్తంగా చర్చనీయంగా మారింది. రోహిణి విజయాన్ని లాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రచారం చేస్తున్నారు. రూడీకి జేడీ(యూ) మద్దతు కలిసొచ్చేదే. అయితే బిహార్లో ఇండియా కూటమి గట్టి పోటీ ఇస్తున్నందున ఆయన గెలుపు అంత ఈజీ కాదంటున్నారు. అంతేగాక పదేపదే కూటములు మారుస్తూ సీఎం కుర్చీకి అతుక్కుపోయిన జేడీ(యూ) చీఫ్ నితీశ్ కుమార్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఎన్డీఏకు మరింత ప్రతికూలమని భావిస్తున్నారు. సరన్ లోక్‌సభ స్థానం పరిధిలోని 6 అసెంబ్లీ సెగ్మెంట్లూ బీజేపీ ఖాతాలోనే ఉన్నాయి.

హాజీపూర్.. బరిలో చిరాగ్

ఈ ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం దళిత నాయకుడు దివంగత రామ్ విలాస్ పాశ్వాన్ కంచుకోట. ఇక్కణ్నుంచి ఆయన ఏకంగా ఎనిమిదిసార్లు విజయ ఢంకా మోగించారు. 1977లో జనతాతో మొదలై 2014లో సొంతంగా లోక్ జనశక్తి దాకా నాలుగు పార్టీల్లో పాశ్వాన్ ప్రస్థానం కొనసాగింది. తర్వాత ఆరోగ్య కారణాలతో పాశ్వాన్ రాజ్యసభకు వెళ్లారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో హాజీపూర్‌లో ఆయన సోదరుడు పశుపతి కుమార్ పరాస్ నెగ్గి కేంద్ర మంత్రి అయ్యారు. రామ్ విలాస్ మరణానంతరం ఆయన కుమారుడు చిరాగ్‌తో వారసత్వ పోరులో ఎల్జేపీని పరాస్ చేజిక్కించుకున్నారు. చిరాగ్ పోరాడి ఎల్జేపీ (రాం విలాస్) పార్టీ పేరును దక్కించుకున్నారు. పశుపతి వర్గం రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ (ఆర్ఎల్జేపీ) పేరు పెట్టుకుంది. రెండూ బీజేపీ మిత్రపక్షాలుగానే కొనసాగాయి. ఈసారి పశుపతి పార్టీకి బీజేపీ ఒక్క స్థానం కూడా కేటాయించలేదు. దాంతో ఆయన ఎన్డీఏ కూటమికి, మంత్రి పదవికి రాజీనామా చేశారు. సొంతంగా హాజీపూర్‌లో పోటీ చేస్తానని ప్రకటించారు. బీజేపీతో పొత్తులో భాగంగా చిరాగ్ పార్టీకి హాజీపూర్‌తో పాటు 5 సీట్లు దక్కాయి. తండ్రి నియోజకవర్గం నుంచి చిరాగ్ పోటీకి దిగారు. దాంతో బాబాయ్, అబ్బాయ్ మధ్య రసవత్తర పోరు తప్పదని భావించారు. కానీ పశుపతిని బీజేపీ దారికి తెచ్చుకోవడంతో ఆర్ఎల్జేపీ ఈ ఎన్నికల్లో నుంచే తప్పుకుంది. ఎన్డీఏ అభ్యర్థులకే మద్దతిస్తానని పశుపతి ప్రకటించడంతో వివాదం సద్దుమణిగింది. ఇండియా కూటమి నుంచి ఆర్జేడీ అభ్యర్థిగా శివ చంద్ర రామ్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ దన్నుతో ఆయన గట్టి పోటీ ఇస్తున్నా జేడీ(యూ)కు హాజీపూర్లో భారీ ఓటు బ్యాంకుంది. జేడీయూ నుంచి బయటికొచ్చి సొంత పార్టీ పెట్టుకున్న రాం విలాస్ పాశ్వాన్‌ను 2009లో ఆ పార్టీ అభ్యర్థి రామ్ సుందర్ దాస్ ఓడించడం విశేషం! ఈసారి మాత్రం ఎన్డీఏ పక్షమైన జేడీ(యూ) మద్దతు, బాబాయ్ బరిలో లేకపోవడం చిరాగ్‌కు కలిసొచ్చే అంశాలే.

మధుబని... కుల సమీకరణాలు

ఒకప్పుడు కాంగ్రెస్, కమ్యూనిస్టుల గుప్పిట్లో ఉన్న ఈ నియోజకవర్గంలో ఇప్పుడు కాషాయ జెండా ఎగురుతోంది. బీజేపీ కీలక నేత, మాజీ కేంద్ర మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత హుకుందేవ్ నారాయణ్ యాదవ్‌కు గట్టి పట్టున్న నియోజకవర్గమిది. ఇక్కడ ఆయన 4 సార్లు గెలిచారు. 2019లో ఆయన తనయుడు అశోక్ కుమార్ యాదవ్ 4.5 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. ఈసారి కూడా బీజేపీ నుంచి ఆయనే బరిలో ఉన్నారు. ఇండియా కూటమి నుంచి ఆర్జేడీ అభ్యర్థిగా మహ్మద్ అలీ అష్రాఫ్ ఫాత్మీ బరిలో ఉన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఆర్జేడీ నుంచి బహిష్కరణకు గురై బీఎస్పీ, తర్వాత జేడీ(యూ)ల్లో చేరిన ఫాత్మీ చివరికి మళ్లీ ఆర్జేడీలో చేరి టికెట్ దక్కించుకోవడం విశేషం. ఆయన గతంలో దర్భంగా నుంచి నాలుగు సార్లు ఎంపీగా గెలిచారు. మధుబనిలో 2.7 లక్షల మంది బ్రాహ్మణులు, 2.35 లక్షల మంది యాదవులు, 2.15 లక్షల మంది ముస్లింలు, 6.1 లక్షల మంది అత్యంత వెనుకబడిన వర్గాల వారు, 2 లక్షల మంది దళితులున్నారు. ఎన్డీఏ, ఇండియా కూటమి మధ్య పోటీ హోరాహోరీగా ఉంది.

సీతామఢి... టఫ్ ఫైట్

ఆర్జేడీ, జేడీ(యూ) నువ్వా నేనా అనేలా తలపడుతున్న నియోజకవర్గమిది. ఇక్కడి ఓటర్లు ప్రతిసారి ఎంపీలను మార్చేస్తుండటం విశేషం. 2014లో ఎన్డీఏ భాగస్వామి రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ (ఆర్ఎస్ఎల్పీ) అభ్యర్థి రామ్ కుమార్ శర్మ కుశ్వాహ 1.4 లక్షల ఓట్ల మెజారిటీతో జేడీ(యూ) అభ్యర్థి సీతారాం యాదవ్‌ను ఓడించారు. ఈ ఆర్ఎస్ఎల్పీ నిజానికి జేడీ(యూ) నుంచి విడిపోయిన ఉపేంద్ర కుశ్వాహ స్థాపించిన పార్టీ. ఇది 2019లో ఆర్జేడీ–కాంగ్రెస్ మహాకూటమికి జై కొట్టింది. నితీశ్‌తో విభేదాలకు తెరపడటంతో 2021లో ఆర్ఎస్ఎల్పీని కుశ్వాహ తిరిగి జేడీ(యూ)లో విలీనం చేశారు. 2019లో సీతామఢిలో జేడీ(యూ) అభ్యర్థి సునీల్ కుమార్ పింటు 2.5 లక్షల ఓట్ల భారీ తేడాతో ఆర్జేడీ నేత అర్జున్ రాయ్‌ని ఓడించారు. నిజానికి అర్జున్ రాయ్ 2009లో జేడీ(యూ) అభ్యర్థిగా ఇక్కడ నెగ్గారు. తర్వాత ఆర్జేడీలోకి జంప్ చేశారు. ఈసారి జేడీ(యూ) సిట్టింగ్ ఎంపీని పక్కనబెట్టి దేవేశ్ చంద్ర ఠాకూర్‌ను బరిలో నిలిపింది. ఆర్జేడీ మాత్రం మళ్లీ అర్జున్ రాయ్‌కే టికెటిచ్చింది. ఎన్డీఏ, ఇండియా కూటములు ఇక్కడ హోరాహోరీ పోరాడుతున్నాయి. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో మూడు బీజేపీ, రెండు జేడీయూ, ఒకటి ఆర్జేడీ ఖాతాలో ఉన్నాయి.

ముజఫర్‌పూర్... కమలానికి ప్రతిష్టాత్మకం

సోషలిస్ట్ దిగ్గజం, దివంగత రక్షణ మంత్రి జార్జ్ ఫెర్నాండెజ్ ఐదుసార్లు ప్రాతినిధ్యం వహించిన స్థానమిది. ఎమర్జెన్సీ అనంతరం ఫెర్నాండెజ్ 1977లో జైలు నుంచే ఇక్కడ విజయం సాధించారు. 2014లో ఇక్కడ తొలిసారి కాషాయ జెండా ఎగిరింది. ఐదుసార్లు ఎంపీగా గెలుపొందిన కేంద్ర మాజీ మంత్రి జయ నారాయణ్ ప్రసాద్ నిషాద్ తనయుడు అజయ్ నిషాద్ బీజేపీ నుంచి 2.2 లక్షల ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి అఖిలేశ్ ప్రసాద్ సింగ్‌ను ఓడించారు. 2019లో రెట్టింపు మెజారిటీతో మళ్లీ గెలిచారు. అయినా బీజేపీ ఈసారి రాజ్ భూషణ్ చౌదరికి టికెటిచ్చింది. దాంతో అజయ్ ఆగ్రహించి కాంగ్రెస్‌లోకి జంప్ చేశారు. ఆ పార్టీ అభ్యర్థిగా బీజేపీపైనే పోటీకి దిగారు! నిషాద్ తిరుగుబాటు నేపథ్యంలో కాషాయ పార్టీకి ఈ పోరు ప్రతిష్టాత్మకంగా మారింది.

జార్ఖండ్‌లో టఫ్ ఫైట్

మూడు స్థానాలకు నేడు పోలింగ్ ● అన్నీ బీజేపీ సిట్టింగ్ స్థానాలే

కీలకమైన హజారీబాగ్. అత్యధిక క్రిమినల్ కేసులున్న అభ్యర్థి పోటీ చేస్తున్న చత్రా. కేంద్ర మంత్రి బరిలో ఉన్న కొడెర్మా. జార్ఖండ్‌లో ఈ మూడు లోక్‌సభ స్థానాలకు ఐదో విడతలో భాగంగా నేడు పోలింగ్ జరగనుంది. ఇవన్నీ బీజేపీ సిట్టింగ్ స్థానాలే కావడంతో వాటిని నిలుపుకోవడం ఆ పార్టీకి ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది...

- సాక్షి, నేషనల్ డెస్క్

హజారీబాగ్ బీజేపీ వర్సెస్ మాజీ బీజేపీ

ఒకప్పుడు బీజేపీలో చక్రం తిప్పిన నేత యశ్వంత్ సిన్హా కుమారుడు జయంత్ సిన్హా ఇక్కడి సిట్టింగ్ ఎంపీ. 2014లో 1.59 లక్షల ఓట్ల మెజారిటీతో గెలవగా 2019లో దాన్ని ఏకంగా 4.8 లక్షలకు పెంచుకున్నారు. మోదీ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ యశ్వంత్ బీజేపీని వీడినా జయంత్ మాత్రం పార్టీలోనే కొనసాగుతున్నారు. కానీ ఈసారి ఆయన బదులు స్థానిక ఎమ్మెల్యే మనీశ్ జైస్వాల్‌కు బీజేపీ టికెటిచ్చింది. దాంతో ఇక్కడ గెలుపు ఆ పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారింది. కాంగ్రెస్ నుంచి జై ప్రకాశ్ భాయ్ పటేల్, సీపీఎం నుంచి అనిరుద్ధ కుమార్ బరిలో ఉన్నారు. పోలింగ్‌కు వారం ముందు జయంత్ కుమారుడు ఆషిర్ సిన్హా (22) కాంగ్రెస్‌లో చేరి బీజేపీని కలవరపెట్టారు. కానీ దానికంత ప్రాధాన్యం లేదని, ఆషిర్‌కు ఎన్నికల్లో పోటీ చేసే వయసు కూడా లేదని జయంత్ అన్నారు. బీజేపీ అభ్యర్థి మనీశ్ హజారీబాగ్ ఎమ్మెల్యే కావడం పార్టీకి సానుకూలాంశం. ఆయన కర్వాల్ ఓబీసీ కమ్యూనిటీ నేత. కాంగ్రెస్ అభ్యర్థి పటేల్ కుర్మి కులస్తుడు. జేఎంఎం సహ వ్యవస్థాపకుడు తేక్‌లాల్ మహతో కుమారుడు. హజారీబాగ్ లోక్‌సభ స్థానం పరిధిలోని మండు నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇటీవలే ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరి టికెట్ సంపాదించారు. దాంతో పాత మిత్రుల మధ్యే పోటీ నెలకొంది. కాంగ్రెస్‌కు జేఎంఎం, ఆర్జేడీ మద్దతిస్తుంటే; బీజేపీకి ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ బాసటగా నిలుస్తోంది. హోరాహోరీ పోరు నేపథ్యంలో ఎవరు గెలిచినా బొటాబొటి మెజారిటీతోనే గట్టెక్కేలా కన్పిస్తున్నారు.



కొడెర్మా

జార్ఖండ్‌లోని ముఖ్యమైన లోక్‌సభ స్థానాల్లో ఒకటి. ఉత్తమ ఎమ్మెల్యే అవార్డు పొందిన వినోద్ సింగ్ సీపీఐ(ఎంఎల్) అభ్యర్థిగా విపక్ష ఇండియా కూటమి తరఫున బరిలో ఉన్నారు. ఆయన ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని బగోదర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడుసార్లు గెలిచారు. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవి పోటీ చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో జార్ఖండ్ వికాస్ మోర్చా (పి) నేత బాబూలాల్ మరాండిపై ఆమె 4.5 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో నెగ్గారు. అన్నపూర్ణా దేవి గతంలో ఆర్జేడీ ఎమ్మెల్యేగా చేశారు. 2019 ఎన్నికల ముందే బీజేపీలో చేరారు. ఎంపీగా అన్నపూర్ణా దేవి, బగోదర్‌లో ఎమ్మెల్యేగా వినోద్ సింగ్ చేసిన అభివృద్ధి పనులే ప్రధాన చర్చనీయాంశంగా మారాయి. కొడెర్మా ఇప్పటికీ ఎందుకు వెనుకబడిన జిల్లాగా ఉందో బీజేపీ చెప్పాలని వినోద్ ప్రశ్నిస్తున్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలో 6 అసెంబ్లీ సీట్లలో సగం బీజేపీ చేతిలోనే ఉన్నాయి. కొడెర్మా లోక్‌సభ స్థానం 1977లో ఉనికిలోకి వచ్చింది. నాటినుంచి ఇక్కడ జరిగిన 13 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆరుసార్లు గెలిచింది. మే 14న వారణాసిలో నామినేషన్ అనంతరం ప్రధాని మోదీ ఈ నియోజకవర్గంలో చేసిన ర్యాలీకి ఊహించనంత భారీ స్పందన లభించింది!

నేరచరిత్ర

చత్రా కాంగ్రెస్ అభ్యర్థి కృష్ణానంద్ త్రిపాఠిపై అత్యధిక క్రిమినల్ కేసులున్నాయి. అంతేగాక రూ.70 కోట్ల ఆస్తులతో జార్ఖండ్‌లో ఈ విడత బరిలో ఉన్న అభ్యర్థులందరిలో అత్యంత సంపన్నుడు కూడా ఆయనే. తర్వాత మనీశ్ జైస్వాల్ (రూ.36.29 కోట్లు), అన్నపూర్ణాదేవి (రూ.12.82 కోట్లు) ఉన్నారు. మొత్తం 54 మంది అభ్యర్థుల్లో 21 మంది కోటీశ్వరులు. ఇండిపెండెంట్ అభ్యర్థి రాజేశ్ తన వద్ద కేవలం రూ.25,000 ఉన్నట్టు వెల్లడించారు. 33 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులున్నాయి.

చత్రా లోకల్ వర్సెస్ నాన్ లోకల్

1957లో ఇక్కడ తొలిసారి లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పటి నుంచీ ఇప్పటిదాకా ఒక్కసారి కూడా స్థానికుడు ఎంపీ కాకపోవడం విశేషం! స్థానికులకు డిపాజిట్లు కూడా దక్కని పరిస్థితి!! గత రెండు ఎన్నికలుగా ఇక్కడ బీజేపీదే విజయం. ఈసారి మాత్రం సిట్టింగ్ ఎంపీ సునీల్ కుమార్ సింగ్‌ను పార్టీలోనే ఓ వర్గం తీవ్రంగా వ్యతిరేకించడంతో స్థానికుడైన కాళీచరణ్ సింగ్‌కు బీజేపీ టికెటిచ్చింది. కాంగ్రెస్ మాత్రం స్థానికేతరుడైన మాజీ మంత్రి కృష్ణానంద్ (కేఎన్) త్రిపాఠిని బరిలో దింపింది. దీనిపై స్థానిక నేతల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా పట్టించుకోలేదు. గత రెండు ఎన్నికల్లో పార్టీని చూసే ఓటేశామని, ఈసారి మాత్రం నియోజకవర్గ సమస్యలు బాగా తెలిసిన స్థానిక అభ్యర్థికే మద్దతని వ్యాపారులు చెబుతున్నారు.

అరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందు కనిపిస్తుంటే అన్నదాత ఆనందానికి అవధులుండవు. చెమటోడ్చి చేసిన కష్టం ధాన్యలక్ష్మిగా నట్టిల్లు చేరుతుందన్న సంతోషంతో రైతన్నలు ఉత్సాహంగా కోతలు మొదలెడతారు. ఆ ఆనందంతో జానపద కళలూ అనాదిగా మమేకమయ్యాయి. మరి ఎన్నికల సీజన్‌లో పంట కోతకొస్తే? రైతన్నతో పాటు నేతన్నకూ పండగే! బిహార్‌లో ఇప్పుడదే జరుగుతోంది. అక్కడ పంట కోత (కట్నీ) సీజన్ నడుస్తోంది. గ్రామీణ ఓటర్లలో చాలామంది సాగుపై ఆధారపడ్డవారే కావడంతో అభ్యర్థులంతా జానపద కళాకారుల వెంట పడుతున్నారు. గ్రామీణ జీవనాన్ని ప్రతిబింబించే 'కట్నీ' జానపద పాటలతో రాజకీయ 'పంట' పండించుకునే పనిలో పడ్డారు...

- సాక్షి, నేషనల్ డెస్క్



బిహార్ ప్రచారంలో జానపదాల జజ్జనక
పంట కోతల వేళ జానపద కళాకారుల హవా

ఓటువాక సాగారో!

బిహార్‌లో ఓట్ల సీజన్‌కు తోడు పంట కోత సీజన్ కూడా జోరందుకుంది. రాష్ట్రంలో 88 శాతం పైగా ప్రజలు గ్రామీణులే. జనాభాలో 50 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. రాష్ట్రంలో రబీ పంట (ముఖ్యంగా గోధుమ) కోత సీజన్ ఏప్రిల్‌లో మొదలై మే వరకు సాగుతుంది. గ్రామీణ ఓటర్లు చాలావరకు రైతులు, రైతు కూలీలే. వారంతా కట్నీ (పంట కోత) పనుల్లో బిజీగా ఉన్నారు. దాంతో కట్నీ పాటల ద్వారా వారి ఓట్లకు గాలం వేసేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం పేరొందిన జానపద కళాకారులను ఏరికోరి నియమించుకుంటున్నారు. ''బిహార్‌లో ఒక్కో వేడుకకు ఒక్కో తరహా జానపద పాటలు ఫేమస్. పంట కోతలప్పుడు 'కట్నీ' పాటలు ఉత్సాహపరుస్తాయి'' అని భోజ్‌పురీలో 4,500 పాటలు పాడిన జానపద గాయకుడు భరత్ శర్మ వ్యాస్ చెబుతున్నారు.

ఓటర్లను ఆకట్టుకోవాలంటే తప్పదు...

కట్నీ సీజన్లో ఎన్నికల సభలు, ర్యాలీల్లో పాల్గొనేందుకు ప్రజలు ఆసక్తి చూపరని జేడీ(యూ) స్టార్ క్యాంపెయినర్, బిహార్ గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రవణ్ కుమార్ అంటున్నారు. ''వారిని ఆకట్టుకోవాలంటే ప్రచారంలో వినోదాన్ని మేళవించాల్సిందే. జానపద పాటలు, నృత్యాలతో వారిలో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నాం. రాష్ట్రంలో అభ్యర్థులంతా ఇదే బాట పట్టారు'' అని వివరించారు. ఆర్జేడీ నేత, బిహార్ మాజీ వ్యవసాయ మంత్రి సుధాకర్‌సింగ్ కూడా అదే అన్నారు. ''పంట కోతల సీజన్ గనుక గ్రామీణులు పొలాల్లోనే ఉంటారు. వారికి కాస్త వినోదం పంచేలా కట్నీ కళాకారుల సాయంతో ప్రచారం చేస్తున్నాం'' అని చెప్పుకొచ్చారు. ఆయన బక్సర్ లోక్‌సభ స్థానం నుంచి ఆర్జేడీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.


'ఎన్నికల సమయంలో అభ్యర్థులు గ్రామీణ ఓటర్లతో మమేకం కావడంలో జానపద గాయకులది కీలక పాత్ర. పంట కోతల సీజన్ కావడంతో రైతులు, రైతు కూలీలను ఆకట్టుకోవడానికి చైతా, కట్నీ పాటల్లో ఆరితేరిన కళాకారులకు బాగా డిమాండ్ ఉంది'

- భరత్ శర్మ వ్యాస్, ప్రసిద్ధ భోజ్‌పురి జానపద గాయకుడు

అభ్యర్థుల పొలం బాట...!

సీపీఐ (ఎంఎల్) సిట్టింగ్ ఎమ్మెల్యే సుధామ ప్రసాద్ అయితే ఇంటింటి ప్రచారమే గాక రైతులు, రైతు కూలీలను కలిసేందుకు ఏకంగా పొలంబాట పట్టారు! మహా కూటమి తరఫున ఆయన లోక్‌సభ బరిలో నిలిచారు. కట్నీ పాటలతో గ్రామీణ ఓటర్లతో సులువుగా మమేకం కావచ్చంటారాయన. బీజేపీ అభ్యర్థి సంజయ్ జైస్వాల్ కూడా దీనితో ఏకీభవించారు. ''ఉదయమంతా పట్టణ ప్రాంతాలు చుట్టేస్తున్నాం. రైతులు, కూలీలు పొలాల నుంచి ఇంటిబాట పట్టే మధ్యాహ్నా వేళ కల్లా గ్రామాల్లో ప్రచారానికి వెళ్తున్నాం'' అని వివరించారు.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
సోమవారం ॥ 20-5-2024



బౌద్ధవాణి

ధర్మ జ్ఞానోదయం

సూర్యోదయం అయ్యింది. సూర్యుని చేత కిరణాలు దట్టమైన చెట్ల చిటారు కొమ్మలపై పడుతున్నాయి. లేలేత ఎరుపు రంగులో ఉన్న కొమ్మల చివుర్లు మరింత ప్రకాశవంతంగా మెరుస్తున్నాయి. చల్లని గాలి చెట్ల మధ్య దూరి కొమ్మల్ని తాకుతూ పయనిస్తుంది.

అప్పుడే నదిలో స్నానం చేసి వచ్చి పాలవృక్షం క్రింద కూర్చున్నాడు బుద్ధుడు. ఆ ఉషోదయ తేజస్సు అంతా అతని ప్రశాంత వదనంలోంచి ఉదయిస్తోంది! పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు. కనురెప్పలు మెల్లగా వాలాయి! ఆలోచనల పొరలు తెరచుకున్నాయి!

తాను జ్ఞానోదయం పొంది ఇది నలభై తొమ్మిదో రోజు. అంటే సిద్ధార్థుడు బుద్ధిని పొంది, బుద్ధుడైన రోజు. అప్పటికి రెండు నెలల క్రితం నిరంజనా నదీ తీరంలో తన ఐదుగురు మిత్రులతో కలిసి కఠోర తపస్సు చేశాడు. చిక్కిశల్యమై నీరసించి పడిపోయాడు. జ్ఞానసాధనకు అది సరైన మార్గం కాదని నిర్ణయించుకున్నాడు. నిరాహార వ్రతం మానాడు. మిత్రులు తనని దూషించి వెళ్ళిపోయారు. అయినా నిరాశపడలేదు. గయకు చేరాడు. అక్కడ నదీతీరంలోని రావిచెట్టు కింద ధ్యానదీక్ష కొనసాగించాడు. అంతకాలంగా వెదుకుతున్న దుఃఖానికి కారణం తెలిసింది కాబట్టి దానికి నివారణ మార్గం కూడా తెలిసింది.

ఆ నిదారణా మార్గమే అష్టాంగ మార్గం! అష్టాంగమార్గ ఆవిష్కరణే బుద్ధునికి జ్ఞానోదయం.

ఏ విషయంలోనూ అతి ఉండకూడదు అనేది అవగతం అయ్యింది. తిండి మాని శరీరాన్ని ఎండగట్టుకోవడం ఎంత తప్పో, అతిగా తిని శరీరాన్ని సోమరిగా చేయడం అంతే తప్పు. నిద్రాహారాలు మాని పగలూ రేయి అవిశ్రాంతంగా పని చేయడం ఎంత తప్పో, పనీ పాటా మాని తిని తిరగడం అంతే తప్పు. ఇలా... రెండు అంచులకు చేరకుండా మధ్యస్థంగా ఉండడం వల్ల కర్తవ్య పాలన చిరకాలం సాగించగలం. దీన్నే మధ్యమమార్గం అంటాం. ఈ మార్గమే బుద్ధుని బోధనలకు పునాది. ఈ మార్గాన్ని ఎంచుకునే అష్టాంగ మార్గాన్ని రూపొందించాడు. అదే బుద్ధునికి జ్ఞానోదయం.

బుద్ధుని ఆలోచనల్లో ప్రశాంత వెలుగులు నింపిన ఆరోజు వైశాఖ పున్నమి.

బుద్ధత్వం సిద్ధించిన రోజు. బుద్ధుడు సంబోధిని పొందిన రోజు. నేడు ప్రపంచానికి పండుగరోజు.

దుఃఖ నివారణా మార్గాన్ని సాధించిన బుద్ధుడు వెంటనే అక్కడినుంచి లేచి వెళ్ళిపోలేదు. తాను పొందిన జ్ఞానాన్ని ప్రకటించుకోలేదు. ఆ మార్గాన్ని దాని ఆచరణలో కలిగే అవరోధాల్ని, అసలు ఆ మార్గం ప్రజలకు అర్థమవుతోందా? లేదా? అనే విషయాల్ని పలు పలు విధాలుగా తర్కించుకున్నాడు.

తర్కించి తర్కించి.. చివరికి తనది సరైన మార్గమే అని నిర్ణయించుకున్నాడు.

మొదటివారం అంతా తనకు ఏ చెట్టుకింద జ్ఞానోదయం కలిగిందో.. ఆ చెట్టుకిందే కూర్చున్నాడు. మానవుల పుట్టుక, మరణాల మధ్య ఉన్న దశల్ని పన్నెండు భాగాలుగా విభజించుకుని ఒక్కో దశ గురించి దీర్ఘంగా ఆలోచించాడు. అవిద్య, సంస్కారాల పరంపరలో ముసలితనం, మరణం కలుగుతాయని, ఆ మరణం వల్లే శోకం, రోదనం, దుఃఖం, బాధలు కలుగుతాయని తెలుసుకున్నాడు. ఈ దుఃఖ బాధలకు కారణం అలవిమాలిన కోరిక (తృష్ణ), కాబట్టి కోరికల్ని నశింపచేసుకుంటే మనస్సు దుఃఖ రహితమవుతుందని గ్రహించాడు. దానితో తన ఆలోచనలకి మరింత బలం చేకూరింది. అలా మొదటి వారం గడిచింది.

రెండోవారం కూడా ఆ బోధి వృక్షం కిందే ఉండి ధ్యానానందాన్ని పొందాడు.

మూడోవారం ఆ చెట్టుకు కొద్ది దూరంగా వెళ్ళి నేరేడు చెట్టు కింద కూర్చొని, బోధివృక్షాన్ని పరిశీలిస్తూ తన మార్గాన్ని మరింత విస్తృత పరుచుకుంటూ గడిపాడు.

అక్కడి నుండి లేచి, అక్కడికి దగ్గరలో ఒక కొలనుగట్టున ఉన్న ఒక మందిరంలో చేరాడు. అక్కడే 'అభిధర్మాన్ని' పరిష్కరించాడు. ధ్యానసాధనా సోపానాల్ని, మనస్సుని కేంద్రీకరించే విధానాన్ని రూపొందించుకున్నాడు. మనస్సు నిర్మలం అయింది. బుద్ధుని ముఖంలోంచి తేజస్సు ప్రకాశించింది. తల చుట్టూ ఆరు రంగుల కాంతి .... వెల్గులు ప్రసరించింది. అది ఒక జ్ఞాన కాంతి పుంజం.

మరలా ఆ తేజోమూర్తి అక్కడి నుండి లేచాడు. అజపాల అనే మర్రి చెట్టు కిందికి చేరాడు. అప్పుడు ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. వారిద్దరి మధ్య జరిగిన సంభాషణలో – చెడ్డ పనులు ఎవరు చేయరో, మోహరాగాల నుండి ఎవరు ముక్తులవుతారో, స్వచ్ఛమైన జీవితాన్ని గడుపుతూ, సర్వోన్నత జ్ఞానిగా ఎవరు ఉంటారో వారే బ్రాహ్మణులు. బ్రాహ్మణత్వం అలా సిద్ధిస్తుంది గాని, పుట్టుకను బట్టి కాదు. అని బుద్ధుడు చెప్తాడు.

'సత్యాన్ని తెలుసుకుని, ఏకాంతంగా గడపడం సుఖం. మంచి పనులు చేయడం అంతకంటే సుఖం. జీవుల పట్ల కరుణ, మైత్రి కలిగి జీవించడం అన్నింటికంటే పరమసుఖం. అని బోధిస్తాడు.

జనులు కోర్కెలతో, క్లేశాలు అనే వాసాలతో ఇల్లు నిర్మించుకుంటారు. వాటిని తృష్ణ అనే తాళ్ళతో గట్టిగా బంధించుకుంటారు. ఆ తాళ్ళను తెంచి, వాసాలు దించి, ఆ కోర్కెల కొంపను కూల్చుకుంటేనే దుఃఖం నుండి విముక్తి అనే విషయాన్ని ఆవిష్కరించగలుగుతారు. కోర్కెల వాసాలతో దుఃఖం అనే ఇంటిని నిర్మించుకుని ప్రజలు అందులో జీవిస్తున్నారు. ఆ ఇంటికి బలం కోర్కెలనే వాసాలు. జ్ఞానం అనే గొడ్డలితో ఆ కోర్కెల్ని కూల్చితే దుఃఖం దూరమైపోతుంది. ఇదే బుద్ధునికి కలిగిన జ్ఞానోదయం. దుఃఖం లేని జగతికి సూర్యోదయం. ధర్మ అరుణోదయం.

– డా. బొర్రా గోవర్ధన్

(23, గురువారం బుద్ధ పూర్ణిమ)

మంచిమాట

పిపీలికం



''ఆబ్రహ్మ పిపీలికాది పర్యంతం'' అని సమస్తం అనే అర్థంలో ఉపయోగించటం చూస్తాం. చీమ అంటే అల్పజీవి అనే అర్థం ఇక్కడ. అంతేకాదు, చాలా చులకనగా చూడబడే జీవి, చిన్న ప్రాణి. చీమ, దోమ అని కలిపి ఒకటిగా పరిగణించటం కూడా ఉంది.

కానీ, మనిషి చీమ నుండి నేర్చుకోవలసినది చాలా ఉంది. అసలు చీమలు ఎన్ని రకాలో తెలుసా?

ఎఱ్ఱచీమలు, నల్ల చీమలు, గండుచీమలు, బెదురు చీమలు, గబ్బుచీమలు, రెక్కలచీమలు ... వీటి అన్నింటికీ సామాన్య లక్షణాలూ ఉన్నాయి, ప్రత్యేక లక్షణాలూ ఉన్నాయి. సామాన్య లక్షణాలు ఆదర్శప్రాయమైనవి, అనుసరణీయాలు.

అవిశ్రాంతంగా పని చేయటం చీమల సహజ గుణం. నిరంతరం ఆహారాన్వేషణ చీమల లక్షణం. తిన్నంత తిని మిగిలినది జాగ్రత్త చేస్తాయి. చీమల పుట్టలని తవ్వి చూస్తే ధాన్యాగారంలో ఉన్నంత ధాన్యం ఉంటుందని చెపుతారు. అంత ధాన్యం తానే తిందామని దాచి పెట్టిందా? తన కోసమో, తన వారి కోసమో అంటే భవిష్యత్తు కోసం భద్రం చేయటం అనే సహజ గుణం అది. అందుకే కొద్ది కొద్దిగా కూడ పెడితే చీమలాగా కూడపెట్టారని అంటారు. అందుకే చిన్న మొత్తాల పొదుపుకి ఆదర్శం చీమలే.

చీమలకి ఉన్న ఘ్రాణశక్తి అమోఘం. బెల్లం ముక్క పెడితే ఎక్కడి నుండి వస్తాయో తెలియదు చీమలు కుప్పలు తెప్పలుగా వస్తాయి. ఎవరు చెప్పి ఉంటారు? అవి వాసనతో పసి గడతాయి. ఒక్కటి పసిగడితే చాలు. స్వార్థరహితంగా తన వారందరికీ తీపివార్తని అందిస్తుంది అది. ఇది కూడా అనుసరించ తగిన లక్షణమే కదా! ఏదైనా తీపి పలుకుని ఒక చీమ మోయ లేక పోయినా, ఒక చీమ చనిపోయినా దానిని తీసుకు వెళ్ళటానికి మిగిలినవి అన్నీ సహాయ పడతాయి. కలిసికట్టుగా ఉండటం చీమలని చూసి మనిషి నేర్చుకోవాలేమో!

చీమల గృహనిర్మాణశక్తి అద్భుతం. అంత చిన్నప్రాణులు భూమిని తొలిచి, దారి చేసుకుని, భూమి లోపల ఆశ్చర్యకరమైన నివాసస్థలాలని తయారు చేసుకుంటాయి. వాటి ప్రవేశం భూమి పైన ఉన్నా, వెళ్ళేది లోపలికి. రంధ్రంలోపలికినీళ్ళువెళ్ళటం సహజం. కానీ, చీమలు పెట్టిన పుట్ట ద్వారంలోకి నీటిచుక్క కూడా వెళ్ళదు. జాగ్రత్తగా చీమల పుట్టని అనుసరించి తవ్వుకుంటే వెడితే, లోపల ఎంతో శుచిగా, హాయిగా, చల్లగా ఉంటుందిట!గోడలు నున్నగా ఉంటాయి. అందుకేనేమో పాములు ఆ పుట్టలని తమ నివాసస్థానాలుగా చేసుకుంటాయి.''చీమలు పెట్టిన పుట్టలు పాముల కిరవైన యట్లు ..'' అనే మాటలు వినే ఉంటాం.

క్రమశిక్షణ అంటే వెంటనే గుర్తు వచ్చేది చీమలే. చీమలు రెండు అయినా నాలుగు అయినా, వందలూ వేలూ అయినా ఒక వరుసలో మాత్రమే వెళ్ళటం గమనించవచ్చు. పైగా ఒక దానితో మరొకటి పోటీ పడవు, దారి తప్పవు. చీమలు నడచిన దారి కాలిబాట లాగా స్పష్టంగా కనపడుతుంది. చీమల క్రమశిక్షణ నడక లోనే కాదు, నడత లోనూ కనపడుతుంది. చీమలదండులో ఒకటి మిగిలిన వాటికన్న పెద్దదిగా ఉంటుంది. అదే ఆ దండుకి నాయకుడు. చీమలదండు తమ నాయకుని మాటని పాటిస్తుంది.

చీమలు తయారు చేసుకున్న నివాసాన్ని ఆక్రమించిన పాములని అవకాశం చూసుకుని, అవే చీమలు పట్టి బాధిస్తాయి. చంపి వేయవచ్చు కూడా!

చీమలు తలుచుకుంటే ఎంతటి పదార్థాన్ని అయినా గంటల్లో మాయం చేయగలవు. ఉదాహరణకి, మనిషి ప్రాణం పోయిన తరువాత అట్లాగే ఉంచితే తెల్లవారే సరికి చీమలు ఎముకలని మాత్రమే మిగులుస్తాయి. వాటికి మనిషి మాంసం చాలా ఇష్టమట! బతికి ఉన్నా కదలిక లేక పోతే చాలు, వాటి పని అవి చేసుకుంటాయి. అందుకే మంచంలో ఉన్నవాళ్ళని, శవాలని జాగ్రత్తగా చూసుకోవాలని చెపుతారు.

చీమతో పోలిస్తే సంతోషించాలి సుమా!

– డా. ఎస్. అనంత లక్ష్మి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

అదీ దాంపత్యం అంటే..!



పిల్లలకు వివాహం నిర్ణయించేటప్పుడు పెద్దలు పాటించే ప్రామాణికాల్లో శీలం, వయస్సు, వ్యక్తిత్వం, అభిజనం తరువాత చివరిది లక్షణం. లక్షణం అంటే భౌతికమైన అందం. లోకంలో గుణాలు ఎంత గొప్పవో, అందం కూడా అంత గొప్పది. దానికి ఎక్కువ ప్రాధాన్యత ఉండాలి. రుక్మిణీదేవి శ్రీ కృష్ణ పరమాత్మను ఇష్టపడింది కేవలం ఆయన బాహ్య సౌందర్యం చూసి కాదు. ఎన్నో గుణాలు వివరించి...'కృష్ణా! ఇన్ని గుణాలు నీలో ఉన్నాయి కాబట్టే నాకు నీవంటే అంత ప్రీతి'' అని ఆమె ప్రకటించింది.

భౌతికమైన అందం ఉండాలి. వధూవరులు ఒకరికి ఒకరు తగినవారయి ఉండాలి. నూతన దంపతులను చూసినప్పుడు 'ఆ పిల్ల చేసుకున్న అదృష్టం' అనో, 'ఆ పిల్లవాడిది అదృష్టం అంటే'... అని అనకూడదు. ఒకరికొకరు సరిగ్గా సరిపోయారు' అనాలి. ఆ తరువాత ప్రేమతో, ఆర్ద్రతతో గృహస్థాశ్రమాన్ని పండించుకోవడం ఆ దంపతుల వంతు. దేవుడి విషయంలో అయినా సరే, ఇదే మర్యాద పాటిస్తారు. శంకరాచార్యులవారు శివానందలహరిలో పార్వతీ పరమేశ్వరుల అన్యోన్యతను ప్రస్తావిస్తూ..''ఆమె ఎంత తపస్సు చేసిందో ఈయనకు భార్య కాగలిగింది. ఈయన ఎంత తపస్సు చేసాడో అటువంటి భార్య లభించింది. అదీ దాంపత్యం అంటే. అలా అల్లుకుపోవాలని భగవంతుడే మనకు నేర్పాడు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

గమనిక

నిన్నటి ఫన్‌డేలో వారఫలాలు 12 మే నుంచి 18 మే వరకు వర్తిస్తాయని పొరపాటున ప్రచురితం అయింది. ఆ వారఫలాలు 19 మే నుంచి 25 మే వరకు వర్తిస్తాయి అని గమనించగలరు.

సినిమా


బ్రెయిన్ ఉంటే సరిపోతుందా...



ప్రభాస్

భైరవ బెస్ట్ ఫ్రెండ్ బుజ్జి... కానీ బుజ్జి అంటే మనిషి కాదు. మరి.. బుజ్జి అనేది వాహనమా? లేక ఓ టైమ్ మిషన్‌లాంటి పరికరమా? అనేది ఈ నెల 22న తెలుస్తుంది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న సైన్స్ ఫిక్షన్ అండ్ ఫ్యూచరిస్టిక్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'కల్కి 2898 ఏడీ'. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ సినిమాను అశ్వినీదత్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో భైరవ పాత్రధారిగా ప్రభాస్, అశ్వత్థామ పాత్రలో అమితాబ్ బచ్చన్ నటిస్తున్నారు. అలాగే ఈ సినిమాలో మరో సూపర్ హీరోలాంటి బుజ్జి పాత్ర కూడా ఉంది. ఈ పాత్రను పూర్తిగా చూపించకుండా ఓ వీడియోను విడుదల చేశారు మేకర్స్. ఈ పాత్రకు హీరోయిన్ కీర్తి సురేష్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. 'మనుషుల శరీరాన్ని బ్రెయిన్ కంట్రోల్ చేసినట్లే.. బుజ్జి బాడీని కూడా బ్రెయిన్ కంట్రోల్ చేస్తుంటుంది' (నాగ్ అశ్విన్), 'హేయ్.. నేను బుజ్జి బ్రెయిన్... బ్రెయిన్ ఉంటే సరిపోతుందా... బాడీ కూడా కావాలి కదా.. భైరవ ఎక్కడికీ.. నా బాడీ బిల్డ్ చేయడానికేనా..' (కీర్తీ సురేష్ వాయిస్ ఓవర్), 'నీ టైమ్ స్టార్టైంది బుజ్జి.. పదా!' (ప్రభాస్) అనే డైలాగ్స్ ఈ వీడియోలో ఉన్నాయి. ఈ బుజ్జి గురించిన పూర్తి వివరాలను ఈ నెల 22న వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు. ఇక 'కల్కి 2898 ఏడీ' జూన్ 27న విడుదల కానుంది.

జూలైలో భారతీయుడు



కమల్‌హాసన్

కమల్‌హాసన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు') జూలై 12న విడుదల కానుంది. ఈ విషయాన్ని ఆదివారం యూనిట్ అధికారికంగా ప్రకటించింది. హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'భారతీయుడు' సూపర్ హిట్‌గా నిలిచింది. వీరిద్దరి కాంబినేషన్‌లోనే 'భారతీయుడు' సినిమాకు సీక్వెల్‌గా 'భారతీయుడు 2' రూపొందింది. ఈ చిత్రంలో సిద్దార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ మూవీ నిర్మించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. కాగా ఈ నెల 22న ఈ చిత్రంలోని తొలి పాటను విడుదల చేయనున్నారు. జూన్ 1న చెన్నైలో ఆడియో వేడుకని నిర్వహించనున్నారు. ''మన దేశ రక్షణ కోసం స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతి (కమల్‌హాసన్) ఏం చేశాడు? అనేది 'భారతీయుడు 2' చిత్రకథాంశం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతదర్శకుడు. ఇదిలా ఉంటే... 'భారతీయుడు 3' కూడా రానుంది.

దూకే ధైర్యమా... జాగ్రత్త!



ఎన్టీఆర్

'దూకే ధైర్యమా... జాగ్రత్త... రాకే ఎగబడి రాకే... దేవర ముంగిట నువ్వెంత... దాక్కోవే..!' అంటూ సాగుతుంది 'దేవర' సినిమాలోని 'ఫియర్' సాంగ్. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'దేవర'. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సైఫ్ అలీఖాన్, ప్రకాశ్ రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కాగా 'దేవర'లోని 'ఫియర్' సాంగ్ లిరికల్ వీడియోను ఆదివారం విడుదల చేశారు. సోమవారం (మే 20) ఎన్టీఆర్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం ఈ సినిమాలోని 'ఫియర్' సాంగ్‌ను తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ పాడగా, కన్నడ-మలయాళ భాషల్లో సంతోష్-వెంకీ పాడారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగాన్ని అక్టోబరు 10న రిలీజ్ చేయనున్నట్లు ఆల్రెడీ యూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

శ్రీనుని చూస్తుంటే చలం గుర్తొస్తారు - చిరంజీవి



● 'గెటప్' శ్రీను, చిరంజీవి

''గెటప్ శ్రీనుని చూస్తుంటే నాకు కామెడీ హీరో చలంగారు గుర్తుకొస్తారు. చలంగారిని ఆంధ్ర దిలీప్ కుమార్ అని పిలిచేవారు. శ్రీను కూడా నాకలానే అనిపిస్తాడు. తను తొలిసారి హీరోగా నటించిన 'రాజు యాదవ్' ప్రేక్షకుల మెప్పు పొందుతుందని, హీరోగా తను కూడా అందరి మన్ననలు అందుకుంటాడని ఆశిస్తున్నాను'' అని హీరో చిరంజీవి అన్నారు. 'జబర్దస్త్' ఫేమ్ గెటప్ శ్రీను, అంకితా ఖరత్ జంటగా కృష్ణమాచారి దర్శకత్వం వహించిన చిత్రం 'రాజు యాదవ్'. కె. ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి నిర్మించిన ఈ చిత్రాన్ని నిర్మాత బన్నీ వాసు ఏపీ, తెలంగాణలో ఈ నెల 24న రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా చిరంజీవిని గెటప్ శ్రీను కలిశారు. ''రాజు యాదవ్' ట్రైలర్‌లో కొత్తదనం కనిపించింది. ఈ సినిమా హిట్ అయి, యూనిట్‌కి మంచి పేరు రావాలి'' అని చిరంజీవి ఓ వీడియో రిలీజ్ చేశారు.

ఒక్కడిలో ముగ్గురు



అజిత్

అజిత్ హీరోగా నటిస్తున్న ద్విభాషా (తెలుగు-తమిళం) చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. 'మార్క్ ఆంటోనీ' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఆదివారం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''త్రీ ఇన్ వన్' (ఒక్కడిలో ముగ్గురు)'' అంటూ ఈ పోస్టర్‌ని ఉద్దేశించి అధిక్ రవిచంద్రన్ పేర్కొన్నారు. అజిత్ పాత్రలో మూడు షేడ్స్ ఉంటాయని తెలుస్తోంది. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

అదిరేటి డ్రెస్సు మేమేస్తే...



కియారా అద్వానీ



నాన్సీ త్యాగి



శోభితా ధూళిపాళ



సెలీనా గోమెజ్



నిహారికా ఎన్‌ఎమ్

ప్రపంచంలోని అందం అంతా కాన్స్ చిత్రోత్సవాల్లోనే ఉందా అన్నట్లుగా అందాల భామలు తళుకు లీనుతున్నారు. 'అదిరేటి డ్రెస్సు మేమేస్తే.. బెదిరేటి లుక్కు మీరిస్తే దద.. ఆ మీకు దద' అనే టైపులో అందాల తారలు అదిరిపోయే ఔట్‌ఫిట్‌లో ఆకట్టుకుంటున్నారు. మన దేశీ తారలు ఐశ్వర్యా రాయ్, కియారా అద్వానీ, శోభితా ధూళిపాళ సందడి చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఢిల్లీకి చెందిన ఫ్యాషన్ ఇన్‌ఫ్లూయెన్సర్ నాన్సీ త్యాగి ఏకంగా 20 కేజీల గౌనులో రెడ్ కార్పెట్‌పై నడిచారు. ఈ ఫ్రాక్‌ని తానే డిజైన్ చేసినట్లుగా నాన్సీ పేర్కొన్నారు. అలాగే భారత్‌కి చెందిన డిజిటల్ కంటెంట్ క్రియేటర్ నిహారికా ఎన్ఎమ్ కూడా మెరిశారు. ఇంకా దేశ, విదేశీ తారల ఫొటోషూట్, రెడ్ కార్పెట్ వాక్ తాలూకు ఫొటోలు వైరల్‌గా మారాయి.

యాక్షన్... థ్రిల్



● మెరీనా సింగ్, సూర్యరాజ్

సూర్యరాజ్, మెరీనా సింగ్ జంటగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఐ -20'. 'బివేర్ ఆఫ్ గర్ల్స్' (అమ్మాయిలతో జాగ్రత్త) అనేది ఉపశీర్షిక. సూగూరి రవీంద్ర దర్శకత్వంలో పీబీ మహేంద్ర నిర్మించిన ఈ సినిమా ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ''ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి మేం రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకులందరికీ నచ్చుతుందనే అనుకుంటున్నాం'' అని యూనిట్ పేర్కొంది. తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షుడు కె.ఎల్. దామోదర్ ప్రసాద్, దర్శక-నిర్మాత లయన్ సాయి వెంకట్, దర్శకుడు వి. సముద్ర అతిథులుగా హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. రాగిణి, లీరిషా, చిత్రం శ్రీను కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు మహావీర్ యెలెందర్ స్వరకర్త.

మీ సినిమా



● అభిరామ్, వెన్నెల

సినిమా ఇండస్ట్రీకి వచ్చి సక్సెస్ కావాలనుకున్న నలుగురు యువకులు ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి? వాళ్ళు సినీ ఇండస్ట్రీలో సక్సెస్ అయ్యారా? లేదా అనే అంశాలతో రూపొందిన చిత్రం 'ఇట్లు... మీ సినిమా'. అభిరామ్, మనోహర్, పవన్, కృష్ణ, వెన్నెల, మంజుల హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాలో ప్రదీప్, అమ్మ రమేష్ కీలక పాత్రల్లో నటించారు. హరీష్ చావా దర్శకత్వంలో నోరి నాగ ప్రసాద్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం పోస్టర్‌ను దర్శకుడు కోదండరామిరెడ్డి విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ''ప్రతి సినిమా వ్యక్తి ఇది నా కథ అని ఫీలయ్యేలా ఈ సినిమా కథనం ఉంటుంది. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుగుతున్నాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: మీరావలి.



పోరాడి ఓడిన సుమిత్ నగాల్

జెనీవా ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 93వ ర్యాంకర్ సుమిత్ 6–7 (7/9), 3–6తో ప్రపంచ 19వ ర్యాంకర్ సెబాస్టియన్ బేజ్ (అర్జెంటీనా) చేతిలో పోరాడి ఓడిపోయాడు. ఒక గంటా 39 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశాడు. సుమిత్‌కు 6,215 యూరోల (రూ. 5 లక్షల 62 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.



వెర్‌స్టాపెన్‌కు ఐదో గెలుపు

అద్యంతం ఆధిపత్యం కనబరుస్తూ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఫార్ములావన్ తాజా సీజన్‌లో ఐదో విజయాన్ని అందుకున్నాడు. ఆదివారం ఇటలీలో జరిగిన ఎమిలియా రొమాగ్నా గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 63 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంటా 25 నిమిషాల 25.252 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. లాండో నోరిస్ (మెక్‌లారెన్) రెండో స్థానంలో, చార్లెస్ లెక్‌లెర్క్ (ఫెరారీ) మూడో స్థానంలో నిలిచారు. సీజన్‌లోని తదుపరి రేసు మొనాకో గ్రాండ్‌ప్రి ఈనెల 26న జరుగుతుంది.

విన్‌రైజర్స్...

ఆఖరి పోరులో పంజాబ్ కింగ్స్‌పై హైదరాబాద్ విజయం

పాయింట్ల పట్టికలో రెండో స్థానం ఖరారు

సొంతగడ్డపై గెలుపుతో ముగింపు

అదరగొట్టిన అభిషేక్, నితీశ్ రెడ్డి, క్లాసెన్


నితీశ్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అద్భుత ప్రదర్శనలు, మెరుపు ఇన్నింగ్స్‌లతో సీజన్ ఆసాంతం అదరగొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎనిమిదో విజయంతో లీగ్ దశను ముగించింది. పాయింట్ల పట్టికలో రెండో స్థానాన్ని దక్కించుకుంది. హైదరాబాద్, రాజస్తాన్ 17 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచినా... మెరుగైన రన్‌రేట్ కారణంగా హైదరాబాద్‌కు రెండో స్థానం ఖరారైంది. ఉప్పల్ స్టేడియంలో ఆదివారం జరిగిన తమ చివరి లీగ్ పోరులో హైదరాబాద్ 4 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (45 బంతుల్లో 71; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), రిలీ రోసో (24 బంతుల్లో 49; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), అథర్వ తైడే (27 బంతుల్లో 46; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం సన్‌రైజర్స్ 19.1 ఓవర్లలో 6 వికెట్లకు 215 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అభిషేక్ శర్మ (28 బంతుల్లో 66; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), క్లాసెన్ (26 బంతుల్లో 42; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), నితీశ్ కుమార్ రెడ్డి (25 బంతుల్లో 37; 1 ఫోర్, 3 సిక్స్‌లు), రాహుల్ త్రిపాఠి (18 బంతుల్లో 33; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు.

భారీ భాగస్వామ్యం...

పంజాబ్ ఓపెనర్లు అథర్వ, ప్రభ్‌సిమ్రన్ పవర్‌ప్లేలో దూకుడుగా ఆడి 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 61 పరుగులు సాధించారు. ఎట్టకేలకు 10వ ఓవర్లో అథర్వను అవుట్ చేసిన నటరాజన్ ఈ జోడీని విడదీశాడు. తొలి వికెట్‌కు ఈ ఇద్దరు బ్యాటర్లు 55 బంతుల్లో 97 పరుగులు జోడించారు. ప్రభ్‌సిమ్రన్ 34 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, మూడో స్థానంలో వచ్చిన రోసో కూడా దూకుడు ప్రదర్శిస్తూ నితీశ్ కుమార్ రెడ్డి ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ బాదాడు. ఆ తర్వాత పంజాబ్ తక్కువ వ్యవధిలో ప్రభ్‌సిమ్రన్, శశాంక్ సింగ్ (2), రోసో, అశుతోష్ శర్మ (2) వికెట్లు కోల్పోయింది. అయితే చివర్లో జితేశ్ శర్మ ధాటిగా ఆడటంతో పంజాబ్ స్కోరు 200 పరుగులు దాటింది. నితీశ్ వేసిన ఆఖరి ఓవర్లో జితేశ్ 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టడంతో 19 పరుగులు వచ్చాయి.

హెడ్ విఫలం...

ఛేదనలో రైజర్స్‌కు తొలి బంతికే షాక్ తగిలింది. అర్ష్‌దీప్ సింగ్ వేసిన చక్కటి బంతికి హెడ్ (0) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. అయితే ఆ తర్వాత హైదరాబాద్ తడబాటు లేకుండా విజయం దిశగా సాగింది. వరుసగా 72, 57, 47 పరుగుల భాగస్వామ్యాలు రైజర్స్ ఇన్నింగ్స్‌ను నడిపించాయి. ప్రత్యర్థి బ్యాటర్లను నిలువరించడంలో పంజాబ్ బౌలర్లు విఫలమయ్యారు. రిషి ధావన్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన అభిషేక్ శర్మ...అర్ష్‌దీప్ ఓవర్లోనూ 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. హర్షల్ పటేల్ ఓవర్లో 22 పరుగులు రాబట్టిన రైజర్స్ 6 ఓవర్లలో 84 పరుగులు సాధించింది. 21 బంతుల్లోనే అభిషేక్ హాఫ్ సెంచరీని చేరుకున్నాడు. అభిషేక్ అవుటయ్యాక అటు నితీశ్, ఇటు క్లాసెన్ జోరు ప్రదర్శించి జట్టును గెలుపు దిశగా తీసుకెళ్లారు. అనంతరం వేగంగా మ్యాచ్‌ను ముగించే క్రమంలో రైజర్స్ వెంటవెంటనే వికెట్లు కోల్పోయినా ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: అథర్వ (సి) సన్వీర్ (బి) నటరాజన్ 46; ప్రభ్‌సిమ్రన్ (సి) క్లాసెన్ (బి) విజయకాంత్ 71; రోసో (సి) సమద్ (బి) కమిన్స్ 49; శశాంక్ (రనౌట్) 2; జితేశ్ (నాటౌట్) 32; అశుతోష్ (సి) సన్వీర్ (బి) నటరాజన్ 2; శివమ్ సింగ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 214. వికెట్ల పతనం:** 1–97, 2–151, 3–174, 4–181, 5–187. **బౌలింగ్:** భువనేశ్వర్ 4–0–36–0, కమిన్స్ 4–0–36–1, నటరాజన్ 4–0–33–2, విజయకాంత్ 4–0–37–1 షహబాజ్ 1–0–13–0, నితీశ్ రెడ్డి 3–0–54–0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (బి) అర్ష్‌దీప్ 0; అభిషేక్ (సి) శివమ్ (బి) శశాంక్ 66; రాహుల్ త్రిపాఠి (సి) అర్ష్‌దీప్ (బి) హర్షల్ 33; నితీశ్ కుమార్ రెడ్డి (సి) శివమ్ (బి) హర్షల్ 37; క్లాసెన్ (బి) హర్‌ప్రీత్ 42; షహబాజ్ (సి) శశాంక్ (బి) అర్ష్‌దీప్ 3; సమద్ (నాటౌట్) 11; సన్వీర్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (19.1 ఓవర్లలో 6 వికెట్లకు) 215. వికెట్ల పతనం:** 1–0, 2–72, 3–129, 4–176, 5–197, 6–208. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–37–2, రిషి ధావన్ 3–0–35–0, హర్షల్ 4–0–49–2, చహర్ 4–0–43–0, హర్‌ప్రీత్ 3–0–36–1, శశాంక్ 1–0–5–1, అథర్వ 0.1–0–4–0.


అభిషేక్

వర్షంతో కోల్‌కతా, రాజస్తాన్ మ్యాచ్ రద్దు

రాయల్స్‌కు మూడో స్థానం ● రేపటి నుంచి ప్లే ఆఫ్స్

గువాహటి: ఈ ఐపీఎల్ సీజన్‌లో లీగ్ దశలోని చివరి మ్యాచ్ వర్షంతో రద్దయ్యింది. కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్తాన్ రాయల్స్‌ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌కు వాన అడ్డుగా నిలిచింది. రాత్రి పదిన్నరకు వర్షం తెరిపినిచ్చినట్లే కనిపించడంతో మైదానం పరిస్థితుల్ని పరిశీలించిన ఫీల్డు అంపైర్లు అనిల్ చౌదరి, సాయిదర్శన్ ఎట్టకేలకు 7 ఓవర్ల మ్యాచ్‌ను నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. వెంటనే టాస్ కూడా వేయగా... కోల్‌కతా టాస్ నెగ్గి ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో



ఆటగాళ్లు బరిలోకి దిగడమే తరువాయి అని ప్రేక్షకులు వేయికళ్లతో ఎదురుచూడగా ... మళ్లీ వానొచ్చి మ్యాచ్ రాతను మార్చింది. కటాఫ్ సమయం రాత్రి 10.56 గంటలకు చేసేదేమీ లేక అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో రాజస్తాన్, కోల్‌కతా చెరో పాయింట్‌తో సరిపెట్టుకున్నాయి. ఈ సీజన్‌లో రద్దయిన నాలుగో మ్యాచ్ ఇది. దీంతో ఇప్పటికే అగ్రస్థానాన్ని ఖాయం చేసుకున్న నైట్‌రైడర్స్‌కు ఏ నష్టం లేదు. కానీ వారం క్రితం దాకా 'టాప్'లో కొనసాగిన రాజస్తాన్ ఇప్పుడు మూడో స్థానానికి పడిపోయింది. హైదరాబాద్, రాజస్తాన్ జట్లు 17 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచినా... మెరుగైన రన్‌రేట్ కారణంగా హైదరాబాద్‌కు రెండో స్థానం ఖరారైంది. ఆఖరి పోరులో నెగ్గి కనీసం రెండో స్థానంలో నిలిచి క్వాలిఫయర్–1, ఓడితే క్వాలిఫయర్–2 ఆడాల్సిన రాజస్తాన్ చివరకు రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో ఎలిమినేటర్‌లో పోరాడాల్సిన పరిస్థితి వచ్చింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.రే
కోల్‌కతా	14	9	3	2	20	1.428
హైదరాబాద్	14	8	5	1	17	0.414
రాజస్తాన్	14	8	5	1	17	0.273
బెంగళూరు	14	7	7	0	14	0.459
చెన్నై	14	7	7	0	14	0.392
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
లక్నో	14	7	7	0	14	-0.667
గుజరాత్	14	5	7	2	12	-1.063
పంజాబ్	14	5	9	0	10	-0.353
ముంబై	14	4	10	0	8	-0.318

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్ ప్లే ఆఫ్స్ షెడ్యూల్

మే 21: క్వాలిఫయర్-1
కోల్‌కతా నైట్‌రైడర్స్ X సన్‌రైజర్స్ హైదరాబాద్
వేదిక: అహ్మదాబాద్; రాత్రి గం. 7:30 నుంచి

మే 22: ఎలిమినేటర్
బెంగళూరు X రాజస్తాన్ రాయల్స్
వేదిక: అహ్మదాబాద్; రాత్రి గం. 7:30 నుంచి

మే 24: క్వాలిఫయర్-2
క్వాలిఫయర్-1లో ఓడిన జట్టు X ఎలిమినేటర్ విజేత
వేదిక: చెన్నై; రాత్రి గం. 7:30 నుంచి

మే 26: ఫైనల్
క్వాలిఫయర్-1 విజేత X క్వాలిఫయర్-2 విజేత
వేదిక: చెన్నై; రాత్రి గం. 7:30 నుంచి

అనిరుధ్ జోడీకి టైటిల్


అనిరుధ్, అర్జున్

ఒయిరస్ (పోర్చుగల్): హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ తన కెరీర్‌లో నాలుగో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్ సాధించాడు. పోర్చుగల్‌లో జరిగిన ఒయిరస్ ఓపెన్–4 ఏటీపీ చాలెంజర్–75 టోర్నీలో అనిరుధ్–అర్జున్ ఖడే (భారత్) జోడీ విజేతగా నిలిచింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో అనిరుధ్–అర్జున్ జంట 7–5, 6–4తో సిమోన్ ఫ్రెయుండ్ (స్వీడన్)–జాన్స్ ఇంగిల్డ్‌సన్ (డెన్మార్క్) ద్వయంపై గెలిచింది. అనిరుధ్–అర్జున్ జోడీకి 4,250 యూరోల (రూ. 3 లక్షల 84 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 75 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. అర్జున్ కెరీర్‌లో ఇది ఏడో డబుల్స్ టైటిల్ కావడం విశేషం. ఈ గెలుపుతో నేడు విడుదల చేసే ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో అనిరుధ్, అర్జున్ మళ్లీ టాప్–100లోకి వస్తారు.

విజేత సాత్విక్–చిరాగ్ జోడీ

థాయ్‌లాండ్ ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ సొంతం


సాత్విక్ చిరాగ్

బ్యాంకాక్: ఈ ఏడాది తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి రెండో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం ముగిసిన థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో సాత్విక్–చిరాగ్ ద్వయం విజేతగా నిలిచింది. 46 నిమిషాలపాటు జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో టాప్ సీడ్ సాత్విక్–చిరాగ్ జంట 21–15, 21–15తో ప్రపంచ 29వ ర్యాంక్ జోడీ చెన్ బో యి ఆంగ్–లియు యి (చైనా)పై గెలిచింది. సాత్విక్–చిరాగ్‌లకు 33,180 డాలర్ల (రూ. 27 లక్షల 63 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 9200 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ సీజన్‌లో ఐదు టోర్నీలు ఆడిన సాత్విక్–చిరాగ్ ఫ్రెంచ్ ఓపెన్ సూపర్–750 టోర్నీలో టైటిల్ నెగ్గి... మలేసియా సూపర్–1000, ఇండియా ఓపెన్ సూపర్–750 టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచారు. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో ప్రీక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగారు.

విద్య, ఉద్యోగ సమాచారం

నిమ్‌హాన్స్ బెంగళూరులో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ (నిమ్‌హాన్స్).. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

- బీఎస్సీ అనెస్తీషియా టెక్నాలజీ–11 సీట్లు.
- బీఎస్సీ నర్సింగ్–85 సీట్లు.
- బీఎస్సీ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ–11 సీట్లు.
- బీఎస్సీ క్లినికల్ న్యూరోఫిజియాలజీ టెక్నాలజీ–07 సీట్లు.
- సర్టిఫికెట్ల కోర్సు–న్యూరోపాథాలజీ టెక్నాలజీ–02 సీట్లు.
- పోస్ట్ బేసిక్ డిప్లొమా ఇన్ సైకియాట్రిక్/మెంటల్ హెల్త్ నర్సింగ్–45 సీట్లు.
- పోస్ట్ బేసిక్ డిప్లొమా ఇన్ న్యూరోసైన్స్ నర్సింగ్–09 సీట్లు.
- **అర్హత:** కోర్సును అనుసరించి 12వ తరగతి(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్), డిప్లొమా, డిగ్రీ,రిజిస్టర్డ్ నర్స్, బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** బీఎస్సీ కోర్సుకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. సర్టిఫికేట్ కోర్సుకు గరిష్ఠంగా 40 ఏళ్లు, పోస్ట్ బేసిక్ డిప్లొమా కోర్సులకు వయో పరిమితి లేదు.
- **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, ఒరిజినల్ సర్టిఫికేట్ల వెరిఫికేషన్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.06.2024
- **బీఎస్సీ కోర్సుల ప్రవేశ పరీక్ష తేది:** 21.07.2024
- **వెబ్‌సైట్:** https://nimhans.ac.in

తెలంగాణలో డిస్ట్రిక్ట్ జడ్జి పోస్టులు

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ.. తొమ్మిది జిల్లా జడ్జి(ఎంట్రీ లెవల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 09
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణుల వ్వాలి. తెలంగాణ జ్యుడీషియల్ నియమ నిబంధనల ప్రకారం నిర్దేశించిన అర్హతలు కలిగి ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.1,44,840 నుంచి రూ.1,94,660.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చీఫ్ సెక్రటరీ ఆఫీస్, తెలంగాణ, సెక్రటేరియట్, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తు ప్రారంభతేది:** 14.05.2024.
- **దరఖాస్తులకు చివరితేది:** 13.06.2024.
- **రాతపరీక్ష తేది:** 24.08.2024, 25.08.2024.
- **వెబ్‌సైట్:** https://tshc.gov.in

ఇగ్నోలో యూజీ, పీజీ, సర్టిఫికేట్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్శిటీ(ఇగ్నో).. జూలై సెషన్ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ, పీజీ, సర్టిఫికేట్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

- **యూజీ కోర్సులు:** బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీఎల్ఐఎస్ తదితరాలు.
- **పీజీ కోర్సులు:** ఎంఏ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ తదితరాలు.
- **డిప్లొమా కోర్సులు:** డీఈసీఈ, డీఎస్‌హెచ్ఈ, డీపీఎల్ఏడీ, డీఈవీఎంటీ, డీఏపీఎంఈటీ, డీఏపీఎంఈఆర్ఏ, డీటీఎస్, డీసీఈ, డీయూఎల్ తదితరాలు.
- **పీజీ డిప్లొమా కోర్సులు:** పీజీడీఆర్‌డీ, పీజీడీసీఏఫ్‌టీ, పీజీడీటీ, పీజీడీఎస్‌హెచ్ఎస్‌టీ, పీజీడీఐబీఓ, పీజీడీఏఎస్‌టీ, పీజీడీఈఎస్‌డీ తదితరాలు.
- **పీజీ సర్టిఫికేట్ కోర్సులు:** పీజీసీసీఎల్, పీజీసీపీపీ, పీజీసీసీసీ, పీజీసీజీఐ, పీజీసీఐఎన్‌డీఎస్, పీజీసీఏపీ, పీజీసీజీపీఎస్, పీసీసీబీహెచ్‌టీ తదితరాలు.
- **అడ్వాన్స్‌డ్ సర్టిఫికేట్ కోర్సులు:** ఏసీఐఎస్ఈ, ఏసీపీడీఎం.
- **సర్టిఫికేట్ కోర్సులు:** సీఎల్ఐఎస్, సీడీఎం, సీఈఎస్, సీఎల్‌టీఏ, సీపీఎస్‌సీఎం, సీఎఫ్ఎన్, సీఏన్‌సీసీ, సీఆర్‌డీ, సీఏపీఎంఈఆర్, సీఐజీ తదితరాలు.
- **అవేర్‌నెస్ అండ్ అప్రిసియేషన్ కోర్సులు:** ఏపీడీఎఫ్,ఏసీఈ, ఏసీపీఎస్‌డీ.
- **ప్రోగ్రామ్ విధానం:** ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్(ఓడీఎల్), ఆన్‌లైన్ ప్రోగ్రామ్.
- **అర్హత:** కోర్సును అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి, ఐటీఐ, 10+2, బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికేట్ ఉత్తీర్ణులై ఉండాలి.
- **కోర్సు వ్యవధి:** యూజీ–మూడు లేదా నాలుగేళ్లు, పీజీ–రెండేళ్లు, పీజీ డిప్లొమా /డిప్లొమా–ఏడాది, పీజీ సర్టిఫికేట్/సర్టిఫికేట్–6 నెలలు, అవేర్‌నెస్–2/3 నెలలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 13.05.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.06.2024
- **వెబ్‌సైట్:** http://www.ignou.ac.in

» సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ 2024 నోటిఫికేషన్ విడుదల
» ప్రముఖ పరిశోధన కేంద్రాల్లో జేఆర్ఎఫ్ అవకాశం
» అధ్యాపక వృత్తి, పీహెచ్‌డీలో ప్రవేశానికి మార్గం
» జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే నెలకు రూ.37వేల స్టైపెండ్

సైన్స్‌లో బోధన, పరిశోధన!

సైన్స్ రంగంలో బోధన, పరిశోధనలకు మార్గం.. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్! ఈ పరీక్షలో ప్రతిభ చూపితే.. జేఆర్ఎఫ్, పీహెచ్‌డీలో ప్రవేశంతో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకానికి అర్హత లభిస్తుంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన సీఎస్ఐఆర్ నెట్‌ను ప్రతి ఏటా జూన్, డిసెంబర్‌లో నిర్వహిస్తారు. ఇటీవల సీఎస్ఐఆర్-యూజీసీ నెట్-2024 జూన్‌కు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. సీఎస్ఐఆర్ నెట్‌తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ గైడెన్స్...


సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ 2024

సీఎస్ఐఆర్, యూజీసీ నెట్‌ను సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీలు) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. పరీక్ష మాత్రం ఎన్‌ఏటీ ఆధ్వర్యంలో జరుగుతుంది. సైన్స్ రంగంలో పరిశోధనలు, బోధన రంగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఉమ్మడి పరీక్ష.. సీఎస్ఐఆర్ యూజీసీ నెట్.

అయిదు విభాగాలు

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌ను మొత్తం అయిదు విభాగాల్లో నిర్వహిస్తారు. అవి.. కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్ సైన్సెస్, ఓషియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) పొందేందుకు అర్హత లభిస్తుంది. అంతేకాకుండా సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీలో చేరొచ్చు. అదే విధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టేందుకు అర్హత లభిస్తుంది.

అర్హతలు

- కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్, నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్, బీఎస్సీ ఆనర్స్ ఉత్తీర్ణత ఉండాలి. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.
- రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు ఆయా కోర్సుల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది. పీహెచ్‌డీలో ప్రవేశం కేటగిరీకి దరఖాస్తు చేసుకున్న వారు నెట్ ఫలితాలు వచ్చిన ఏడాది లోపు పీజీ పూర్తి చేసుకోవాలి.

వయసు

- జేఆర్ఎఫ్ అభ్యర్థులకు వయసు 2024, జూన్ 1 నాటికి 30ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ-ఎన్‌సీఎల్, పీడబ్ల్యూడీ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో అయిదేళ్ల సడలింపు ఇస్తారు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ నియామకం, పీహెచ్‌డీలో ప్రవేశాల కేటగిరీ అభ్యర్థులకు ఎలాంటి గరిష్ఠ వయో పరిమితి నిబంధన లేదు.

మూడు కేటగిరీలుగా పరీక్ష

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌ను మూడు కేటగిరీలుగా నిర్వహిస్తారు. అవి..

- **కేటగిరీ–1:** అవార్డ్ ఆఫ్ జేఆర్ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అపాయింట్‌మెంట్.
- **కేటగిరీ–2:** అపాయింట్‌మెంట్ యాజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీలోకి ప్రవేశం.
- **కేటగిరీ–3:** కేవలం పీహెచ్‌డీలో ప్రవేశం.
- అభ్యర్థులు దరఖాస్తు సమయంలో తమ అర్హతలు, ఆసక్తికి అనుగుణంగా కేటగిరీని ఎంచుకోవాల్సి ఉంటుంది. దీని ప్రకారం పరీక్ష పేపర్లను నిర్దేశిస్తారు.

జేఆర్ఎఫ్‌తో పీహెచ్‌డీ

- కేటగిరీ 1లో ఉత్తీర్ణతతో జేఆర్ఎఫ్‌కు ఎంపికైన వారికి పీహెచ్‌డీలో ప్రవేశానికి కూడా అర్హత లభిస్తుంది. వీరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకానికి కూడా అర్హులే.
- కేటగిరీ–2, 3లలో ఉత్తీర్ణత ఆధారంగా ఆయా యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌ల్లో పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. మలిదశలో ఇంటర్వ్యూ, వైవా ఉంటుంది. సీఎస్ఐఆర్-యూజీసీ-నెట్ స్కోర్‌కు 70 శాతం వెయిటేజీ, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ కల్పించి.. పీహెచ్‌డీ ప్రవేశాలు ఖరారు చేస్తారు.

జేఆర్ఎఫ్‌కు ఎంపిక

- సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌లో విజయం సాధించి నిర్దేశిత ఇన్‌స్టిట్యూట్‌లు లేదా రీసెర్చ్ లేబొరేటరీల్లో పరిశోధనల దిశగా ప్రవేశం పొందిన అభ్యర్థులకు రెండేళ్లపాటు నెలకు రూ.37 వేలు చొప్పున జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్), రెండేళ్లపాటు ప్రతి ఏటా రూ.20 వేల చొప్పున కాంటింజెంట్ గ్రాంట్ కూడా లభిస్తుంది.
- రెండేళ్ల తర్వాత పీహెచ్‌డీకి నమోదు చేసుకుంటే.. సీనియర్ రీసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్)గా పరిగణిస్తూ నెలకు రూ.42 వేలు చొప్పున ఫెలోషిప్ లభిస్తుంది. ఇలా గరిష్ఠంగా మొత్తం అయిదేళ్ల పాటు జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌లు లభిస్తాయి. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు తొలి రెండేళ్లు ఎలాంటి ఫెలోషిప్ లభించదు. రెండేళ్లలోపు పీహెచ్‌డీ లేదా ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో పేరు నమోదుకు అర్హత పొందితేనే జేఆర్ఎఫ్ లభిస్తుంది.

అసిస్టెంట్ ప్రొఫెసర్

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ఉత్తీర్ణతతో అధ్యాపక వృత్తిలో చేరే అవకాశం లభిస్తుంది. యూజీసీ నిబంధనల ప్రకారం-ఉన్నత విద్యా సంస్థల్లో లెక్చరర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలకు సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. వీరికి యూజీసీ నిర్దేశించిన పే స్కేల్‌కు అనుగుణంగా వేతనాలు అందించాల్సి ఉంటుంది.

200 మార్కులకు పరీక్ష

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ పరీక్షను మొత్తం అయిదు విభాగా(కెమికల్ సైన్సెస్; -ఎర్త్, అట్మాస్ఫియరిక్ సైన్సెస్, ఓషియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్; -లైఫ్ సైన్సెస్, -మ్యాథమెటికల్ సైన్సెస్, -ఫిజికల్ సైన్సెస్)ల్లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష మూడు పార్ట్‌లుగా మొత్తం 200 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది.

- ఇందులో పార్ట్ ఏ అందరికీ కామన్‌గా ఉంటుంది. ఇది జనరల్ ఆప్టిట్యూడ్ విభాగం. ఇందులో లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలసిస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్, సిరీస్ ఫార్మేషన్, పజిల్స్ తదితరాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- పార్ట్ బీలో సంబంధిత సబ్జెక్ట్ ఆధారిత ప్రశ్నలు మల్టిపుల్ ఛాయిస్ విధానం (ఎంసీక్యూస్)లో ఉంటాయి. పార్ట్ సీ కూడా సదరు సబ్జెక్టు సంబంధిత విభాగమే. ఇందులో అడిగే ప్రశ్నలు అభ్యర్థి సైన్స్ కాన్సెప్ట్స్‌ను లోతుగా పరిశీలించేలా ఉంటాయి.
- పరీక్ష మూడు గంటల వ్యవధిలో ఉంటుంది. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులను తగ్గిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, మే 21
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** 2024, మే 25, 26, 27.
- **సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ తేదీలు:** 2024, జూన్ 25, 26, 27.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://csirnet.nta.nic.in/, www.nta.ac.in

బెస్ట్ స్కోర్‌కు ఇలా

పార్ట్-ఎ (జనరల్ ఆప్టిట్యూడ్)

అయిదు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడి విభాగం జనరల్ ఆప్టిట్యూడ్. ఇందులో స్కోర్ సాధించేందుకు తార్కిక విశ్లేషణ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, పజిల్స్ తదితర అంశాలపై పట్టు సాధించాలి. అదే విధంగా బేసిక్ జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్ అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

పార్ట్-బి

ఈ విభాగంలో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇవి పూర్తిగా మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటాయి. అభ్యర్థులు తమ అకడమిక్ స్థాయి పుస్తకాలను పూర్తిగా అధ్యయనం చేయడం, అన్వయ దృక్పథంతో ప్రాక్టీస్ చేయడం ద్వారా ఇందులో మంచి మార్కులు పొందొచ్చు.

పార్ట్-సి

ఇందులోనూ అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ సంబంధిత ప్రశ్నలే ఉంటాయి. వీటి క్లిష్టత స్థాయి అధికంగా ఉంటుంది. అభ్యర్థుల్లోని శాస్త్రీయ భావనలపై అవగాహన, శాస్త్రీయ భావనలను అన్వయించే నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి.

పీజీ స్థాయి పుస్తకాలు

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌లలో పీజీ స్థాయిలో పూర్తి అవగాహన పొందాలి. ముఖ్యంగా రీసెర్చ్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. తమ సబ్జెక్ట్‌లకు సంబంధించి ప్రస్తుతం ఉన్న సమస్యలు, వాటి పరిష్కారం దిశగా ఉపయోగపడే పరిశోధనలపై అవగాహన పెంచుకుంటే.. పార్ట్-సిలో రాణించేందుకు మార్గం సుగమం అవుతుంది. అధ్యయనం చేసేటప్పుడే రీసెర్చ్ ఓరియెంటేషన్ అలవర్చుకోవడం లాభిస్తుంది. పార్ట్-ఎలో అడిగే జనరల్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి కూడా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తాజా పరిశోధనలు , వాటి ఫలితాలు, సంబంధిత శాస్త్రవేత్తల గురించి అవగాహన పొందాలి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)	
సెన్సెక్స్ ▲ 89	74,006
నిఫ్టీ ▲ 36	22,502

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి


విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	16,686	▽	12
డోజోన్స్	40,004	△	134
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,420	▽	18
డాక్స్	18,704	▽	34
షాంఘై	3,154	△	32
నికాయ్	38,787	▽	133

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.10	84.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.57	107.12
€	యూరో	ఎస్‌బీఐ	89.63	91.99
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.06	54.23
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.76	56.70
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.54	64.19
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.33	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.08	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.41	12.48

బీమా పాలసీ.. అత్యవసర నిధి!

ఉన్నట్టుండి నిధుల అవసరం ఏర్పడిందా..? వ్యక్తిగత రుణానికి తక్కువ క్రెడిట్ స్కోర్ అడ్డు పడుతోందా? లేదంటే వ్యక్తిగత రుణంపై అధిక వడ్డీ రేటు చూసి వెనుకాడుతున్నారా..? ఇలాంటి సందర్భాల్లో బీమా పాలసీయే మిమ్మల్ని ఆదుకుంటుంది. అదెలా అంటారా? ఎండోమెంట్ బీమా ప్లాన్లపై బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు రుణ సదుపాయం కల్పిస్తున్నాయి. పైగా పర్సనల్ లోన్‌తో పోలిస్తే వడ్డీ రేటు తక్కువే. డబ్బులు అవసరం పడితే బీమా పాలసీని సరెండ్ చేసే వారూ ఉన్నారు. ఇలా ఇన్సూరెన్స్ పాలసీని సరెండర్ చేయడానికి బదులు, దానిపై రుణం తీసుకుని అవసరం గట్టెక్కడమే మంచి మార్గం అవుతుంది. దీనివల్ల బీమా రక్షణను ఎప్పటి మాదిరే కొనసాగించుకోవచ్చు. ఇది ఎలా పనిచేస్తుందన్నది తెలియజేసే కథనమే ఇది.





రుణ సదుపాయం అన్ని రకాల బీమా పాలసీలపై వస్తుందనుకుంటే పొరపాటు. కేవలం కొన్ని రకాల పాలసీలకే ఇది పరిమితం. ''పొదుపుతో కూడిన సంప్రదాయ బీమా పాలసీ (ఎండోమెంట్, మనీ బ్యాక్ ప్లాన్లు) కలిగి ఉన్నవారు వాటిపై పలు రకాల ఆర్థిక అవసరాల కోసం రుణాన్ని పొందొచ్చు''అని ఏజెస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో విఘ్నేష్ సహానే తెలిపారు. టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు కేవలం మరణ పరిహారాన్నే అందిస్తాయని, ఎలాంటి రాబడి హామీ ఉండదు కనుక వాటిపై రుణం పొందలేరని స్పష్టం చేశారు. యూనిట్ లింక్డ్ ప్లాన్ల (యులిప్)లోనూ రాబడులు మార్కెట్‌పై ఆధారపడి ఉంటాయి కనుక వాటిపైనా రుణ సదుపాయం ఉండదని తెలిపారు.

ఎక్కడ తీసుకోవచ్చు?

పాలసీ మంజూరు చేసిన జీవిత బీమా కంపెనీ నుంచే రుణం తీసుకునే వెసులుబాటు ఉంది. నేడు చాలా బీమా సంస్థలు పాలసీలపై రుణాలను కూడా ఇస్తున్నాయి. అలాగే, బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ తరహా రుణాలను ఆఫర్ చేస్తుంటాయి. అయితే, బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల కంటే పాలసీ మంజూరు చేసిన బీమా సంస్థను సంప్రదించడమే మెరుగైన మార్గమని నిపుణులు అంటున్నారు. ''ఇన్సూరెన్స్ కంపెనీతో పోలిస్తే బ్యాంక్‌లు బీమా ప్లాన్లపై తక్కువ రుణ మొత్తాన్ని ఆఫర్ చేస్తాయి. అదే మాదిరి బీమా సంస్థలతో పోలిస్తే బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు రుణాలపై కొంచెం అధిక రేటును వసూలు చేస్తుంటాయి''అని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ 'ప్లాన్ ఆర్' వ్యవస్థాపకుడు అజయ్ ప్రుతి తెలిపారు. బ్యాంక్‌లు సాధారణంగా బీమా పాలసీపై రుణాన్ని నేరుగా కాకుండా.. కరెంట్ అకౌంట్‌పై ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయం కింద అందిస్తుంటాయి. ''తరచుగా నిధుల అవసరం ఏర్పడే వారు ఇలా కరెంట్ అకౌంట్‌పై (సెక్యూరిటీ కింద బీమా పాలసీ జమ చేసి) ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం తీసుకోవడాన్ని పరిశీలించొచ్చని పైసా బజార్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సహిల్ అరోరా సూచించారు.

- నిధులు కావాలంటే పాలసీపై రుణం తీసుకునే సదుపాయం
- వడ్డీ రేటు చాలా తక్కువ
- బీమా రక్షణ కొనసాగించుకోవచ్చు

''బీమా పాలసీలపై రుణ రేటు చాలా తక్కువగా ఉండడాన్ని గమనించొచ్చు. సాధారణంగా వీటిపై 9–9.5 శాతం వార్షిక వడ్డీ రేటును వసూలు చేస్తుంటారు. అదే వ్యక్తిగత రుణాలు (పర్సనల్ లోన్) అయితే 12 శాతం అంతకంటే ఎక్కువే ఉంటుంది''అని బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాజేష్ కృష్ణన్ తెలిపారు. ఇక బీమా పాలసీలపై రుణం ఎంతొస్తుందంటే.. రుణం తీసుకునే నాటికి ఉన్న స్వాధీనపు విలువ (సరెండర్ వ్యాల్యూ)లో 90 శాతం వరకు. బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి రుణం మంజూరునకు సాధారణంగా నాలుగు నుంచి ఏడు రోజులు పడుతుంది. అదే బీమా సంస్థల నుంచి రుణం మూడు రోజుల్లోనే పొందొచ్చు. కొన్ని బీమా సంస్థలు ఇంతకంటే వేగంగా ఆన్‌లైన్‌లోనే పాలసీలపై రుణాలను మంజూరు చేస్తున్నాయి. ''జీవిత బీమా పాలసీలపై రుణం దరఖాస్తు మదింపు, రుణం మంజూరు చాలా వేగంగా ఉంటుంది. బీమా సంస్థ నుంచే రుణం తీసుకునేట్టు అయితే ఎలాంటి అదనపు తనిఖీలు, పరిశీలనలు అవసరం పడవు''అని రాజేష్ కృష్ణన్ వివరించారు. బీమా పాలసీపై రుణం తీసుకోవడం ఎంతో సౌకర్యమైనదిగా పాలసీఎక్స్ సీఈవో నావల్ గోయల్ సైతం అంగీకరించారు. ''దరఖాస్తు చేసుకోవడం ఎంతో సులభం. తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్న వారు సైతం పాలసీపై రుణానికి అర్హులే. ఎందుకంటే పాలసీపై రుణం జారీకి క్రెడిట్ స్కోర్ తనిఖీలు అవసరం పడవు''అని కృష్ణన్ తెలిపారు. ఈ రుణం తిరిగి చెల్లింపు నిబంధనలు కూడా సులభమే. ''రుణం చెల్లించడం వీలు కానప్పుడు కేవలం రుణంపై వడ్డీ వరకే చెల్లించొచ్చు. అసలు రుణాన్ని ఎప్పుడైనా తిరిగి తీర్చివేయవచ్చు''అని ప్రుతి వివరించారు. ఎంత వీలైతే అంత అసలు రుణంలో చెల్లించుకుంటూ వెళ్లడం కూడా మంచి ఆలోచనే. దీనివల్ల ప్రతి నెలా చెల్లించే వడ్డీ భారాన్ని తగ్గించుకోవచ్చు.

చౌక రుణం



తిరిగి చెల్లించలేకపోతే

లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలపై ఉన్న మరో అనుకూలత ఏమిటంటే.. రుణాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనా అది క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేయబోదని కృష్ణన్ తెలిపారు. రుణంలో అసలు, వడ్డీ, చార్జీలు అన్నింటినీ పాలసీ సరెండర్ వ్యాల్యూ నుంచి బీమా సంస్థలు సర్దుబాటు చేసుకుంటాయని సహిల్ అరోరా తెలిపారు. రుణం చెల్లించకుండా పాలసీదారు మరణించిన సందర్భాల్లో.. పరిహారం నుంచి రుణం, వడ్డీ, చార్జీలను మినహాయించుకుని, మిగిలిన మొత్తాన్ని బీమా సంస్థ నామినీ లేదా పాలసీదారు వారసులకు చెల్లిస్తుంది. రుణం తీర్చకుండానే పాలసీ గడువు ముగిసిపోయిందనుకుంటే.. అప్పుడు నికరంగా చెల్లించే మొత్తం నుంచి రుణాన్ని బీమా సంస్థ వసూలు చేసుకుంటుంది. ఒకవేళ రుణంపై వడ్డీ కూడా బకాయి పడితే.. అసలు, వడ్డీ మొత్తం సరెండర్ వ్యాల్యూని దాటిపోతుంటే అప్పుడు పాలసీని బీమా సంస్థ రద్దు చేస్తుంది. పాలసీపై రుణం తీసుకునే సమయంలోనే దానిపై బీమా సంస్థకు హక్కులు బదలాయిస్తున్నట్టు అంగీకారాన్ని తీసుకుంటాయి.



ఆరంభంలో తక్కువే

లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్న కొత్తలో దీనిపై వచ్చే రుణం చాలా స్వల్పం. ఇందులో ఉన్న ప్రతికూలత ఇదే. క్యాష్ వ్యాల్యూ లేదా సరెండర్ వ్యాల్యూ గణనీయంగా పెరిగేందుకు కొన్నేళ్లు పడుతుంది. అప్పుడే చెప్పుకోతగ్గ మేర రుణం దీనిపై వస్తుంది. ఇక ఎండోమెంట్ లేదా మనీ బ్యాంక్ పాలసీలపై దీర్ఘకాలంలో వచ్చే రాబడి 5–6 శాతం మేర ఉంటుంది. దీనిపై రుణం తీసుకుంటే, నికరంగా అందుకునే రాబడి ప్రయోజనం మరింత తగ్గిపోతుందని గుర్తు పెట్టుకోవాలి.

రుణం సమంజసమేనా..?

అసలు జీవిత బీమా ఎందుకు? ఆర్జించే వ్యక్తికి దురదృష్టవశాత్తూ ఏదైనా వాటిల్లితే అప్పుడు అతనిపై ఆధారపడిన కుటుంబం ఆర్థికంగా కష్టాలు పడకూడదనే. తాను లేకపోయినా, తన కుటుంబ అవసరాలను తీర్చే లక్ష్యంతోనే లైఫ్ ఇన్సూరెన్స్ కవరేజీని తీసుకుంటుంటారు. మరి అలాంటి సాధనంపై రుణం తీసుకుంటే, అసలు ప్రయోజనానికే భంగం కలగొచ్చని నిపుణుల భావన. అదెలా అంటే పాలసీపై రుణం తీసుకున్న తర్వాత సదరు పాలసీదారు అనుకోకుండా మరణం పాలైతే.. కుటుంబానికి దక్కే బీమా పరిహారం పెద్దగా ఉండకపోవచ్చు. దాంతో బీమా ఉద్దేశ్యం నెరవేరకుండా పోతుంది. అందుకని బంగారం, మ్యూచువల్ ఫండ్స్, ప్రాపర్టీ తదితర ఇతర సాధనాలపై రుణం తీసుకోవడాన్ని పరిశీలించొచ్చని చెబుతుంటారు. కానీ, ఇక్కడ వాస్తవ అంశం ఏమిటంటే.. బంగారంపై రుణం తీసుకున్న తర్వాత సదరు వ్యక్తి మరణించినా కానీ, ఆ అప్పు తీర్చాల్సిన బాధ్యత కుటుంబంపైనే పడుతుంది. అందుకని ఏ సాధనంపై రుణం తీసుకున్నా పరిణామం ఒక్కటిగానే ఉంటుంది. అందుకని దీనికి పరిష్కారం ఒకటి ఉంది. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి ఏదైనా అవసరం కోసం రుణం తీసుకుంటుంటే, వెంటనే అంత విలువకు టర్మ్ ఇన్సూరెన్స్ కవరేజీని పెంచుకోవడం లేదంటే అదనపు కవరేజీతో టర్మ్ ప్లాన్ కొనుగోలు చేయడం మంచిది. దీనివల్ల అనుకోనిది జరిగినా వచ్చే పరిహారంతో రుణాలను గట్టెక్కొచ్చు. ఇక దీర్ఘకాల అవసరాలకు కాకుండా స్వల్పకాల అవసరాలకే బీమాపై రుణానికి పరిమితం కావాలి. మూడు నుంచి ఆరు నెలలు మించకూడదు. ఎందుకంటే ఇంత తక్కువ కాలానికి చెల్లించాల్సిన వడ్డీ భారం కూడా చాలా తక్కువే ఉంటుంది. కనుక ఒకవేళ పాలసీదారు మరణించినా కుటుంబం పెద్దగా నష్టపోయేది ఉండదు. బీమా సంస్థ తనకు రావాల్సినంత మేర మినహాయించుకుని, మిగిలినది చెల్లించేస్తుంది. ఎండోమెంట్ ప్లాన్ ఉన్న వారు విధిగా మెరుగైన కవరేజీతో టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ తప్పకుండా తీసుకోవాలి. అప్పుడు కుటుంబానికి మెరుగైన ఆర్థిక రక్షణ ఉంటుంది.



అత్యవసర నిధి



బీమా పాలసీ అత్యవసర నిధిగానూ అక్కరకొస్తుంది. ప్రతి కుటుంబానికి విధిగా అత్యవసర నిధి ఉండాలి. అనుకోని పరిణామాలతో నెలవారీ వచ్చే ఆదాయం ఆగిపోతే? చేస్తున్న ఉద్యోగం ఊడిపోతే..? అక్కడి నుంచి తిరిగి ఉపాధి లభించేంత వరకు కుటుంబ అవసరాలను తీర్చేందుకు అత్యవసర నిధి ఉపయోగపడుతుంది. కనీసం ఆరు నెలల నుంచి ఏడాది అవసరాలను తీర్చేంత అత్యవసర నిధి ఏర్పాటు చేసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తుంటారు. అయితే, ప్రతి ఒక్కరికీ ఇంత మొత్తం అత్యవసర నిధి కింద ఏర్పాటుకు వెసులుబాటు ఉండకపోవచ్చు. ఇలాంటి వారు ఎండోమెంట్ లేదా మనీబ్యాక్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలను అత్యవసర నిధి కింద ఉపయోగించుకోవచ్చు. తిరిగి ఉపాధి ఏర్పడి, ఆదాయం చేతికి అందేంత వరకు పాలసీపై రుణంతో అవసరాలను గట్టెక్కొచ్చు. ఆ తర్వాత క్రమంగా ఆరు నెలల్లోపు పాలసీపై రుణాన్ని తీర్చివేయడం మంచి ఆలోచన అవుతుంది.


పాలసీ సరెండర్ అంటే?

ఎండోమెంట్ లేదా మనీ బ్యాక్ బీమా ప్లాన్ వద్దనుకునే వారు దాన్ని సరెండర్ చేసుకోవచ్చు. అంటే గడువు ముగియకుండానే పాలసీని వెనక్కి చేయడం. పాలసీ తీసుకున్న తర్వాత ఎంత కాలానికి సరెండర్ చేస్తున్నారనే దాని ఆధారంగా దానిపై ఎంతొస్తుందన్నది ఆధారపడి ఉంటుంది. ఈ సరెండర్ వ్యాల్యూ (స్వాధీనపు విలువ) విషయంలో బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) 2024 ఏప్రిల్ 1 నుంచి నూతన నిబంధనలు తీసుకొచ్చింది. వీటి ప్రకారం బీమా పాలసీ తీసుకున్న మూడేళ్లలోపు సరెండర్ చేస్తే చేతికి చాలా తక్కువే వస్తుంది. అంటే అప్పటికి కట్టిన ప్రీమియంలో సగం కూడా రాదు. అదే పాలసీ తీసుకున్న తర్వాత నాలుగేళ్ల నుంచి ఏడేళ్లలోపు సరెండర్ చేస్తే అధిక విలువ పాలసీదారుకు దక్కుతుంది. నిజానికి ఎండోమెంట్, మనీబ్యాక్ పాలసీల్లో 20–30 ఏళ్లపాటు కొనసాగినప్పుడే ప్రతిఫలం కనిపిస్తుంది. ఇంతకంటే తక్కువ కాలవ్యవధిపై వచ్చే ప్రయోజనం అంతగా ఉండదు. అందుకని నిధుల అవసరం ఏర్పడితే బీమా ప్లాన్‌ను సరెండర్ చేయడానికి బదులు.. దానిపై రుణం పొందడమే మెరుగైనది అవుతుంది. మళ్లీ నిధుల వెసులుబాటు వచ్చిన వెంటనే తీసుకున్న రుణాన్ని తీర్చివేయాలి.



అదానీ పోర్ట్స్ | బీఎన్‌పీ పరిబాస్ | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ



ప్రస్తుత ధర: రూ. 1,339 టార్గెట్: రూ. 1,562
ఎందుకంటే: ప్రయివేట్ రంగ మౌలిక దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ గత కొన్నేళ్లుగా మార్కెట్ వాటాను పెంచుకుంటూ వస్తోంది. ఓవైపు కంపెనీ నిర్వహణలోని గుజరాత్ పోర్టులు, మరోవైపు సహేతుక విలువల్లో వ్యూహాత్మక కొనుగోళ్లు ఇందుకు మద్దతునిస్తున్నాయి. ఇతర పోర్టులను సొంతం చేసుకున్నాక వీటిని లాభాల బాట పట్టించడం ద్వారా మార్కెట్ వాటాను బలపరచుకుంటోంది. వెరసి కొత్త ఆస్తులను కొనుగోలు చేయడంలో భాగంగా మార్కెట్ వాటా పెంపు కొనసాగనున్నట్లు భావిస్తున్నాం. కరైకాల్, డిఘీ పోర్టుల నిర్వహణను టర్న్‌అరౌండ్‌కు చేర్చనున్న అంచనాలు దీనికి కారణం. అంతేకాకుండా కొత్త పోర్టులు విజింజమ్, కొలంబో, హాల్దియా.. వీటికి జత కలవనున్నాయి. ఇప్పటికే కంపెనీ ఇజ్రాయెల్‌లోని హైఫాలో కార్యకలాపాలు విస్తరించింది. ప్రతిపాదిత భారత్ మధ్యప్రాచ్య కారిడార్(ఐఎంఈసీ)లో ఇది ఒక భాగంకాగా, యూరోపియన్ యూనియన్(ఈయూ)లోనూ కొనుగోళ్లు చేపడితే.. భౌగోళిక, రాజకీయ అనిశ్చిత పరిస్థితులున్న ఎర్రసముద్రం- సూయజ్ ప్రాంతానికి బదులుగా కార్గో రవాణాను ఐఎంఈసీకి మళ్లించే అవకాశముంది. ఇది కార్గో పరిమాణం పెరిగేందుకు దోహదపడనుంది. ఇక దేశీయంగా సమీకృత కార్గో దిగ్గజంగా ఆవిర్భవించే లక్ష్యంతో సాగుతున్న కంపెనీ రానున్న మూడేళ్ల(2024–27) కాలంలో కంటైనర్ రైల్, వేర్‌హౌసింగ్ విభాగాలలో మార్కెట్ వాటాను పెంచుకునేందుకు వీలు చిక్కనుంది. అయితే కార్గో అంచనా పరిమాణం తగ్గడం, అదానీ గ్రూప్ ఆర్థిక పరిస్థితులు బలహీనపడటం వంటి అంశాలను కీలక రిస్కులుగా భావించవచ్చు.

నేడు స్టాక్ మార్కెట్‌కు సెలవు

అయిదో దశ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నేడు(సోమవారం) మహారాష్ట్రలో పోలింగ్ జరుగనుంది. ఈ నేపథ్యంలో జీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలు సెలవు ప్రకటించాయి. ఫారెక్స్, కమోడిటీ మార్కెట్లు మాత్రం సాయంత్రం ట్రేడింగ్‌లో పనిచేస్తాయి.

ఎవరెడీ ఇండస్ట్రీస్ | కీనోట్ క్యాపిటల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 331
టార్గెట్: రూ. 430
ఎందుకంటే: డ్రైసెల్ బ్యాటరీలు, లైటింగ్ ప్రొడక్టుల దిగ్గజం ఎవరెడీ ఇండస్ట్రీస్ ఇండియా సమీప భవిష్యత్‌లో ప్రోత్సాహకర పనితీరు ప్రదర్శించనుంది. రెండేళ్ల కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం వార్షికంగా 6 శాతం చొప్పున వృద్ధి సాధించే అవకాశముంది. ఈ బాటలో నికర లాభ మార్జిన్లు సైతం ప్రస్తుత 2 శాతం నుంచి 7 శాతానికి మెరుగుపడనున్నట్లు భావిస్తున్నాం. ఇందుకు ప్రధానంగా ప్రీమియం ప్రొడక్టులపై కంపెనీ అత్యధికంగా దృష్టిని సారించడం దోహదపడనుంది. బ్యాటరీల విభాగంలో అల్కాలైన్ ప్రొడక్టులతోపాటు.. రీచార్జబుల్ ఫ్లాష్‌లైట్ అమ్మకాలను పెంచుకునేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. కంపెనీ ప్రమోటర్లయిన బర్మన్ కుటుంబం పటిష్ట కార్పొరేట్ గ్రూప్‌గా గుర్తింపు పొందడమేకాకుండా విజయవంతమైన బిజినెస్‌ల నిర్వహణకు పేరొందింది. వెరసి ఎవరెడీ ఇండస్ట్రీస్‌కు పటిష్ట యాజమాన్య నిర్వహణ లభించడంతోపాటు.. అదనపు విలువ చేకూరే అవకాశముంది. గత కొన్నేళ్లలో బర్మన్ కుటుంబం వివిధ సవాళ్లలోనూ డాబర్ ఇండియాను ప్రగతి పథంలో నడిపిస్తూ ఎఫ్ఎంసీజీ రంగంలో దిగ్గజంగా ఆవిర్భవించేందుకు తోడ్పాటునిచ్చారు. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా ఆదాయంలో స్తబ్దతను చవిచూస్తున్న ఎవరెడీ ఇండస్ట్రీస్.. ఇకపై వృద్ధి ఆధారిత కంపెనీగా పరుగుతీసేందుకు అవకాశముంది. ప్రధానంగా లాభదాయకతను మెరుగుపరచడానికి యాజమాన్యం అధిక ప్రాధాన్యతను ఇవ్వనుంది. ఫలితంగా రానున్న మూడు, నాలుగేళ్లలో ప్రస్తుత ఆదాయాన్ని రెట్టింపునకు పెంచే ప్రణాళికలు ప్రకటించింది. బ్యాటరీలు, ఫ్లాష్‌లైట్ల విభాగాలపై ప్రత్యేక దృష్టి ద్వారా లక్ష్యాన్ని సాధించాలని భావిస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

దీర్ఘకాలంలో గరిష్ట రాబడులు

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బిజినెస్ సైకిల్ ఫండ్



ఫండ్ రివ్యూ

ప్రస్తుతం ఈక్విటీ మార్కెట్ పరిస్థితి ఏంటి? చాలా మందికి ఎదురవుతున్న ప్రశ్న ఇది. కానీ, దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేస్తున్న వారికి మార్కెట్ గమనాలతో పని లేదు. ఎందుకంటే మార్కెట్ అస్థిరతలను అధిగమించి, రాబడులు తెచ్చిపెట్టేవే మ్యూచువల్ ఫండ్స్. మారుతున్న ఆర్థిక, మార్కెట్ పరిస్థితుల్లో దీర్ఘకాలం పాటు పెట్టుబడులు పెట్టే వారికి ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బిజినెస్ సైకిల్ ఫండ్ ఒక ఆకర్షణీయమైన ఆప్షన్ అవుతుంది. క్రమానుగత పెట్టుబడులకే కాదు (సిప్), ఏక మొత్తం పెట్టుబడులకు సైతం దీన్ని పరిశీలించొచ్చు.

రాబడులు

నిఫ్టీ 500 టీఆర్ఐతో పోల్చి చూసినప్పుడు ఈ ఫండ్ రాబడుల చరిత్ర ఎంతో మెరుగ్గా ఉండడాన్ని గమనించొచ్చు. 2021 జనవరి 18న ఈ పథకంలో రూ.10 లక్షలు ఇన్వెస్ట్ చేసి ఉంటే, ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.20.8 లక్షలుగా మారి ఉండేది. అంటే ఏటా 25.7 శాతం కాంపౌండెడ్ వృద్ధికి సమానం. ఈ పథకంలో ఆరంభం నుంచి ప్రతి నెలా రూ.10,000 చొప్పున ఇన్వెస్ట్ చేస్తూ వస్తే 2024 మార్చి 31 నాటికి అసలు పెట్టుబడి రూ.3.9 లక్షలు కాగా, అది రూ.6.1 లక్షలుగా వృద్ధి చెందేది. అంటే ఏటా 28.8 శాతం రాబడికి సమానం. అదే సూచీలో అయితే ఏటా 20.2 శాతం చొప్పున పెరిగేది. గడిచిన ఏడాది కాలంలో బీఎస్‌ఈ 500 టీఆర్ఐ 40.3 శాతం రాబడిని ఇవ్వగా, ఇదే కాలంలో ఈ పథకం 53.70 శాతం ప్రతిఫలాన్ని అందించింది. మూడేళ్ల కాల రాబడులు చూసిన బీఎస్‌ఈ 500 టీఆర్ఐ వార్షికంగా 18.54 శాతం చొప్పున పెరగ్గా.. ఈ పథకంలో పెట్టుబడి ఏటా 23.92 శాతం చొప్పున వృద్ధి చెందడాన్ని గమనించొచ్చు.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్	
కంపెనీ	పెట్టుబడుల
ఐసీఐసీఐ బ్యాంక్	8.46
ఎల్‌అండ్‌టీ	7.00
అల్ట్రాటెక్ సిమెంట్	5.48
మారుతి సుజుకీ	5.33
రిలయన్స్ ఇండస్ట్రీస్	4.99
యాక్సిస్ బ్యాంక్	4.81
భారతీ ఎయిర్‌టెల్	4.38
ఎక్స్‌ట్రా కార్ప్ హార్వెస్ట్	3.99
హీరో మోటోకార్ప్	3.45
కమిన్స్ ఇండియా	3.07



పెట్టుబడుల విధానం

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బిజినెస్ సైకిల్ ఫండ్ ఒక్కటే చోట గిరిగీసుకుని ఆగిపోదు. వివిధ రంగాలు, విభిన్న థీమ్‌లు, భిన్న మార్కెట్ విలువల పరిధిలో ఆకర్షణీయమైన పెట్టుబడుల అవకాశాలను సొంతం చేసుకునే విధంగా పనిచేస్తుంది. టాప్‌డౌన్ విధానంలో బిజినెస్ సైకిల్స్‌ను గుర్తించి ఇన్వెస్ట్ చేస్తుంటుంది. ఎందులోనూ కనీసం, గరిష్ఠం అనే పరిమితులు ఈ పథకానికి లేవు. దేశీయంగా, అంతర్జాతీయంగా బలమైన వృద్ధి నమోదవుతున్న సందర్భాల్లో మెటల్స్, మైనింగ్, ఆయిల్‌పై పెట్టుబడులు పెడుతుంది. దేశీయంగా అదే కాలంలో కన్జ్యూమర్ డ్యూరబుల్స్, క్యాపిటల్ గూడ్స్, బ్యాంకింగ్, ఆటో, ఇన్‌ఫ్రాపై ఇన్వెస్ట్ చేస్తుంది. ఆర్థిక వృద్ధి మందగించిన వేళ టెలికం, ఎఫ్ఎంసీజీ, దేశీయ యుటిలిటీల వంటి సురక్షిత రంగాల్లో పెట్టుబడులు పెంచుకుంటుంది.

పోర్ట్‌ఫోలియో


ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.8,227 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో ఈక్విటీల్లో 86.44 శాతాన్ని ఇన్వెస్ట్ చేసింది. 12.87 శాతం నగదు రూపంలో కలిగి ఉంది. మార్కెట్లో అస్థిరతలు పెరిగిన ప్రస్తుత తరుణంలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్టు అర్థం చేసుకోవచ్చు. పెట్టుబడుల్లో 55 శాతాన్ని దేశీయ వినియోగంపై ఆధారపడిన కంపెనీలకే కేటాయించింది. పెట్టుబడుల్లో 87 శాతాన్ని లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయగా, 10 శాతం వరకు మిడ్‌క్యాప్ కంపెనీలకు, 2.80 శాతం స్మాల్‌క్యాప్ కంపెనీలకు కేటాయించింది. పెట్టుబడుల్లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్, ఇండస్ట్రియల్స్, కన్జ్యూమర్ డిస్క్రిషనరీ, ఎనర్జీ, యుటిలిటీస్ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. 50 శాతం పెట్టుబడులు ఈ రంగాల కంపెనీల్లోనే ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-5-2024 ఫామ్ ధర...	
విశాఖ	550–00
చిత్తూరు	628–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	550–00
వరంగల్	552–00
రిటైల్ ధర	6.10

రెయిన్‌బో హాస్పిటల్స్ లాభం రూ. 51 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లాభం సుమారు 5 శాతం క్షీణించి రూ. 51 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం క్యూ4లో ఇది రూ. 54 కోట్లు. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 317 కోట్ల నుంచి రూ. 341 కోట్లకు చేరింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో 280 పడకలతో 3 ఆస్పత్రులను కంపెనీ ప్రారంభించింది. కీలకమైన విస్తరణ పనులు పూర్తి కావడంతో ఇకపై కొత్త, ప్రస్తుత హాస్పిటల్స్ కార్యకలాపాలను పటిష్టం చేసుకోవడంపై మరింతగా దృష్టి పెట్టనున్నట్లు సంస్థ సీఎండీ రమేష్ కంచర్ల తెలిపారు. కంపెనీ రూ. 10 ముఖవిలువ చేసే ప్రతి షేరుకు రూ. 3 తుది డివిడెండు ప్రకటించింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయం రూ. 1,174 కోట్ల నుంచి రూ. 1,297 కోట్లకు పెరగ్గా, లాభం రూ. 212 కోట్ల నుంచి రూ. 218 కోట్లకు చేరింది.



ఫండ్ స్ట్రీట్

శామ్‌కో స్పెషల్ ఆపర్చూనిటీస్ ఫండ్

శామ్‌కో అసెట్ మేనేజ్‌మెంట్ తాజాగా స్పెషల్ ఆపర్చూనిటీస్ ఫండ్‌ని ఆవిష్కరించింది. సంస్కరణలు, కార్పొరేట్ యాక్షన్స్ వంటి 10 రకాల సందర్భాల్లో తలెత్తే పెట్టుబడి అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా ఇన్వెస్టర్లకు మెరుగైన రాబడులు అందించడం ఈ ఫండ్ లక్ష్యం. పన్నుపరమైన ప్రయోజనాలు కూడా అందించే విధంగా ఈ ఫండ్ ఉంటుంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ మే 31న ముగుస్తుంది.


బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ మల్టీ అసెట్ ఫండ్

బజాజ్ ఫిన్‌సర్వ్ అసెట్ మేనేజ్‌మెంట్ (బజాజ్ ఫిన్ సర్వ్ ఏఎంసీ) కొత్తగా మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సాధనాలు, డెట్ డెరివేటివ్స్.. డెట్, మనీ మార్కెట్ సాధనాలు, గోల్డ్ ఈటీఎఫ్‌లు, సిల్వర్ ఈటీఎఫ్‌లు, రీట్స్, ఇన్విట్స్ మొదలైన వాటిల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ మే 27 వరకు అందుబాటులో ఉంటుంది. నిఫ్టీ 50 టీఆర్ఐ, నిఫ్టీ షార్ట్ డ్యూరేషన్ డెట్ ఇండెక్స్, దేశీ పసిడి ధరలు ఈ ఫండ్‌కు బెంచ్‌మార్క్.

వైట్‌ఓక్ క్యాపిటల్ స్పెషల్ ఆపర్చూనిటీస్ ఫండ్

వైట్‌ఓక్ క్యాపిటల్ ఫండ్ తాజాగా స్పెషల్ ఆపర్చూనిటీస్ ఫండ్‌ను ప్రవేశపెట్టింది. మే 29తో ఇది ముగుస్తుంది. కార్పొరేట్ రీస్ట్రక్చరింగ్ (విలీనాలు, కొనుగోళ్ల వంటివి), ప్రభుత్వ పాలసీలు లేదా నియంత్రణ నిబంధనల్లో మార్పులు, టెక్నాలజీ వల్ల వచ్చే విప్లవాత్మకమైన మార్పులు, కొత్త ధోరణులు వంటి ప్రత్యేక సందర్భాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవడంపై ఈ ఫండ్ ప్రధానంగా దృష్టి పెడుతుంది.

అయితే ఒత్తిడి.. లేదంటే నిరాశ!



అన్ని వయసులవారిలో పెరుగుతున్న మానసిక సమస్యలు

- కొందరిలో ఆత్మహత్యకు ప్రేరేపిస్తున్న మానసిక రుగ్మతలు
- ఇలాంటివారికి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ప్రభుత్వం కాల్‌సెంటర్‌ల ఏర్పాటు
- 'టెలీమానస్'ను సంప్రదించిన 47వేల మంది బాధితులు

అయితే ఒత్తిడి... లేదంటే నిరాశ.. నిస్పృహ వంటి మానసిక సమస్యల బారినపడుతున్నవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కరోనా మహమ్మారి వ్యాప్తి నేపథ్యంలో విధించిన లాక్ డౌన్ చాలామందిలో మానసికశక్తిని దెబ్బతీసింది. దీనికితోడు వివాహ బంధాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, విద్యా, ఉద్యోగం, అనారోగ్యం.. ఇతరత్రా కారణాలతో మానసిక సమస్యలతో సతమతమయ్యేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. దేశంలో సుమారు 15కోట్ల మంది మానసిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని రెండేళ్ల క్రితం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్(ఎన్‌ఐఎంహెచ్ఏఎన్ఎస్) సర్వే వెల్లడించింది.

-సాక్షి, అమరావతి

ఒత్తిడితో సతమతం

రాష్ట్రంలో మానసిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారి కోసం వైద్యశాఖ విశాఖపట్నం, విజయవాడలలో 24/7 పనిచేసేలా ప్రత్యేకంగా టెలీమానస్ కాల్ సెంటర్‌లను ఏర్పాటుచేసింది. ఈ కాల్ సెంటర్‌లలో కౌన్సెలర్‌లు, సైకియాట్రిస్టులు అందుబాటులో ఉంటారు. విజయవాడలో 2022, అక్టోబర్‌లో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయగా, ఇప్పటివరకు 44,862మంది సంప్రదించారు. అదేవిధంగా విశాఖలో జనవరిలో ప్రారంభించిన కాల్ సెంటర్‌ను ఇప్పటివరకు 2,141మంది సంప్రదించి తమ సమస్యలు వివరించి కౌన్సెలింగ్ పొందారు. కాల్ సెంటర్‌లను సంప్రదించిన వారిలో ఒత్తిడి, నిరాశలతో బాధపడుతున్నవారే అధికంగా ఉంటున్నారు. కరోనా సమయంలో లాక్‌డౌన్ కారణంగా ఎక్కువ రోజులు ఒంటరిగా గడపడం, కుటుంబ సభ్యులు, సన్నిహితులు మృత్యువాత పడటం.. ఆర్థికంగా ఇబ్బందులు పెరగడం వంటి కారణాలతో తాము ఒత్తిడి, నిరాశలకు గురైనట్లు బాధితులు వెల్లడిస్తున్నారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థులు సైతం కాల్ సెంటర్‌లను సంప్రదిస్తున్నారు. 'తల్లిదండ్రులు మా అభిరుచులు, సామర్థ్యాలు పట్టించుకోకుండా మంచి మార్కులు రావాలని ఒత్తిడి చేస్తున్నారు. ఐఐటీ, నీట్‌లో ర్యాంక్‌లు సాధించాలంటున్నారు. విద్యాసంస్థలు సైతం మార్కులు, ర్యాంక్‌ల కోణంలోనే వేధిస్తున్నాయి. ఈ ధోరణుల మధ్య తాము తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాం.' అని విద్యార్థులు చెబుతున్నారు.

'నీట్–యూజీ రాశాను మంచి ర్యాంక్ వస్తుందో.. లేదో.. అని భయంగా ఉంది. అమ్మానాన్నలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మంచి ర్యాంక్ రాకుంటే వాళ్లు ఏం అంటారోనని భయమేస్తోంది. రాత్రిళ్లు నిద్ర కూడా పట్టడం లేదు. తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాను.'

- ఇటీవల 'టెలీమానస్'కు కాల్ చేసిన ఇంటర్ పూర్తయిన ఓ విద్యార్థి

'ఓ వైపు ఆఫీస్... మరోవైపు ఇల్లు... ఇలా రెండుచోట్లా సమస్యలు వేధిస్తున్నాయి. మానసిక ప్రశాంతత కోల్పోతున్నాను. జీవితంలో ఇక ఏమీ సాధించలేనేమో. రోజురోజుకు నాకు జీవితంపై ఆశ లేకుండాపోతోంది.'

- ఇటీవల 'టెలీమానస్'కు కాల్ చేసిన ఓ ప్రైవేట్ ఉద్యోగి

428మందిని రక్షించిన కాల్‌సెంటర్

తీవ్ర మానసిక సమస్యలతో బాధపడుతున్న కొందరు ఆత్మహత్యలకు పాల్పడాలని ఆలోచిస్తున్నారు. ఈ క్రమంలో పలు కారణాలతో ఆత్మహత్య ధోరణి (సూసైడ్ టెండెన్సీ)లో ఉన్న 428మందికి పైగా వ్యక్తులు కాల్‌సెంటర్‌లను సంప్రదించారు. అటువంటివారిని గుర్తించి బాధితుల్లో మార్పును తీసుకువచ్చేలా కౌన్సిలర్‌లు, వైద్యులు చర్యలు తీసుకుని రక్షించారు. మందులు, వైద్యుల పర్యవేక్షణ అవసరమైన బాధితులను ఆయా జిల్లాల్లోని మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో పనిచేసే మానసిక వైద్యులకు రిఫర్ చేశారు.

ప్రాథమిక దశలో సంప్రదించడం ఉత్తమం



మానసిక సమస్యలు ఉన్న చాలామంది తమను చూసే వాళ్లు ఏం అనుకుంటారోనని వైద్యులను సంప్రదించడానికి వెనుకడుగు వేస్తారు. దీంతో ఆ వ్యక్తుల్లో సమస్య ముదిరి తీవ్ర మానసిక రోగాల బారినపడతారు. ఈ క్రమంలో ప్రాథమిక దశలోనే కౌన్సెలర్లు, వైద్యులను సంప్రదిస్తే మంచిది. రాష్ట్రంలోని చాలామంది మానసిక సమస్యల బాధితులు 14416 లేదా 180089114416 నంబర్‌కు కాల్ చేసి టెలీమానస్ కాల్ సెంటర్‌ను సంప్రదించి మానసికంగా ఉపశమనం పొందుతున్నారు. నచ్చిన పాటలు వినడం, సినిమాలు చూడటం, విహారయాత్రలకు వెళ్లడం వంటి కార్యకలాపాలు చేస్తే మానసికంగా ప్రశాంతంగా ఉండవచ్చు. ఎప్పుడు ఒంటరిగా ఉండటం, తీవ్రమైన చికాకు, నిరాశ, నిస్పృహ వంటి లక్షణాలు మానసిక సమస్యల బాధితుల్లో ఉంటాయి. కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో ఈ తరహా లక్షణాలతో ఎవరైనా సతమతం అవుతున్నట్లయితే వెంటనే వారిని వైద్యుల వద్దకు తీసుకువెళ్లాలి.

– డాక్టర్ శ్రీకాంత్, న్యూరో సైకియాట్రిస్ట్, టెలీమానస్ కాల్‌సెంటర్, విజయవాడ



గాల్లో తేలిపోతూ.. కార్‌లో ఎగిరిపోతూ..

ఫుల్లు ట్రాఫిక్.. ఐదారు కిలోమీటర్లు వెళ్లాలన్నా అరగంట పట్టేస్తోంది.. హాయిగా గాల్లో ఎగిరెళితే బాగుండు అనిపిస్తుంటుంది కదా..

నిజంగానే అలా ఉన్నచోటు నుంచి గాల్లో ఎగిరెళ్లిపోయే.. ఫ్లయింగ్ కార్ రెడీ అయింది. దాని పేరు హెక్సా.

అమెరికాకు చెందిన 'లిఫ్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇన్ కార్పొరేషన్' సంస్థ దీనిని అభివృద్ధి చేసింది. తాజాగా జపాన్‌లోని టోక్యో నగరంలో జరిగిన 'సుషి టెక్ టోక్యో–2024' కార్యక్రమంలో దీన్ని ప్రదర్శించారు.

పది మీటర్ల ఎత్తులో తిప్పుతూ..

షోలో ఈ ఫ్లయింగ్ కార్‌ను కేవలం బొమ్మలా పెట్టడం కాదు.. గాల్లో తిప్పి మరీ చూపించారు. కారులో కూర్చున్న వ్యక్తి.. దాన్ని పది మీటర్ల ఎత్తులో అటూ ఇటూ తిప్పాడు. ఈ 'హెక్సా' ఫ్లయింగ్ కార్ వెడల్పు 4.5 మీటర్లు, ఎత్తు 2.6 మీటర్లు, 196 కిలోల బరువు ఉంటుందని కంపెనీ వెల్లడించింది. గాల్లో ఎగిరేందుకు 18 ప్రొపెల్లర్లు (మోటార్లు, రెక్కలు) బిగించారు. సెకన్లలోనే ఎటు కావాలంటే అటు తిప్పగలిగేలా ఏర్పాట్లు చేశారు. ఇది రీచార్జబుల్ బ్యాటరీలతో నడుస్తుంది. ఇది గంటకు 100 కిలోమీటర్ల వరకు వేగంతో వెళ్లగలదని కంపెనీ తెలిపింది. నేల మీదేకాదు.. నీటిలోనూ సురక్షితంగా ల్యాండ్ అవుతుందని పేర్కొంది. త్వరలోనే వీటిని అమ్మకానికి పెట్టనున్నట్టు వెల్లడించింది. ఇంతకీ ధరెంతో తెలుసా.. రూ.4.12 కోట్లు మాత్రమే.

భవిష్యత్తు ఫ్లయింగ్ కార్లదే..

కిక్కిరిసిపోయి, అడుగు కూడా కదలని ట్రాఫిక్ సమస్యతో అల్లాడుతున్న నగరాల్లో భవిష్యత్తులో ఇలాంటి ఫ్లైయింగ్ కార్లు దూసుకుపోవడం ఖాయమని సుషి టెక్ షోలో పాల్గొన్న నిపుణులు పేర్కొన్నారు. అత్యవసరమైన మందులు, ఇతర సామగ్రి రవాణాకూ ఇవి అద్భుతంగా తోడ్పడతాయని చెప్పారు. ముఖ్యంగా ప్రమాదాలు, విపత్తులు సంభవించినప్పుడు.. ఫ్లయింగ్ కార్లతో ఎంతో ప్రయోజనం ఉంటుందని టోక్యో గవర్నర్ యురికో కోయికే పేర్కొన్నారు.

సాక్షి, సెంట్రల్‌డెస్క్

మీ పాస్‌వర్డ్ స్ట్రాంగేనా..?

- సులభమైన పాస్‌వర్డ్‌లతో చిక్కులే
- హెచ్చరిస్తున్న సైబర్‌భద్రత నిపుణులు



సాక్షి, హైదరాబాద్: ఏటీఎం, ఆన్‌లైన్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌ల విషయంలో నిర్లక్ష్యం ఏమాత్రం తగదని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొందరు మరిచిపోతామనో..సులభంగా ఉండాలనో ...1111, 1212 తరహా అత్యంత సాధారణ పాస్‌వర్డ్‌లు పెట్టుకునే వారంతా సైబర్ నేరగాళ్లకు డబ్బులు కాజేసే అవకాశమిచ్చినవారవుతారని హెచ్చరించారు. చెక్ పాయింట్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ లిమిటెడ్ నివేదిక ప్రకారం 2024 మొదటి త్రైమాసికంలో భారతదేశంలోని సైబర్ దాడులలో 33%

గణనీయమైన పెరుగుదల నమోదైంది. 3.4 మిలియన్ల పాస్‌వర్డ్‌ల అధ్యయనం తర్వాత పది వీక్ పాస్‌వర్డ్‌లను గుర్తించినట్లు నిపుణులు పేర్కొన్నారు. వీటిలో ఏదైనా సంఖ్యను పిన్ నంబర్ (పర్సనల్ ఐడెంటిఫికేషన్ నంబర్)గా వాడుతుంటే..దాన్ని వెంటనే మార్చుకుని.. ఇతరులు సులువుగా గుర్తించలేని పాస్‌వర్డ్‌ను పెట్టుకోవాలని సూచించారు. అదేవిధంగా తమ, లేదా ఇతర కుటుంబ సభ్యుల పుట్టిన సంవత్సరాలు సైతం పెట్టుకోకపోవడమే ఉత్తమం అని నిపుణులు సూచిస్తున్నారు.

అత్యంత వీక్ పాస్‌వర్డ్‌లు ఇవే...
1234
1111
0000
1212
7777
1004
2000
4444
2222
6969

కిర్గిజ్‌స్థాన్‌లో తెలుగువారు సురక్షితం

- మెడిసిన్ చదువుకు వెళ్లిన నలుగురు ఆంధ్రులు సురక్షిత ప్రాంతాల్లోనే ఉన్నారు
- ఏపీఎన్ఆర్టీఎస్ చైర్మన్ వెంకట్ మేడపాటి

సాక్షి, అమరావతి: కిర్గిజ్‌స్థాన్ (బిష్కెక్)లో తెలుగువారు సురక్షిత ప్రాంతాల్లో ఉన్నారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏపీఎన్ఆర్టీఎస్ ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. కిర్గిజ్‌స్థాన్‌లో భారతీయ విద్యార్థులపై దాడుల జరుగుతున్న నేపథ్యంలో భారతీయ విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కిర్గిజ్‌స్థాన్‌లోని తెలుగువారి కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసినట్టు ఏపీఎన్ఆర్టీఎస్ చైర్మన్ వెంకట్ మేడపాటి తెలిపారు. ఏపీకి చెందిన ప్రజలు, విద్యార్థులు ఏపీఎన్ఆర్టీఎస్ 24/7 హెల్ప్ లైన్ నంబర్లు +91 863 2340678, +91 8500027678 (డబ్ల్యూ)తో పాటు కిర్గిజ్‌స్థాన్‌లోని భారత రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్ 0555710041ను సంప్రదించాలని సూచించారు. ఏపీఎన్ఆర్టీఎస్ ఈ–మెయిల్స్:info@apnrts.com; helpline@apnrts. com; ద్వారా కూడా సంప్రదించొచ్చని పేర్కొన్నారు. భారత విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ఏపీఎన్ఆర్టీఎస్ ఎప్పటికప్పుడు కేంద్రప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పరిస్థితిని తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు మెడిసిన్ చదివేందుకు వెళ్లిన నలుగురు తెలుగు విద్యార్థులు ఉన్నట్లు తెలిసిందని, వీరంతా క్షేమంగా సురక్షిత ప్రదేశాల్లో ఉన్నట్లు తెలిపారు.

'యువ ఆపద మిత్ర'లో చేరండి: సురేశ్ కుమార్

సాక్షి, అమరావతి: భారత్ స్కౌట్స్–గైడ్స్‌కు చెందిన యువతకు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థతో కలిసి సేవలందించే అవకాశాన్ని 'యువ ఆపద మిత్ర' పథకం ద్వారా అందిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు (వరదలు, భూకంపాలు, సునామీ) సంభవించినప్పుడు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థతో పని చేసే విధంగా వీరికి ఏడు రోజుల పాటు శిక్షణ ఇస్తుందన్నారు. అనంతరం అత్యవసర పరికరాల కిట్‌తో పాటు మూడేళ్ల లైఫ్ అండ్ హెల్త్ ఇన్సూరెన్స్ కూడా అందజేస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న 18–40 ఏళ్ల మధ్య యువత ఏడో తరగతిలో ఉత్తీర్ణులైన, శారీరక, మానసిక దృఢత్వంతో స్వచ్ఛందంగా సేవ చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.

స్కిల్ కాంపిటీషన్‌లో సత్తా చాటిన ఏపీ

37 విభాగాల్లో పోటీపడి 13 పతకాలు సాధించిన ఆంధ్రప్రదేశ్



సాక్షి, అమరావతి: జాతీయ స్కిల్ కాంపిటీషన్‌లో ఆంధ్రప్రదేశ్ సత్తా చాటింది. రాష్ట్రం తరఫున పోటీపడిన అభ్యర్థులు ఒక బంగారు పతకం, ఒక రజత పతకంతో సహా 13 పతకాలు సాధించారు. ప్రపంచ స్కిల్ కాంపిటీషన్‌లో భాగంగా ఈ నెల 15 నుంచి నాలుగు రోజుల పాటు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్కిల్ కాంపిటీషన్ పోటీలు ఆదివారం ముగిశాయి. మొత్తం 60 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 900 మంది పాల్గొన్నారు. రాష్ట్రానికి చెందిన 42 మంది సభ్యుల బృందం 37 విభాగాల్లో పోటీ పడి 13 పతకాలు సాధించింది. కాస్మొటిక్ విభాగంలో స్వర్ణ పతకం, మెకానికల్ కేడ్ విభాగంలో రజత పతకంతో పాటు 11 విభాగాల్లో మెడలియన్ ఆఫ్ ఎక్సలెన్స్ పతకాలు గెలుచుకుంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenahalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.